అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక


బుధవారం 8-03-2023

సంపుటి : 9 | సంచిక : 66 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 10 పేజీలు + 12 (టాబ్లాయిడ్) పేజీలు | వెల : 6.50

మహిళ రాణిస్తేనే దేశాభివృద్ధి

సీఎం కేసీఆర్ ఆకాంక్ష

- అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలందరికీ శుభాకాంక్షలు





నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సీఎం కేసీఆర్ మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. పురుషుడితో సమానంగా అవకాశాలను అందిపుచ్చుకుంటూ విభిన్న రంగాల్లో మహిళలు ...2లో

మళ్లీ అధికారంలోకి మేమే..

మరిన్ని సీఐఐ సదస్సులు నిర్వహిస్తాం


- 2030 నాటికి 250 బిలియన్ డాలర్ల పెట్టుబడులు లక్ష్యం : మంత్రి కేటీఆర్



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో 2030 సంవత్సరం నాటికి 250 బిలియన్ డాలర్ల పెట్టుబడులు సాధించాలనేదే తమ లక్ష్యమని పరిశ్రమల శాఖ మంత్రి కే తారకరామారావు అన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి మళ్లీ తామే వస్తామనీ, లైఫ్ సైన్సెస్ రంగంలో పెట్టుబడులకు అనేక అవకాశాలు ఉన్నాయని స్పష్టంచేశారు. మంగళవారంనాడిక్కడ జరిగిన సీఐఐ తెలంగాణ శాఖ వార్షిక సమావేశానికి ఆయన ముఖ్యఅతిధిగా హాజరై, మాట్లాడారు. ఫార్మా పరిశ్రమలకు ఒకేచోట అత్యుత్తమ వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన సంస్థలు అమెజాన్, గూగుల్, మైక్రోసాఫ్ట్, అడోబ్ వంటి సంస్థలు అతిపెద్ద క్యాంపస్‌లను హైదరాబాద్‌లో ఏర్పాటు చేశాయన్నారు.

మళ్లీ తామే అధికారంలోకి వస్తామనీ, పెట్టుబడుల్ని రప్పించి, మరిన్ని సీఐఐ సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు. ఫార్మా పరిశ్రమలకు ఒకేచోట అత్యుత్తమ వసతులు కల్పిస్తున్నామనీ, సుల్తాన్‌పూర్ వద్ద అతిపెద్ద మెడికల్ డివైజెస్ పార్కు ఏర్పాటు చేశామన్నారు. ప్రయివేటు రంగంలో ఉపగ్రహాల తయారీ మొదటిసారి హైదరాబాద్‌లోనే జరిగిందన్నారు. భారత్ బయోటెక్ మేనేజింగ్ డైరెక్టర్ సుచిత్ర ఎల్ల మాట్లాడుతూ దక్షిణాది ప్రాంతం విదేశీ కంపెనీలకు గమ్యస్థానంగా మారిందని చెప్పారు. రాష్ట్రం సాధిస్తున్న వృద్ధి, ప్రోత్సాహకాల వల్లే పెట్టుబడులు వస్తున్నాయని చెప్పారు.



నియంతృత్వమే

పూర్తిస్థాయి నియంత పాలనలోకి వెళ్తున్న టాప్-10 దేశాల్లో భారత్

- 'లిబరల్ డెమొక్రసీ'లో భారత్‌కు 97వ స్థానం
- ఎలక్టోరల్ డెమొక్రసీలో 108వ స్థానం : వి-డెమ్ నివేదిక

V-Dem VARIETIES OF DEMOCRACY

ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్య భావనలు దెబ్బతింటున్నాయి. పూర్తిస్థాయి నియంత తరహా పాలనలోకి వెళ్తున్న దేశాల సంఖ్య 42కు చేరుకుంది. ఇందులోని మొదటి పది దేశాల్లో భారత్ ఉంది. సంకీర్ణ ప్రభుత్వాలు అధికారంలో లేకపోవటం, ఏకపార్టీ పాలన, మైనార్టీ హక్కులకు భంగం, రాజకీయ హింస మొదలైనవి..హంగేరీ, బ్రెజిల్, భారత్, పోలాండ్, టర్కీ..వంటి దేశాల్ని 'నియంతృత్వం' దిశగా తీసుకెళ్తున్నాయి. 2022 చివరి నాటికి ఆ దేశాల్లో నియంతృత్వ పోకడలు పతాక స్థాయికి చేరుకున్నాయి. బలమైన రాజ్యాంగ సంస్థలు, న్యాయ వ్యవస్థ, శాంతిభద్రతలు, మెరుగైన ఆరోగ్య సేవలు ప్రజలకు దక్కాలంటే 'ప్రజాస్వామ్యం' బలంగా ఉండాల్సిందే.

- వి-డెమ్ నివేదిక



న్యూఢిల్లీ : భారత్‌లో ప్రజాస్వామ్యం దెబ్బతింటోంది..నియంత తరహా పాలన బలపడుతోందని 'వి-డెమ్' నివేదిక ప్రమాద ఘంటికలు మోగించింది. ప్రజాస్వామ్య సూచికల్లో గత 10ఏండ్లుగా భారత్ స్థాయి వేగంగా పడిపోతోందని హెచ్చరించింది. 'మతస్వేచ్ఛ' పట్టికలో అట్టడుగునకు చేరుకుంది. పౌర హక్కులు, వాక్ స్వాతంత్ర్యం, ఎన్నికల ప్రజాస్వామ్యం, బలమైన రాజ్యాంగ సంస్థలు..ఇలా అనేక విషయాల్లో భారత్ గణనీయంగా వెనుకపడింది. ఈ ఏడాది లిబరల్ డెమొక్రసీలో భారత్‌కు 97వ స్థానం, ఎలక్టోరల్ డెమొక్రసీలో 108వ స్థానం, సమానత్వంలో 123వ స్థానం...ఊహించిందేనని 'వి-డెమ్' పేర్కొంది. స్వీడన్‌కు చెందిన 'యూనివర్సిటీ ఆఫ్ గోతెన్‌బర్గ్' పరిశోధకులు ప్రతిఏటా ఈ నివేదికను రూపొందిస్తారు. ఆయా దేశాల్లో ప్రజాస్వామ్య భావనలు ఏమేరకు ఉన్నాయన్నది విశ్లేషిస్తూ ర్యాంకులు విడుదల చేస్తారు.

ప్రపంచవ్యాప్తంగా..

2022 నాటికి మొత్తం ప్రపంచ జనాభాలో 72శాతం మంది (సుమారుగా 570 కోట్లమంది) నియంతృత్వ దేశాల్లో నివసిస్తున్నారు. ఆయా దేశాల్లో గత 35ఏండ్లలో ప్రజాస్వామ్యంలో ...5లో

తలసరి ఆదాయం పెరిగిందా? తగ్గిందా?

- నిజమైన వృద్ధిని తెలపదు : ఆర్థిక నిపుణులు

వివరాలు 2లో

బీజేపీ ఎమ్మెల్యేనా..మజాకా..!

ముందస్తు బెయిల్..దర్యాప్తు అధికారుల బదిలీ

- కర్నాటక బీజేపీ ఎమ్మెల్యే లంచం కేసు తీరిది..



(ఫైల్)

బెంగళూరు: ప్రత్యర్థి పార్టీల నేతలపై ఈడీ,సీబీఐలను ఉసిగొల్పుతున్న మోడీ ప్రభుత్వం..కర్నాటకలో బీజేపీ ఎమ్మెల్యే మాదాల్ విరూపాక్షప్ప ఇంట్లో నోట్ల కట్టలు దొరికినా.. ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పైగా ఆయనకు ముందస్తు బెయిల్ లభించేదాకా ఎమ్మెల్యే జోలికివెళ్లలేదు. ఇపుడు లంచం కేసులో దర్యాప్తు చేస్తున్న అధికారులనే మార్చేశారు.

కర్నాటక హైకోర్టు బీజేపీ ఎమ్మెల్యేకు ముందస్తు బెయిల్ మంజూరు చేసి, దర్యాప్తు అధికారుల ముందు హాజరు కావాలని కోరిన తర్వాత ఇలా బదిలీ జరగటం గమనార్హం.


అసలేం జరిగిందంటే...

సాగయ్ రాజ్ ద్వారా: లంచం కేసులో బీజేపీ ఎమ్మెల్యే మాదాల్ విరూపాక్షప్పకు కర్నాటక హైకోర్టు మంగళవారం ముందస్తు బెయిల్ మంజూరు చేయడంతో, ఈ కేసులో దర్యాప్తు అధికారులను మార్చారు.

ఎమ్మెల్యే కుమారుడు ప్రశాంత్ మాదాల్ ..సాగయ్ రాజ్ నుంచి రూ. 40 లక్షలు లంచం తీసుకుంటూ లోకాయుక్త జరిపిన దాడిలో పట్టుబడ్డాడు.క్యాష్ ఫర్ కాంట్రాక్ట్ కుంభకోణంలో, ఎమ్మెల్యే ...5లో

నోట్ల గుట్టలున్న మీ ఎమ్మెల్యేపై చర్యలేవీ?

- ప్రధాని మోడీకి ఆప్ అధినేత సూటి ప్రశ్న..



వివరాలు 5లో

మనువాద ఎజెండాతో బీజేపీ

ప్రజాస్వామ్యం, సమానత్వం కోసం పోరాటం..

- మహిళలపై రోజురోజుకు పెరుగుతున్న దాడులు
- సమానత్వ సాధన కోసం ఐక్య ఉద్యమాలు నిర్మిద్దాం' ఐద్వా సదస్సులో పీకే శ్రీమతి
- పాలకుల విధానాల ఫలితమే స్త్రీలపై దాడులు: మల్లు లక్ష్మి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

డెబ్బైఐదేండ్ల స్వాతంత్ర్య భారతంలో ప్రజాస్వామ్యం, సమానత్వం కోసం పోరాటాలు నిర్వహించాల్సిన దుస్థితి ఏర్పడిందని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) జాతీయ అధ్యక్షులు పీకే శ్రీమతి ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ఆర్ అరుణజ్యోతి అధ్యక్షతన 'సమానత్వ సాధన కోసం ఐక్య ఉద్యమాలు నిర్మిద్దాం' అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా శ్రీమతి మాట్లాడుతూ జనాభాలో సగభాగంగా ఉన్న మహిళలపై పీడన, దోపిడిలేని సమానత్వ సమాజం కోసం పోరాడాల్సిన అవసరం ఏర్పడిందని చెప్పారు. మహిళల సాధికారత, సమానత్వం గురించి రోజూ అందరూ చెబుతున్నప్పటికీ..ఆచరణలో నేటికీ మహిళలపై వివక్ష, దాడులు ...5లో



మాణిక్‌రెడ్డికి టీటీఏ సంపూర్ణ మద్దతు

5లో..

దేశపతికి ఎమ్మెల్సీ

మరో ఇద్దరు కూడా...

- ఎమ్మెల్యే కోటా అభ్యర్థుల్ని ప్రకటించిన సీఎం కేసీఆర్







నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో


శాసనమండలికి ఎమ్మెల్యే కోటా అభ్యర్థులను భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ప్రకటించింది. ఈ పేర్లను ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు ఖరారు చేశారు. తొలిసారిగా దేశపతి శ్రీనివాస్‌కు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారు. అలాగే కుర్మయ్యగారి నవీన్ కుమార్, చల్లా వెంకట్రామిరెడ్డి పేర్లను ఖరారు చేశారు. గురువారం వీరు ఎమ్మెల్సీ అభ్యర్థులుగా నామినేషన్ వేయనున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాటు చూడాలని సీఎం కేసీఆర్ శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి పల్లా రాజేశ్వర్‌రెడ్డిని ...5లో

కమ్యూనిస్టులకు పూర్వవైభవం తెస్తాం

మునుగోడులో బీజేపీ ఓటమితో వామపక్షాలకు మరింత ఆదరణ

- వీర తెలంగాణ గడ్డలో మతోన్మాదులకు స్థానం లేదు
- విభజన హామీలను అమలు చేయని మోడీ ప్రభుత్వం
- గిరిజనులు, దళితుల హక్కులు కాలరాస్తున్న కేంద్రం
- అటవీ హక్కుల చట్ట సవరణతో జీవనాధారం మీద దాడి
- జనాన్ని చైతన్యం చేయడం దేశాన్ని రక్షించడమే మా లక్ష్యం
- నవతెలంగాణతో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్





'తెలంగాణలో కమ్యూనిస్టులకు పూర్వవైభవం తెస్తాం. మునుగోడులో బీజేపీ ఓటమి తర్వాత వామపక్షాలకు ప్రజల్లో ఆదరణ పెరిగింది. రాష్ట్రాన్ని మతోన్మాద శక్తుల నుంచి కాపాడుకోవాల్సిన బాధ్యత మాపై ఉన్నది. వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం సాగిన ఈ గడ్డలో మతోన్మాదులకు స్థానం లేదు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పదేండ్లవుతున్నా ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని హామీలను అమలు చేయడం లేదు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, ఖాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయడంలో పూర్తిగా విఫలమైంది. అప్రజాస్వామిక విధానాలు, మతోన్మాద చర్యలు, విద్వేషాలు పెంచి రాజకీయ ప్రయోజనాలు పొందే అంశాలను ప్రజలకు వివరిస్తాం. వారిలో చైతన్యం పెంపొందించి దేశాన్ని కాపాడుకోవడమే మా లక్ష్యం'అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ అన్నారు. సీపీఐ(ఎం) ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జనచైతన్య యాత్ర నేపథ్యంలో పోతినేని సుదర్శన్ నవతెలంగాణ ప్రతినిధి బొల్లె జగదీశ్వర్‌కు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలు...

ములాఖాత్

కమ్యూనిస్టుల ప్రాబల్యం బలంగా ఉన్న నియోజకవర్గాల్లో బస్సుయాత్ర చేపడుతున్నారు. దీనిద్వారా ప్రజలకు ఏం చెప్పదలుచుకున్నారు?

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నది. వాటిని ప్రజలకు చెప్పి చైతన్యపరచడమే ఈ యాత్ర లక్ష్యం. దేశంలో ప్రజాస్వామ్యం మీద దాడి జరుగుతున్నది. మతసామరస్యానికి, సామాజిక న్యాయానికి విఘాతం కలుగుతున్నది. దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నది. సీపీఐ(ఎం) బలంగా ఉన్న ప్రాంతాల్లోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఈ యాత్రను నిర్వహిస్తున్నాం. కమ్యూనిస్టులు బలంగా ఉన్న జిల్లాలున్నాయి. అక్కడున్న ప్రజలను చైతన్యపరిచే ...2లో



మహిళా జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

- అనేక కార్యక్రమాలు, పథకాల అమలు : మంత్రి కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం మహిళా జర్నలిస్టుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు, పథకాలు అమలు చేస్తున్నదని రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కె.టి.రామారావు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర సమాచార శాఖ ఆధ్వర్యంలో మహిళా జర్నలిస్టులకు పీపుల్స్ ప్లాజాలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మహిళా జర్నలిస్టులకు వి-హబ్ ద్వారా 2 రోజుల కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. జర్నలిస్టుల కుటుంబాలకు మెడికల్ క్యాంపులు కూడా ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. మహిళ జర్నలిస్టులు ఒక సంఘాన్ని ఏర్పాటు చేసుకుని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు రావాలని సూచించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 19 వేల మంది జర్నలిస్టులకు ప్రభుత్వ గుర్తింపు కార్డులు ఇచ్చామన్నారు. గుజరాత్‌లో కేవలం 3 వేలు కార్డులు మాత్రం ఉన్నాయన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారనీ, సమర్థవంతంగా పని చేస్తున్నారని కొనియాడారు. మీడియా సంస్థలు కూడా పాజిటివ్ ప్రచారం చేయాలని కోరారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఆయా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్న 138 మంది మహిళ జర్నలిస్టులకు మంత్రి ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు. మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా పురస్కార గ్రహీతలు అవార్డులను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు జగదీష్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, సబితా ఇంద్రారెడ్డి, సీఎస్ శాంతి కుమారి, సమాచార శాఖ కమిషనర్, మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అరవింద్ కుమార్, సమాచార శాఖ డైరెక్టర్ రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం, సంపదకు హైదరాబాద్ గమ్యస్థానం

- కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రశంసలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆరోగ్యం, సంపదకు హైదరా బాద్ గమ్యస్థానంగా మారిందనీ, చాలా అవకాశాలతో ప్రపంచానికి ఫార్మా రాజధాని అయిందని కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్ ప్రశంసించారు. మంగళవారం హైదరాబాద్ తార్నాకలోని సీఎస్ఐఆర్-ఐఐసీటీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఒక వారం-ఒక పరిశోధనా కేంద్రం వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాణాలను నిలిపే ఔషధాల అభివృద్ధిలో సీఎస్ఐఆర్ కీలక పాత్ర పోషిస్తు న్నదని తెలిపారు. మంత్రి సమక్షంలో సీఎస్ఐఆర్-ఐఐసీటీ మంగళూరు రిఫైనరీ అండ్ పెట్రో కెమికల్స్ లిమిటెడ్ (ఎంఆర్‌పీఎల్)తో ఒప్పందం చేసుకున్నది. దీని ద్వారా ఎంఆర్ పీఎల్ మాస్టర్ రీసర్చ్ అలయెన్స్ అగ్రిమెంట్‌లో ప్రవేశించినట్లైంది. అదే విధంగా మధుమేహ వ్యాధిగ్రస్తులు ప్రాథమికంగా వాడే మెటఫార్మిన్ ఔషధ ముడి సరుకును దేశీయంగా అభివృద్ధి చేసే సాంకేతికతను పొందేందుకు వీలుగా గ్రాన్యుల్స్ ఇండియా లిమిటెడ్ ఐఐసీటీతో ఎంఓయూ ఒప్పందం కుదుర్చుకుంది. పీజీ విద్యార్థు ల్లో నైపుణ్య శిక్షణకు వీలుగా అర్జైన్, కెవనీ ల్యాబ్ వే ఇండియా ప్రయివేట్ లిమిటెడ్‌తోనూ ఐఐసీటీ ఒప్పందం కుదిరింది. ఈ కార్యక్రమంలో సీఎస్ఐఆర్ - ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ డి.శ్రీనివాస్ రెడ్డి, భారత్ బయోటెక్ డాక్టర్ క్రిష్ణ ఎల్లా, ఎంఎస్ఎన్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ సీఎండీ డాక్టర్ ఎంఎస్ఎన్ రెడ్డి, సీనియర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ రామానుజ్ నారాయణ్, చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ డి.శైలజ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ ఫుడ్స్ స్నాక్స్ విడుదల

సీఎస్ఐఆర్ -ఐఐసీటీ అభివృద్ధి చేసిన సాంకేతికతో ఎస్‌డీజీ హెల్త్‌కేర్‌కు చెందిన తొమ్మిది రకాల సూపర్ ఫుడ్స్ స్నాక్స్ ప్యాకెట్లను ఆయన విడుదల చేశారు. వీటిని తీసుకోవడం ద్వారా జీవనశైలి మార్పుల కారణంగా వస్తున్న ఊబకాయం తదితర సమస్యల నుంచి బయటపడవచ్చని సూపర్ ఫుడ్స్ సీఈవో డాక్టర్ ప్రణవ్ తెలిపారు. ఇందులో ఇది సహజ సిద్ధంగా దొరికే వాటి నుంచి లభించే పౌష్టిక, ఔషధ విలువలు కలిగి ఉంటాయని చెప్పారు. ఇవి పౌష్టికాహార లోపంతో బాధపడే చిన్నారులకు అత్యంత ఉపయోగకరమని వెల్లడించారు.

మహిళ రాణిస్తేనే దేశాభివృద్ధి

(మొదటిపేజీ తరువాయి)

సాధిస్తున్న అపూర్వమైన విజయాలు నారీశక్తిని చాటుతున్నాయని సీఎం అన్నారు. మంగళవారం ఈమేరకు సీఎం కేసీఆర్ ఒక ప్రకటన విడుదల చేశారు. మహిళలు అన్నిరంగాల్లో పురోగమించిన నాడే దేశాభివద్ధి సంపూర్ణమవుతుందని ఆకాంక్షించారు. 'యత్ర నార్యస్తు పూజ్యంతే, రమంతే తత్ర దేవత్హా' అనే ఆర్యోక్తికి అనుగుణంగా సామాజిక విలువలను మరింతగా తీర్చిదిద్దుకోవాల్సిన అవసరముందని తెలిపారు. స్త్రీశక్తి చాటే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని గుర్తు చేశారు. మహిళా సాధికారతను సంపూర్ణంగా సాధించేందుకు, వారి గౌరవాన్ని పెంపొందిస్తూ, స్త్రీజనోద్ధరణే లక్ష్యంగా ఎన్నో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను అమలు పరుస్తున్నదని చెప్పారు. మహిళా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగులు మహిళలకు ప్రత్యేక సెలవును మంజూరు చేసి మహిళలను సమున్నతంగా గౌరవించుకుంటున్నామని పేర్కొన్నారు. తొమ్మిదేండ్ల పాలనలో మహిళల అభ్యున్నతి, సాధికారతే లక్ష్యంగా వారి సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ప్రవేశపెట్టిన పథకాలతో రాష్ట్రం మహిళా సంక్షేమ రాష్ట్రంగా వెలుగొందుతున్నదని సీఎం తెలిపారు.

ఆడబిడ్డ తల్లి కడుపులో ఎదుగుతున్న దశ నుంచి ఆ బిడ్డ జననం, ఆరోగ్యం, రక్షణ, సంక్షేమం, విద్య వివాహం, వికాసం, సాధికారత లక్ష్యంగా గొప్ప పథకాలను అమలు చేస్తూ ఆడబిడ్డను కంటికిరెప్పలా రాష్ట్ర ప్రభుత్వం కాపాడుకుంటున్నదని సీఎం వివరించారు. మహిళా సర్వతోముఖాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సమర్థవంతమైన కార్యాచరణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని సీఎం వివరించారు.

కమ్యూనిస్టులకు పూర్వవైభవం తెస్తాం

(మొదటిపేజీ తరువాయి)

బాధ్యత మాపై ఉన్నది.

మునుగోడులో బీఆర్ఎస్ విజయంతో కమ్యూనిస్టుల బలం మరోసారి రుజువైంది. దీన్ని నిలబెట్టుకునేందుకు ఎలాంటి ప్రణాళికలతో ప్రజల ముందుకెళ్తున్నారు? కమ్యూనిస్టులకు పూర్వవైభవం వస్తుందని భావిస్తున్నారా?

కచ్చితంగా వస్తుంది. అయితే ఈ యాత్ర ద్వారా మాత్రమే వస్తుందని మేం భావించడం లేదు. మునుగోడు ఎన్నికలకు ముందు, ఎన్నికల తర్వాత అన్నట్టుగా కమ్యూనిస్టుల ప్రాధాన్యతను ప్రతిఒక్కరూ గుర్తించక తప్పదు. మాకు ఎదురులేదు, ఏమైనా చేయగలమని భావించి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఉన్న రాజగోపాల్‌రెడ్డిని రాజీనామా చేయించి ఉప ఎన్నికలను తెచ్చింది బీజేపీ. గెలుస్తామంటూ వందల కోట్ల రూపాయలు ఖర్చు చేసింది. మా రాజకీయ విధానం ప్రకారం అక్కడ బీజేపీని ఓడించాం. బీఆర్ఎస్‌కు మద్దతు ప్రకటించినపుడు ప్రజల్లో కొంత అసహనం వ్యక్తమైంది. కానీ ఫలితాల తర్వాత సీపీఐ(ఎం) వైఖరి సరైందేనని సానుకూల వాతావరణం వచ్చింది. సీపీఐ(ఎం) ఇతర వామపక్షాల కృషి ఫలితంగా ఈ రాష్ట్రంలో మతోన్మాదులకు స్థానం లేకుండా పోయింది.

హిందూత్వ పేరుతో ఆర్ఎస్ఎస్, బీజేపీ చాపకింద నీరులా విస్తరిస్తున్నాయి. దీన్ని ఎలా నిలువరిస్తారు?

ఆర్ఎస్ఎస్, బీజేపీ చాపకింద నీరులా విస్తరించేందుకు ప్రయత్నిస్తున్నాయి. బీజేపీ బహిరంగంగా మతోన్మాద ధోరణిని అవలంభిస్తున్నది. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ మత విద్వేషాలను రెచ్చగొట్టే వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం. తలకెక్కిన హిందూ మతోన్మాదానికి పరాకాష్ట. ప్రజల డబ్బుతో అంబేద్కర్ పేరుతో నిర్మించిన సచివాలయాన్ని గుమ్మటాలను కూలుస్తామంటున్నారు. మతతత్వం, ఉన్మాదాన్ని బయటపెడుతున్నారు. రాష్ట్రంలో అనేక సమస్యలున్నాయి. కానీ మతం పేరుతో ప్రజలను విభజించి రాజకీయంగా లబ్దిపొందాలని భావిస్తున్నారు. వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం సాగిన గడ్డ ఇది. టీచర్ మల్లిఖార్జున్, హేతువాది భైరి నరేష్‌పై దాడులు జరుగుతున్నాయి. అధికారంలోకి వస్తే యూపీ తరహాలో తెలంగాణలోనూ బుల్డోజర్లను తెస్తామంటున్నారు బండి సంజయ్. దీన్ని ప్రజలకు వివరిస్తాం. లౌకికతత్వాన్ని, ప్రజాస్వామ్యాన్ని మన ప్రజలు గౌరవిస్తారు. ఈ ప్రాంతంలో మతోన్మాద చర్యలకు ఆస్కారముండదు. జనాన్ని చైతన్యం చేయడం, ఈ దేశాన్ని రక్షించుకోవడం కోసమే ఈ యాత్ర. ఆర్ఎస్ఎస్ మతోన్మాద చర్యలను ఎండగడతాం. తెలంగాణ సమాజం నుంచి వారిని వేరుపరిచి బలహీనపరుస్తాం.

బీజేపీకి ప్రజా సమస్యల గురించి ఆలోచనే లేదు

అసెంబ్లీ సమావేశాల్లో బీజేపీ ఎమ్మెల్యేలు పేదల సమస్యలను ప్రస్తావించలేదు. వాళ్లు కూర్చోవడానికి అసెంబ్లీలో గది కావాలన్నారు. పేదలు, కౌలు రైతులు, పోడు రైతుల సమస్యలను ప్రస్తావించలేదు. గుడిసెలు వేసుకున్న పేదలపై బీజేపీ నాయకులు కొన్ని ప్రాంతాల్లో దాడి చేస్తున్నారు. పెత్తందార్లకు అండదండగా ఉన్నారు. దేశంలో అంబానీ, అదానీలకు బీజేపీ ప్రభుత్వం అండగా ఉన్నది.



సీపీఐ(ఎం), ఇతర వామపక్షాల ఆధ్వర్యంలో భూపోరాటాలు, ఇండ్ల స్థలాల పోరాటాలు ఊపందుకున్నాయి. పేదలు పెద్ద సంఖ్యలో కదులుతున్నారు కదా?

ఇల్లు, తిండి, బట్ట, ఉపాధి వంటి అంశాలు మా యాత్రలో ప్రస్తావిస్తాం. వేలాది మంది ఇండ్లు లేని పేదలు 50, 40, 30 గజాల్లో గుడిసెలు వేసుకుని నివాసముంటున్నారు. ఈ సమస్యలను పట్టించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తాం. మునుగోడు ఉప ఎన్నికల సందర్భంలో ఈ అంశాలను సీఎం కేసీఆర్ దృష్టికి తెచ్చాం. రాష్ట్ర ప్రభుత్వం కూడా సమస్యలను పరిష్కరించాలని కోరతాం.

భూపోరాటాలు, ప్రజా సమస్యలపై బీజేపీ వైఖరి ఎలా ఉంది. పేదల పక్షాన నిలుస్తున్నదా? కొన్ని చోట్ల ఆ పార్టీ నేతలే ప్రజలపై దాడులు చేస్తున్నారని వార్తలొస్తున్నాయి కదా?

బీజేపీకి ఈ సమస్యల గురించి ఆలోచనే లేదు. అసెంబ్లీ సమావేశాల్లో బీజేపీ ఎమ్మెల్యేలు పేదల సమస్యలను ప్రస్తావించలేదు. వాళ్లు కూర్చోవడానికి అసెంబ్లీలో గది కావాలన్నారు. పేదలు, కౌలు రైతులు, పోడు రైతుల సమస్యలను ప్రస్తావించలేదు. గుడిసెలు వేసుకున్న పేదలపై బీజేపీ నాయకులు కొన్ని ప్రాంతాల్లో దాడి చేస్తున్నారు. పెత్తందార్లకు అండదండగా ఉన్నారు. దేశంలో అంబానీ, అదానీలకు బీజేపీ ప్రభుత్వం అండగా ఉన్నది. సమస్యలను పట్టించుకోకుండా అధికారం కోసం ప్రజల మధ్య మతం ప్రాతిపదికన చీలికలు తెస్తున్నారు. తద్వారా రాజకీయ లబ్దిపొందాలని చూస్తున్నారు.

బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ సాధ్యం కాదని కేంద్రం తేల్చి చెప్పింది. విభజన హామీలను అమలు చేయడం లేదు. ప్రజల్లో బీజేపీ తీరు పట్ల ఎలాంటి అభిప్రాయం ఉన్నది.?

చట్ట ప్రకారం ఆ ప్రాంత ప్రజలకు రావాల్సిన ప్రయోజనాలు, అభివృద్ధిని విస్మరించడం వల్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉన్నది. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, ఖాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ విభజన హామీల్లో ఉన్నది. పదేండ్లు పూర్తవుతున్నది. గిరిజన విశ్వవిద్యాలయం వంటి అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వంపై ఏదో ఒక సాకు చూపి తప్పించుకునే ప్రయత్నం కేంద్రం చేస్తున్నది. దీనిపట్ల మహబూబాబాద్, ములుగు, భద్రాచలం జిల్లాల్లోని ప్రజల్లో వ్యతిరేకత ఉన్నది. దక్షిణ తెలంగాణలో ఐఐఎం ఏర్పాటు చేయాలి. దాని ప్రస్తావనలేదు. మతం మారిన గిరిజనులకు ఎస్టీ రిజర్వేషన్లు వర్తించబోవంటూ ఓ బీజేపీ నాయకుడు కరపత్రం వేశారు. దానివల్ల గిరిజనుల్లో విభజన తేవాలని ప్రయత్నిస్తున్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కుకు పూర్తి భిన్నంగా వ్యవహరిస్తున్నారు. ప్రజాసంక్షేమం, అభివృద్ధి గురించి కేంద్రం పట్టించుకోవడం లేదు. చట్టప్రకారం హామీ ఉన్నా అమలు చేయడం లేదు. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో బయ్యారం ఉక్కు తెలంగాణ హక్కు పెద్ద కార్యక్రమం చేశాం. పాదయాత్ర నిర్వహించాం. 800 కేంద్రాల్లో బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని నిరసనలు చేపట్టాం. రక్షణ స్టీల్ సంస్థకు కట్టబెట్టాలని వైఎస్ ప్రభుత్వం ప్రయత్నిస్తే ఎండగట్టాం. తెలంగాణ పట్ల బీజేపీ వివక్షను చూపిస్తున్నది.

పోరాటాల గడ్డ తెలంగాణలోకి ప్రవేశించేందుకు బీజేపీ వేస్తున్న ఎత్తుగడలు ఏంటీ? వాటిని తిప్పికొట్టేందుకు మీ ముందున్న ప్రణాళికలు ఏంటీ?

దేశంలో అధికారాన్ని ఉపయోగించుకుని విస్తరించాలని భావిస్తున్నారు. ప్రజలను మతం పేరుతో విభజించాలని చూస్తున్నది. సమస్యలను పరిష్కరించి అభివృద్ధి చేసి విస్తరించాలని అనుకోవడం లేదు. ఈడీ, ఐటీ, సీబీఐ, ఈసీని దుర్వినియోగం చేస్తున్నది. న్యాయవ్యవస్థ స్వయంప్రతిపత్తిని ప్రశ్నార్థకం చేస్తున్నది. ఈ రకంగా ఇక్కడ చొరబడాలని చూస్తున్నది. అది సాధ్యం కాదు. కమ్యూనిస్టులతోపాటు ఇతర లౌకిక, ప్రజాతంత్ర, అభ్యుదయ, సామాజిక శక్తులను కూడగడతాం. బీజేపీ అనుసరిస్తున్న విధానాలను వివరించి వెనక్కి కొట్టే పనిచేస్తాం.

పోలవరం ముంపు ప్రాంతాల పేరుతో ఏడు మండలాలను ఏపీలో కలపడంతో అక్కడి ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయంటున్నారు. వాస్తవాలేంటీ?

మోడీ అధికారంలోకి వచ్చాక ఏడు మండలాలను ఏపీలో కలుపుతూ మొదటి ఆర్డినెన్స్‌ను తెచ్చారు. దేశ అవసరాలరీత్యా కలపలేదు. పోలవరం ప్రాజెక్టు నీటి ముంపునకు ఆ ప్రజలను ఎరవేయడం. ఆర్డినెన్స్ అంటే ఆ ప్రజల ఉరితీత. ముంపు లేకుండా ధర్మారావు, విద్యాసాగర్, హనుమంతరావుతో సంప్రదించి ప్రత్యామ్నాయం గురించి వివరించాం. ప్రజలను కాపాడే డిజైన్‌ను చూపెట్టాం. బీజేపీ అధికారంలోకి వచ్చాక ప్రజలను ముంచే పని చేసింది. భద్రాచలం పట్టణంలో 71 అడుగుల నీటిమట్టం వస్తే ఎలాంటి ముంపు ఉండేది కాదు. కానీ ఇప్పుడు 55 అడుగులు వస్తేనే ముంపునకు గురవుతున్నది. ప్రజలకు మంచిచేసే పార్టీగా సీపీఐ(ఎం) ఉన్నది. ప్రజలను ముంచే పార్టీగా బీజేపీ ఉన్నది. దీన్ని ప్రజల్లోకి తీసుకెళ్తాం.


పోడు భూముల పంపిణీ, కేంద్రం ఇచ్చిన గిరిజన చట్ట సవరణ, ఆదివాసీ గిరిజనుల రిజర్వేషన్ల పెంపు ప్రతిపాదనలను పెండింగ్‌లో ఉంచడం గురించి వివరించండి?

బీజేపీ ప్రభుత్వం దళితులు, గిరిజనులకు తీవ్ర వివక్షతో మనువాద ధోరణితో వ్యవహరిస్తున్నది. 2001 జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేస్తామంటున్నది. 2011ని పరిగణనలోకి తీసుకోవడం లేదు. 2021 జనగణన చేపట్టలేదు. అది చేస్తే ఎస్సీ,ఎస్టీల జనాభా పెరుగుతుంది. అప్పుడు రిజర్వేషన్లు పెంచాల్సి వస్తుందని అది చేయడం లేదు. గిరిజనుల రిజర్వేషన్లు పెంచాలని అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్రానికి పంపించింది. బీసీ గణన చేయాలని కోరింది. వాటి పట్ల కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. బీజేపీ మందబలంతో అటవీ హక్కుల చట్టాన్ని సవరించింది. అటవీ పరిరక్షణ చట్టాన్ని తెచ్చింది. గిరిజనులకు రావాల్సిన హక్కులను కాలరాస్తున్నది. దళితులు, గిరిజనుల్లో ఒకరికి ఉన్నత స్థానాల్లో కూర్చోబెట్టామని చూపి రాజకీయ లబ్దిపొందుతున్నారు. వారి జీవనాధారాలమీద దాడి చేస్తున్నారు. హక్కులను హరిస్తున్నారు. మూల వాసులుగా ఉన్న గిరిజనులను ప్రజలుగా గుర్తించడం లేదు. కొమురంభీం, సోయం గంగులు, కుంజా బొజ్జి వంటి వీరయోధులున్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చూపిస్తున్న వివక్షను గుర్తిస్తున్నారు. పోడు భూములు, రిజర్వేషన్లు, హక్కులను కాపాడాలి. ఈ అన్ని విషయాలను వారి దృష్టికి తీసుకెళ్లి చైతన్యపరుస్తాం. బీజేపీకి వ్యతిరేకంగా ఉద్యమిస్తాం.

భూగోళమంత వివక్ష

చేద్దామన్నా మహిళలకు ఉద్యోగాలు లేవు

- వేతనాల్లోనూ భారీ వ్యత్యాసం
- ఐఎల్ఓ నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ : ఎక్కడమ్మా నీవు లేనిది.... ఏమిటీ నీవు చేయలేనిది? అని పాడుకుంటాం కదూ! నిజమే.. అన్ని రంగాల్లోనూ మహిళలు దూసుకుపోతున్నారు. ఇంట్లో బండెడు చాకీరి చేయడంతో పాటు, బయట పనులు చేస్తే ఆర్థికంగా కుటుంబ భారాన్ని మోస్తున్నారు. నూతన ఆర్థిక విధానాల పుణ్యమా అని భార్య,భర్తలు ఇద్దరు రెక్కలు ముక్కలు చేసుకుంటేగానీ, ఇల్లు గడవని రోజులు వచ్చేశాయి. కానీ, ఉద్యోగాలు, ఉపాధి కల్పనలోనూ వివక్ష ఎదురవుతోంది. పనిచేయడానికి మహిళలు ముందుకు వస్తున్నప్పటికీ వారికీ ఉద్యోగాలు దొరకడం లేదు. అరకొర ఉపాధి కూడా అంతంతమాత్రంగానే ఉంది. పురుషుడు, మహిళ ఒక పనికి పోటీ పడితే మగవారిపట్లే మొగ్గు చూపుతున్నారు. అంతేకాదు. వేతనాల్లోనూ భారీ వ్యత్యాసం నెలకొంది. ఈ పరిస్థితి మనదేశంలోనే కాదు. ఒకటి, రెండు దేశాలు మినహా భూగోళమంతా ఇదే తరహా వివక్ష నెలకొంది. ఐక్యరాజ్యసమితికి చెందిన ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ (ఐఎల్ఓ) ఈ మేరకు రూపొందించిన నివేదిక అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

ప్రపంచవ్యాప్తంగా 15శాతం మంది...

ఐఎల్ఓ విడుదల చేసిన వివరాల ప్రకారం అన్ని అర్హతలు ఉండి, చేయడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ ప్రపంచవ్యాప్తంగా 15శాతం మంది మహిళలకు ఉద్యోగాలు దొరకడం లేదు. వివిధ విద్యార్హతలు, వయసుల వారిని గ్రూపులుగా చేసి ఐఎల్ఓ ఈ నిర్ధారణకు వచ్చింది. అదే సమయంలో ఈ తరహా నిరుద్యోగం (అర్హతలు ఉండి, పనిచేయడానికి ఆసక్తి కలిగిఉండటం) పురుషులలో 10.5శాతం మాత్రమే. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఈ తరహా నిరుద్యోగం మహిళల్లో 24.9శాతం ఉండగా, పురుషుల్లో 16.6శాతం ఉంది. అనేక సందర్భాల్లో విద్యార్హతలతో సబంధం లేకపోయినప్పటికీ పురుషులకు ఏదో ఒక ఉపాధి అవకాశం లభిస్తోంది. మహిళలకు మాత్రం అటువంటి అరకొర సంపాదన అవకాశం కూడా లభించలేదం లేదు.

అవే కారణాలు...!

అర్హతలు ఉన్నప్పటికీ పురుషులతో సమానంగా మహిళలకు ఉద్యోగాలు ఇవ్వకపోవడానికి ప్రపంచవ్యాప్తంగా ఒకే రకమైన సాకులు చెబుతున్నట్లు ఐఎఎల్ఓ పేర్కొంది. 'వారికి ఇంటి పని ఉంటుంది. సకాలంలో కార్యాలయాలకు రారు' అన్న మాట మన దేశంతో పాటు అనేక దేశాల్లో వినిపించింది. అయితే, వివిధ సంస్థలు నిర్వహించిన సర్వేల్లో పురుషులతో పోలిస్తే మహిళలే ఎక్కువ మంది సకాలంలో ఆఫీసులకు వస్తున్నారని తేలింది. ఆలస్యంగా వచ్చిన వారు కూడా పురుషులతో పోలిస్తే ఎక్కువ సమయం కార్యాలయాల్లోనే ఉండి పనులు చేస్తున్నారు. ప్రసూతి సెలవులు, పిరియడ్స్, పిల్లల పెంపకం వంటివాటిని కూడా మహిళలకు ఉద్యోగాలు, ఉపాధి నిరాకరించడానికి కారణాలుగా చెబుతున్నారు.

వేతనాలు తక్కువే!

ఉద్యోగాలు దొరకడమే కష్టంగా ఉంటే, దొరికిన ఉద్యోగాల్లోనూ పూర్తిస్థాయిలో మగవారితో సమానంగా వేతనాలు లభించడంలేదు. అభివృద్ధి చెందిన దేశాల్లోనూ ఈ తరహా వ్యత్యాసం ఉండటం గమనార్హం. సగటున పురుషుల ఒక డాలర్ సంపాదనకు మహిళలకు 51 సెంట్లు మాత్రమే లభిస్తోందని ఐఎల్ఓ పేర్కొంది. పేద దేశాల్లో ఈ తేడా మరింత భారీగా ఉంది. ఈ దేశాల్లో పురుషుల ప్రతి డాలర్ సంపాదనకు మహిళలకు 29 సెంట్లు మాత్రమే దక్కుతున్నాయి. అభివృద్ధి చెందిన దేశాల్లో పురుషుల ప్రతి డాలర్ సంపాదనకు మహిళలకు 58 సెంట్లు లభిస్తోంది. అంటే, అభివృద్ధి చెందామని చెప్పుకుంటున్న దేశాలు సైతం మహిళలకు సమాన హక్కులను దఖలు పరచడంలో విఫలమయ్యాయి. గతంలో పోలిస్తే అనేక దేశాల్లో లింగ అసమానత పెరుగుతోందని, దానిని తగ్గించి సమానత్వాన్ని సాధించాలన్న లక్ష్యం నీరుగారు తోందని ఐఎల్ఓ వ్యాఖ్యానించడం గమనార్హం.


స్త్రీ, పురుష సమానత్వ సాధనకు మరో 300 ఏండ్లు

ఐరాస సెక్రెటరీ జనరల్ గుటెరస్

న్యూయార్క్: ప్రపంచవ్యాప్తంగా మహిళల హక్కులు తీవ్ర ఉల్లంఘనలకు, దుర్వినియోగానికి గురవుతున్నట్టు ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తం చేసింది. ఇదే ధోరణి కొనసాగితే.. స్త్రీ, పురుష సమానత్వ సాధనకు మరో 300 ఏండ్లు పడుతుందని ఐరాస సెక్రెటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ హెచ్చరించారు. స్త్రీ, పురుష సమానత్వ సాధనకు పనిచేస్తోన్న 'మహిళల స్థితిగతులపై ఐరాస కమిషన్' ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గుటెరస్ పాల్గొని ఈ మేరకు ప్రసంగించారు.'ఉక్రెయిన్ నుంచి సాహెల్ ప్రాంతం(ఆఫ్రికా) వరకు సంక్షోభాలు, సంఘర్షణల ప్రభావం.. మొదట మహిళలు, బాలికలపైనే పడింది. పితృస్వామ్య పోకడలు మళ్లీ జడలు విప్పుతోన్న నేపథ్యంలో.. దశాబ్దాలుగా సాధించిన పురోగతి కనుమరుగవుతోంది. అఫ్గానిస్థాన్‌లో మహిళలు, బాలికలను ప్రజాజీవితానికి దూరం చేశారు. అనేక దేశాల్లో మహిళల లైంగిక, సంతానోత్పత్తి హక్కులనూ లాగేసుకుంటున్నారు. కొన్ని చోట్ల బాలికలకు కిడ్నాప్, వేధింపుల ముప్పు పొంచి ఉంది. మాతాశిశు మరణాలు పెరుగుతున్నాయి. కొవిడ్ ప్రభావంతో.. వారి విద్యా, ఉపాధి అవకాశాలు దెబ్బతిన్నాయి' అని గుటెరస్ వ్యాఖ్యానించారు.

భవిష్యత్‌లో కేరళలో సగానికి పైగా డాక్టర్లు మహిళలే !

కొజికోడ్ : రాబోయే దశాబ్దాల్లో కేరళలో సగానికి పైగా డాక్టర్లు మహిళలే వుండనున్నారు. రాష్ట్ర వార్షిక ఆర్థిక సమీక్ష ప్రకారం, కేరళ యూనివర్శిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ నిర్వహిస్తున్న మెడికల్ సైన్స్ సంబంధిత కోర్సుల్లో 80 శాతానికి పైగా విద్యార్థులు యువతులే. ఇతర కోర్సుల కేటగిరీతో పోలిస్తే ఈ కోర్సుల్లో మహిళలే ఎక్కువగా వున్నారు. ఆధునిక మెడిసిన్ కోర్సుల్లో 2021-22 విద్యా సంవత్సరంలో 5,398 మంది విద్యార్థులు చేరగా, వారిలో 67శాతం అంటే 3616 మంది బాలికలే. జాతీయ సగటు 50శాతం కన్నా ఇది చాలా ఎక్కువగా వుంది. డెంటల్ కోర్సుల్లో మొత్తంగా 1907 మంది విద్యార్థులు వుండగా, వారిలో 1640 మంది బాలికలే. హెూమియోపతి కోర్సు చేస్తున్న 385మంది విద్యార్థులుండగా, వారిలో 345మంది బాలికలే.



ఆరోగ్య మహిళా కార్యక్రమంలో 57 రకాల వైద్య పరీక్షలు

- రాష్ట్ర వ్యాప్తంగా 100 ఆరోగ్య కేంద్రాల్లో నేడు ప్రారంభం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో మహిళా ఆరోగ్య రక్షణకై 'ఆరోగ్య మహిళ'ను తెలంగాణ రాష్ట్రంలోని 100 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మార్చి 8వ తేదీన ప్రారంభించనున్నారు. వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు బుధవారం ఉదయం 10.15 గంటలకు కరీంనగర్ పట్టణంలోని బుట్టిరాజారాం కాలనీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. అదే సమయంలో 25 జిల్లాల్లోని 100 కేంద్రాల్లో జరిగే ప్రారంభ కార్యక్రమాల్లో మంత్రులు, ప్రజా ప్రతినిధులు పాల్గొననున్నారు. ప్రతి మంగళవారం ప్రాథమిక వైద్య కేంద్రాల్లో మహిళలకు ప్రత్యేకంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అక్కడికక్కడే అవసరమైన వారికి మందులు ఇవ్వడంతోపాటు రెఫరల్ ఆస్పత్రులకు పంపిస్తారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో అన్ని వయస్సుల మహిళలకు 57 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ప్రధానంగా ఎనిమిది ప్యాకేజీలుగా విభజించిన ఆరోగ్య మహిళా కార్యక్రమంలో డయాగ్నోస్టిక్స్, క్యాన్సర్ స్క్రీనింగ్, సరైన ఆహారం లేకుండా వచ్చే సమస్యలు, మూత్ర సంబంధిత సమస్యలు, మోనోపాజ్ సంబంధిత, కుటుంబ నియంత్రణ, ఇన్ఫర్టిలిటీ, మెన్స్ట్రువల్ సమస్యలు, సుఖ వ్యాధులు, తక్కువ బరువు ఉన్న సమస్యలకు సంబంధించిన వైద్య పరీక్షలను చేస్తారు. వీటితోపాటు, బీపీ, షుగర్, అనీమియా పరీక్షలను అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహిస్తారు. ఈ పరీక్షల రిపోర్టులను 24 గంటలలోపే అందచేస్తారు. మహిళల్లో క్యాన్సర్ వ్యాధి అవకాశాలు ఎక్కువగా ఉండడంతో ఆ వ్యాధికి నిర్ధారణ పరీక్షలు చేయాలని నిర్ణయించారు. ఈ ఆరోగ్య మహిళ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానా లలో 30 ఏండ్ల పైబడ్డ మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేపడుతారు. జిల్లా కేంద్రాలు, ప్రాంతీయ ఆసుపత్రులలో మామోగ్రామ్. కల్పోస్కోపి, కీమోథెరపి, బయాప్సి, పాప్ స్మియర్ పరీక్షలను అందుబాటులో ఉంచారు. నిర్ధారిత క్యాన్సర్ మహిళలకు హైదరాబాదులోని నిమ్స్, ఎం.ఎం.జె క్యాన్సర్ ఆస్పత్రుల్లో చికిత్స అందిస్తారు.


తలసరి ఆదాయం పెరిగిందా? తగ్గిందా?

- నిజమైన వృద్ధిని తెలపదు : ఆర్థిక నిపుణులు

న్యూఢిల్లీ : దేశంలో తలసరి ఆదాయం రెట్టింపు అయ్యిందన్న పాలకుల మాటల్లో వాస్తవం లేదని ఆర్థిక నిపుణులు తేల్చి చెబుతున్నారు. అంతేగాక ఆర్థిక వృద్ధికి సంబంధించి 'తలసరి ఆదాయా'నికి పెద్దగా ప్రాధాన్యత ఉండదని, దీనిని అంతగా లెక్కలోకి తీసుకోవాల్సిన అవసరం లేదని ఆర్థిక నిపుణుడు ప్రొఫెసర్ అరుణ్‌కుమార్ అన్నారు. ప్రస్తుత ధరలను పరిగణలోకి తీసుకొని లెక్కగడితే, 2014-15 తర్వాత ఈ 8ఏండ్లలో తలసరి ఆదాయం రెట్టింపు అయ్యింది. రూ.86,647 నుంచి రూ.1,72,000కు పెరిగింది. తలసరి ఆదాయంలో పెరుగుదల 98.5శాతముంది. మోడీ సర్కార్ ఏర్పడకముందు, 2006-07లో తలసరి ఆదాయం రూ.33,717గా ఉంది. ఇది 2014-15 నాటికి రూ.86,647కు చేరుకుంది. తలసరి ఆదాయంలో పెరుగుదల 157శాతంగా ఉంది. దీనినిబట్టి మోడీ సర్కార్‌కు ముందు 8ఏండ్లలో తలసరి ఆదాయంలో పెరుగుదల భారీగా ఉందని జాతీయ ఆంగ్ల దినపత్రిక ఒకటి వార్తా కథనం వెలువరించింది. దేశంలోని మొత్తం జనాభా ఆదాయాన్ని, జనాభా సంఖ్యతో భాగిస్తూ 'తలసరి ఆదాయా'న్ని లెక్కగడతారు. ప్రతి రాష్ట్రానికి, జిల్లాకూ ఇదే వర్తిస్తుంది. అంబానీ, అదానీ, టాటా, బిర్లా..సహా పెద్ద పెద్ద ధనవంతులు నివసించే ముంబయిలో తలసరి ఆదాయం వందల కోట్లలో వస్తోంది. అలాగే ముంబయిలోని ధారావి వంటి చోట్ల నివసించే సాధారణ ప్రజల తలసరి ఆదాయమూ కోట్లలో కనపడుతోంది. వాస్తవానికి వారి ఆదాయం అలా ఉండదు. కాబట్టి ఇది సరైన వృద్ధి గణాంకం కాదని ప్రొఫెసర్ అరుణ్‌కుమార్ వంటి ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఒక ఏడాదిలో..ఒక ప్రాంతంలో నివసించే జనాభా మొత్తం ఆదాయం పెరిగితే, అక్కడున్నవారి ఆదాయాలు పెరిగినట్టు కాదు. అలాగే ఆదాయ అసమానతల్ని 'తలసరి ఆదాయం' ద్వారా తెలుసుకోలేమని నిపుణులు గుర్తు చేస్తున్నారు. తలసరి ఆదాయం భారీగా పెరిగిందని తెలుపుతూ 'ఎన్ఎస్ఎస్‌వో' ఫిబ్రవరిలో గణాంకాల్ని విడుదల చేసింది. 2011-12 నాటి స్థిర ధరలను లెక్కలోకి తీసుకొని తలసరి ఆదాయం లెక్కగట్టింది. 2014-15లో దేశంలో తలసరి ఆదాయం రూ.72,805గా ఉందని తెలిపింది. ఇది 2022-23నాటికి రూ.98,118కి పెరిగిందని, జీడీపీ భారీగా పెరిగిందని గణాంకాల్ని విడుదల చేశారు. వీటిపై స్పందించిన ప్రముఖ ఆర్థికవేత్త జయతీ ఘోష్ మాట్లాడుతూ, "ప్రస్తుత ధరలతో జీడీపీని గణించారు. ప్రస్తుత ద్రవ్యోల్బణం కూడా పరిగణలోకి తీసుకుంటే..జీడీపీ తగ్గుతోంది.అనేక రంగాల్లో పెద్ద ఎత్తున వేతనాలు పడిపోయాయి. తలసరి ఆదాయం పెరగటం అన్నది వాస్తవాన్ని ప్రతిబింబించటం లేదు" అని చెప్పారు.

నీటి కోసం 24 గంటల 'నిరాహార దీక్ష'

మద్దతు ప్రకటించిన సీపీఐ(ఎం)



నవతెలంగాణ - బోనకల్

ఎండిపోతున్న పంటలను కాపాడాలంటూ పది రోజులుగా నీటిపారుదల శాఖ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు స్పందించకపోవడంతో రైతులు బోనకల్ నీటిపారుదల శాఖ కార్యాలయం ఎదుట 24 గంటల నిరాహార దీక్షకు దిగారు. ఖమ్మం జిల్లా బోనకల్ బ్రాంచి కెనాల్ పరిధిలోనే తెలంగాణ, ఆంధ్ర సరిహద్దులోని చివరిగా ఆళ్ళపాడు మైనరు ఉంది. దీని కింద మండల పరిధిలోని ఆళ్లపాడు, గోవిందాపురం(ఏ) గ్రామాలు చివరి భూములుగా ఉన్నాయి. ఆళ్లపాడు గ్రామానికి చెందిన అన్నదాతలు 1,446 ఎకరాలు, గోవిందాపురం(ఏ) లో 141 ఎకరాల్లో రైతులు మొక్కజొన్న పంటను సాగు చేశారు. ప్రస్తుతం పంట కంకి వేసే దశలో ఉంది. అయితే సాగునీరు అందితే తప్ప పంట చేతికి వచ్చే పరిస్థితి లేదు. 20 రోజుల వ్యవధిలో రెండుసార్లు ఆయా గ్రామాల రైతులు ఆందోళనకు దిగారు. ఈ సమయంలో నీటిపారుదల శాఖ అధికారులు నీటిని విడుదల చేస్తామని చెప్పటం ఆ తర్వాత నిర్లక్ష్యంగా వదిలివేయటం ఒక తంతుగా మారింది. దాంతో అన్నదాతలు మంగళవారం నీటిపారుదల శాఖ మండల కార్యాలయం ఎదుట నిరాహార దీక్షకు పూనుకున్నారు. ఈ దీక్షను సీపీఐ(ఎం) మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు ప్రారంభించి మాట్లాడారు. సాగర్ డ్యాంలో పూర్తిస్థాయిలో నీరు ఉన్నప్పటికీ నీటిపారుదల శాఖ, ప్రభుత్వం నిర్లక్ష్యం ఫలితంగా అన్నదాతలు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బోనకల్ బ్రాంచ్ కెనాల్ పరిధిలోని ఏ కాలవకు సాగర్ నీటిని సక్రమంగా విడుదల చేయకపోవడం వల్ల కలకోట, నారాయణపురం, ఆళ్లపాడు తదితర కాలవుల కింద సాగుచేసిన పంటలన్నీ ఎండిపోతున్నాయని తెలిపారు. పంటలను కాపాడుకునేందుకు అన్నదాతలు ఆందోళనకు దిగినా వారబందీ పేరుతో పంటలను అధికారులు ఎండబెడుతున్నారన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు చేస్తున్న నిరాహార దీక్షకు సీపీఐ(ఎం) పూర్తి మద్దతుగా నిలుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఆళ్ళపాడు, గోవిందాపురం ఏ సర్పంచ్‌లు మర్రి తిరుపతిరావు భాగం శ్రీనివాసరావు, రైతులు ఆళ్ల వీరబాబు, బెజవాడ నరేష్, మరీదు గోపి, బెజవాడ ధనమూర్తి, కంసాని నాగేశ్వరరావు, తెల్లబోయిన శ్రీను, మల్లాది వెంకటేశ్వర్లు, గండమాల రాయప్ప ఆ రెండు గ్రామాలకు చెందిన అన్నదాతలు పాల్గొన్నారు.

15 ఎకరాలలో మొక్కజొన్న పంట సాగు చేశా : అల్లిక కబ్బయ్య, రైతు ఆళ్లపాడు

ఆళ్ళపాడు మైనర్ కింద పది ఎకరాల్లో కౌలుకు తీసుకొని మొక్కజొన్న పంట సాగు చేశా. పది ఎకరాలను ఎకరం రూ. 15,000 చొప్పున కౌలుకి తీసుకున్నాను. ముందుగానే రైతుకు కౌలు చెల్లించాను. నా సొంత పొలం మరో 5 ఎకరాల్లో కూడా మొక్కజొన్న పంటనే సాగు చేశాను. మొత్తం 15 ఎకరాలకు గాను రూ.4.50 లక్షలు పెట్టుబడి పెట్టాను. మొత్తం అప్పు తీసుకువచ్చే పెట్టుబడి పెట్టాను. మరికొంత నా భార్య పుస్తెలతాడును బ్యాంకులో తాకట్టు పెట్టి అప్పు తెచ్చా. కానీ సాగర్ నీటిని విడుదల చేయకపోవడం వల్ల 15 ఎకరాల్లో సాగుచేసిన మొక్కజొన్న పంట మొత్తం ఇప్పటికే సగానికి పైగా ఎండిపోయింది. ప్రభుత్వం నీటిపారుదల శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే తాము సాగుచేసిన మొక్కజొన్న పంట ఎండిపోతుంది.

రైతులతో చర్చలు జరిపిన డీఈ నాగ బ్రహ్మయ్య

మండల కేంద్రంలోని నీటిపారుదల శాఖ సబ్ డివిజన్ కార్యాలయం ఎదుట అన్నదాతలు దీక్షకు చేపట్టగా బోనకల్ సబ్ డివిజన్ ఇన్‌చార్జి డీఈ వల్లపు నాగ బ్రహ్మయ్య రెండు గంటలకు సంఘటనా స్థలానికి చేరుకొని రైతులతో చర్చలు జరిపారు. పైనుంచి ఒక్కొక్క తూమును బంద్ చేసుకుంటూ వస్తున్నామని మంగళవారం రోజే ఆళ్ళపాడు మైనర్‌కు పూర్తిస్థాయిలో సాగర్ నీటిని విడుదల చేస్తామని ఆందోళన విరమించాలని కోరారు. అందుకు రైతులు నిరాకరించారు. ముందుగా ఆళ్ళపాడు మైనర్‌కు సాగర్ నీటిని విడుదల చేసిన తర్వాతే తమ ఆందోళన విరమిస్తామని, అప్పటివరకు మీ మాయ మాటలు నమ్మి మా పంటలను ఎండబెట్టుకోలేమని స్పష్టం చేశారు. దాంతో చేసేదేమీ లేక డీఈ అక్కడ నుంచి వెళ్లిపోయారు.

అదే ఉత్కంఠ..

- హోరాహోరీగా పిడిగుద్దులాట
- హున్సాలో తలపడ్డ గ్రామస్తులు



నవతెలంగాణ-బోధన్

ఇసుక వేస్తే రాలని ప్రజానీకం.. ఎప్పటిలాగే అదే ఉత్కంఠ.. అదే పిడిగుద్దులాట.. నిజామాబాద్ జిల్లా సాలూర మండలం హున్సా గ్రామంలో హెూలీ పండుగ సందర్భంగా ప్రతి ఏడాదిలాగే ఈ సారి కూడా పిడిగుద్దులాట ఉత్కంఠ మధ్య కొనసాగింది. సాయంత్రం కుస్తీ పోటీల అనంతరం 6 గంటల తర్వాత గ్రామం నడిబొడ్డున ఏర్పాటుచేసిన పెద్ద దుంగలకు గట్టి తాడును కట్టి ఆట ప్రారంభించారు. ముందుగా డప్పుల చప్పుళ్లతో కుల సంఘాల పెద్దలను ఆట స్థలానికి ఆహ్వానించారు. చివరగా అందరూ చేరుకున్నారని నిర్ధారించగానే తాడును ఒక చేతితో పట్టుకుని ఒక్కసారిగా మరో చేతితో ధన్‌ధన్ అంటూ కొట్టుకోవడం ప్రారంభించారు. 10 నిమిషాల పాటు ఎవరిని ఎవరు కొడుతున్నారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. కొందరికి గాయాలైతే మరికొందరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

ఆట ముగియగానే ఒకరికొకరు స్నేహభావంతో ఆలింగనం చేసుకుని హెూలీ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. అనంతరం పెద్ద వారిని గౌరవ సూచికగా భుజాలపై ఎత్తుకుని కల్లు దుకాణాలకు బయలుదేరారు. కాగా పిడిగుద్దులాటను చూసేందుకు చుట్టుపక్క ప్రాంత వాసులే కాకుండా.. దూర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున తరలిరావడంతో హున్సా గ్రామం కిక్కిరిసింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

పండుగపూట తీవ్ర విషాదం

- మానేరు వాగులో మునిగి ముగ్గురు బాలురు మృతి

నవతెలంగాణ-తిమ్మాపూర్



అప్పటి వరకు ఆనందంతో రంగులు చల్లుకుంటూ హోలీ ఆడిన చిన్నారులు సాయంత్రానికల్లా విగత జీవులయ్యారు. పండుగ పూట వారి కుటుంబాల్లో పెను విషాదం చోటు చేసుకుంది. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం సదాశివపల్లి వద్ద తీగల వంతెన సమీపంలో మానేరు వాగు వద్దకు ఈతకు వెళ్లిన ముగ్గురు బాలురు మృతి చెందారు. తీగల వంతెన వద్ద పనులు చేయడానికి వచ్చిన ఒంగోలు జిల్లా చీమకుర్తి మండలానికి చెందిన కొంతమంది కూలీలు.. హౌసింగ్ బోర్డు కాలనీలో ఉంటున్నారు. ఆయా కూలీల పిల్లలు వీరాంజనేయులు (12), సంతోష్ (14), అనిల్ (13) ముగ్గురు హోలీ ఆడి స్నానం చేయడానికి తీగల వంతెన సమీపంలోని అలుగునూరు మానేరు వాగుకు వచ్చారు. అనంతరం అందులోకి దిగగా.. రివర్ ఫ్రంట్ కోసం తీసిన గుంతలో ముగ్గురు బాలురు పడి మృతి చెందారు. గమనించిన అక్కడ పని చేస్తున్న కూలీలు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ముగ్గురి మృతదేహాలను వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న కుటుంబసభ్యులు మృతి చెందిన కొడుకుల మృతదేహాలను చూసి బోరున విలపించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా, మానేరు తీరాన సంఘటన జరిగిన విషయాన్ని తెలుసుకున్న కరీంనగర్ రూరల్ ఏసీపీ కర్ణాకర్ రావు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. సంఘటనకు సంబంధించిన వివరాలు సేకరించారు.

కేంద్ర పథకాల అమలుకు రాష్ట్రం సహకరించట్లేదు

- ఎంఐఎం ఆస్తుల కోసమే మెట్రో నిలిపివేత
- ట్రైబల్ మ్యూజియానికి భూములివ్వట్లేదు : కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుకు రాష్ట్ర సర్కారు సహకరించట్లేదని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్రం ఏం అడిగినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. ట్రైబల్ యూనివర్శిటీ డీపీఆర్ కోసం కేంద్రం కోటి రూపాయలు ఇచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం భూమిని చూపడం లేదని చెప్పారు. జేబీఎస్, ఫలక్ నుమా మెట్రో కోసం కేంద్రం రూ.1250 కోట్లు ఇచ్చిందన్నారు. ఎంఐఎం నేతల ఆస్తులను రక్షించడం కోసమే ఫలక్ నుమా మెట్రోను అడ్డుకున్నారని ఆరోపించారు. ఘట్‌కేసర్, యాదాద్రి వరకు ఎంఎంటీఎస్ విస్తరణ కోసం భూములివ్వడం లేదనీ, ఫలితంగా నిర్మాణ వ్యయం భారీగా పెరిగిందని చెప్పారు. జనం రాసే ఉత్తరాలకు తాము సమాధానం చెబుతామనీ, తమ ఉత్తరాలకు సమాధానం చెప్పే సంస్కారం కేసీఆర్‌కు లేదని విమర్శించారు. రామగుండం, బీహెచ్‌ఈఎల్ ,శంషాబాద్‌లో ఈఎస్ఐ ఆస్పత్రులు నిర్మిస్తామని పదే పదే లేఖ రాసినా ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించట్లేదన్నారు. తెలంగాణలో నూతన రైల్వే లైన్ల నిర్మాణం, రద్దీ ప్రాంతాల్లో డంబ్లింగ్, ట్రిప్లింగ్, ఎలక్ట్రిషన్ పనులు యుద్ధప్రాతిపదికన చేపడుతున్నామనీ, అన్ని రైల్వే స్టేషన్లలో వైఫై సౌకర్యం కల్పించామని తెలిపారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ అభివృద్ధి కోసం రూ.720 కోట్లు కేటాయించామనీ, ఇప్పటికే టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయిందని చెప్పారు. రాష్ట్ర సర్కారు సహకరించకపోవడం వల్లనే రైల్వే లైన్ల పనులు నెమ్మదించాయని తెలిపారు. చర్లపల్లి, నాగులపల్లి రైల్వే స్టేషన్ల అభివృద్ధి కోసం భూములను కేటాయించాలని కోరారు. వరంగల్‌లో రైలు వ్యాగన్ల వర్క్‌షాపు ఏర్పాటు చేయబోతున్నామనీ, 3 వేల మందికి ఉపాధి దొరుకుతుందని తెలిపారు.

ఎవరి మెప్పు కోసం... ఫేక్ ప్రచారం చేస్తున్నారు

- మంత్రి కేటీఆర్‌కు పొన్నాల ప్రశ్న

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రానికి కొత్త కంపెనీలు, విరివిగా పెట్టుబడులు వస్తున్నాయంటూ మంత్రి కేటీఆర్ ప్రచారం చేస్తున్నారని పీసీసీ మాజీ అధ్యక్షులు పొన్నాల లక్ష్మయ్య చెప్పారు. ప్రపంచంలో ఫేక్ ప్రచారం చేస్తూ బీఆర్ఎస్ ప్రభుత్వం పబ్బం గడుపుతున్నదని ఎద్దేవా చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ నేతలతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అబద్ధపు ప్రచారంతో ప్రజలను మభ్యపెట్టాలని ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో చేసిన అభివృద్ధి అంత ఇంత కాదన్నారు. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ హయాంలో తెచ్చిన కంపెనీలు విస్తరణ చేయడం తప్ప...టీఆర్ఎస్ కొత్త కంపెనీలు ఎన్ని తెచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. కొత్త కంపెనీలపై వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

అధికారంలోకి రాగానే మహిళలకు పెద్దపీట

- అంతర్జాతీయ దినోత్సవ వేడుకల్లో సునీతారావు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మహిళలకు పెద్దపీట వేస్తామని మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు సునీతారావు చెప్పారు. అన్ని రంగాల్లో మహిళలు దూసుకెళ్తుతున్నారని తెలిపారు.మహిళలకు రాజకీయ అవకాశాలు కల్పించింది కాంగ్రెస్‌పార్టీయేనన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. మహిళా జర్నలిస్టులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సీతక్క, మాజీ మంత్రి పుష్పలీల ఇంచార్జి కో ఆర్డినేటర్ నీలం పద్మ, ప్రధాన కార్యదర్శి భవానీరెడ్డి, కల్వసుజాత, సదాలక్ష్మి, దుర్గారాణి, ఆర్. లక్ష్మి, కవిత, సుల్తానా తదితర మహిళా నాయకులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్ కార్మికులపై ముగ్గురి దాడి

- కార్మికుడు మృతి
- రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలంలో దారుణం



నవతెలంగాణ-శంకర్‌పల్లి

పెట్రోల్ పంపులో పనిచేసే ఇద్దరు కార్మికులపై ముగ్గురు వ్యక్తులు దాడి చేసిన ఘటనలో ఓ కార్మికుడు తీవ్రంగా గాయపడి మృతిచెందాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం జన్వాడ హెచ్‌పీ పెట్రోల్ పంపులో సోమవారం అర్ధరాత్రి జరిగింది. నార్సింగ్ సీఐ శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం జన్వాడ గ్రామ సమీపంలో హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లో పొద్దుటూరు గ్రామానికి చెందిన నక్క సంజయ్(19), బీహార్‌కు చెందిన మరో యువకుడు పనిచేస్తున్నారు. జన్వాడ గ్రామానికి చెందిన టంగుటూరు నరేందర్, మద్దూరు మల్లేష్, అంతిగళ్ళ అశోక్ ముగ్గురు వ్యక్తులు సోమవారం అర్ధరాత్రి కారు తీసుకుని పెట్రోల్ బంక్‌కు వచ్చారు. పెట్రోల్ పోసిన యువకుడు డబ్బులు అడగగా.. ఆ ముగ్గురు వ్యక్తుల్లో ఒకరు స్వైపింగ్ మిషన్ ఉందా అని అడగటంతో అది పనిచేయడం లేదని కార్మికుడు బదులిచ్చాడు. తమ దగ్గర లిక్విడ్ అమౌంట్ లేదని చెప్పడంతో ఏ విధంగానైనా డబ్బులు ఇవ్వాలని పట్టుబట్టారు. దాంతో ఇద్దరి మధ్య మాటామాట పెరగడంతో ఆ ముగ్గురు ఆ యువకుడిపై దాడి చేశారు. గమనించిన క్యాషియర్ నక్క సంజయ్ అక్కడికి వచ్చి స్వైపింగ్ మిషన్ పనిచేయడం లేదు.. డబ్బులివ్వాలని అడిగాడు. వారు కోపానికి గురై అతనిపై కూడా దాడికి పాల్పడటంతో కింద పడిపోయాడు. వెంటనే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. ఈ విషయం వెంటనే నార్సింగ్ పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు నార్సింగ్ సీఐ తెలిపారు. కాగా, విషయం తెలుసుకున్న పొద్దుటూరు గ్రామస్తులు, బాధిత కుటుంబసభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని రోడ్డుపై బైటాయించి ధర్నా చేపట్టారు. హెచ్‌పీ పెట్రోల్ బంకులో పనిచేస్తున్న మృతుడు నక్క సంజయ్ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పెట్రోల్ యాజమాన్యంతో మిర్జాగూడ, జన్వాడ గ్రామాల సర్పంచ్‌లు మాట్లాడారు. దాంతో పెట్రోల్ బంక్ యాజమాన్యం బాధిత కుటుంబానికి రూ.5.50 లక్షలు నష్టపరిహారం అందజేయడంతో గ్రామస్తులు ధర్నా విరమించారు.



(ఫైల్)

ఢిల్లీ మద్యం కుంభకోణంలో అరుణ్ రామచంద్ర పిళ్లై అరెస్టు

- ఏడు రోజులు జ్యుడిషియల్ కస్టడీ
- రిమాండ్ రిపోర్టులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత పేరు



న్యూఢిల్లీ : ఢిల్లీ మద్యం కుంభకోణం కేసు తెలుగు రాష్ట్రాల్లో మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే ఈ కేసులో తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు ప్రముఖులను అదుపులోకి తీసుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తాజాగా మరో కీలక వ్యక్తిని అరెస్ట్ చేసింది. మద్యం కుంభకోణంలో హైదరాబాద్‌కు చెందిన వ్యాపారవేత్త అరుణ్ రామచంద్ర పిళ్లైను ఇటీవల రెండు రోజుల పాటు ప్రశ్నించిన ఈడీ అధికారులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో అరెస్ట్ అయిన ప్రముఖ వ్యాపారవేత్త అరుణ్ రామచంద్ర పిళ్లైను ఈడీ అధికారులు రౌస్ అవెన్యూ కోర్టులో హాజరుపర్చారు. "బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ప్రతినిధినంటూ అరుణ్ రామచంద్ర పిళ్ళై అంగీకరించారు. ఆయనను ఏడు రోజుల కస్టడీకి ఇవ్వండి. కేసు దర్యాప్తుకు సహకరించడం లేదు. మనీ ట్రయల్స్ గుట్టు తేల్చడానికి కస్టడీ అవసరం. రూ.25 కోట్లు నేరుగా ట్రాన్స్‌ఫర్ చేశారు" అంటూ ఈడీ వాదనలు వినిపించింది. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయిన అరుణ్ 17 పేజీల రిమాండ్ రిపోర్టులో ఈడీ కీలక విషయాలు వెల్లడించింది. ఎమ్మెల్సీ కవితకు లబ్ది చేకూర్చాలనే ఉద్దేశంతో అరుణ్ పిళ్లై అన్నీ తానై వ్యవహరించాడని పేర్కొంది. "సౌత్ గ్రూప్ ఎమ్మెల్సీ కవిత, అరబిందో ఫార్మా ప్రమోటర్ శరత్ చంద్రారెడ్డితోపాటు వైసీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి కుమారుడు రాఘవ ఉన్నారు. సౌత్‌గ్రూప్ ప్రతినిధులుగా అరుణ్ పిళ్లై, అభిషేక్, బుచ్చిబాబు ఉన్నారు. కవితకు లబ్ది కోసం అరుణ్ పిళ్లై అన్నీ తానై వ్యవహరించారు. ఆప్ నేతలకు రూ.100 కోట్లు ఇచ్చినట్లు అరుణ్ దర్యాప్తులో అంగీకరించారు. రూ.100 కోట్లు పెట్టుబడి పెట్టి రూ.292 కోట్లు సంపాదించారు. అరుణ్ పిళ్లై కవిత బినామీ అని విచారణలో పలు మార్లు చెప్పారు. ఇదే విషయాన్ని మరి కొందరు కూడా చెప్పారు. మద్యం విధానం రూపకల్పనలో పిళ్లై కీలక పాత్ర పోషించారు" అని ఈడీ తన రిపోర్టులో పేర్కొంది. సౌత్‌గ్రూప్ వ్యక్తుల సంస్థలన్నీ కలిసి రూ.3,500 కోట్ల వ్యాపారం చేశాయని ఈడీ తెలిపింది. రామచంద్ర పిళ్లైకి రౌస్ అవెన్యూ కోర్టు ఏడు రోజుల జ్యుడిషియల్ కస్టడీ విధించింది. రామచంద్ర పిళ్లై అరెస్టుతో మద్యం విధానం మనీలాండరింగ్ కేసులో అరెస్టుల సంఖ్య పదికి చేరింది.

పెట్రోల్ పోసి నిప్పంటించిన వ్యక్తిపై కేసు



నవతెలంగాణ-రేగోడు

పెట్రోల్ పోసి నిప్పట్టించిన వ్యక్తిపై కేసు నమోదైన సంఘటన మెదక్ జిల్లా రేగోడు మండలం మర్పల్లి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. మెదక్ డీఎస్పీ సైదులు తెలిపిన వివరాల ప్రకారం... హెూలీ పండుగ సందర్భంగా మర్పల్లి గ్రామంలో యువకులు ఒకరిపై మరొకరు రంగులు చల్లుకుంటూ సంబరాలు చేసుకున్నారు. అనంతరం స్నానం చేసేందుకు గ్రామంలోని చెరువు వద్దకు వెళుండగా బుర్రి అంబదాస్ బైకులో పెట్రోల్ అయిపోయింది. అంబదాస్ ఇంటికి వెళ్లి పెట్రోల్ తెచ్చుకున్నాడు. అక్కడే ఉన్న షబ్బీర్‌పై అంబదాస్ కలర్ చల్లుతానని అన్నాడు. తన మీద నువ్వేం చల్లుతావురా అంటూ అంబదాస్ చేతిలో ఉన్న పెట్రోల్ బాటిల్‌ను షబ్బీర్ లాగేసుకున్నాడు. అంబదాస్‌పై షబ్బీర్ పెట్రోల్ పోసి నిప్పటించాడు. అక్కడే ఉన్నవారు మంటలను ఆర్పారు. గాయపడిన అంబదాస్‌ను నారాయణఖేడ్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి హైదరాబాదులోని ఉస్మానియా హాస్పిటల్‌కు తరలించారు. అంబదాస్ అక్క శాంతమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ మేరకు నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. సీఐ జార్జ్, ఎస్ఐ సత్యనారాయణ, అల్లాదుర్గం ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

'ఫాసిస్టు ప్రమాదంలో భారతదేశం'పై 10న హైదరాబాద్‌లో సదస్సు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఫాసిస్టు రూపంలోకి మారుతున్నదని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాయల సుభాష్‌చంద్రబోస్ ఏడో వర్ధంతి సందర్భంగా 'ఫాసిస్టు ప్రమాదంలో భారతదేశ ప్రజాస్వామ్యం'అనే అంశంపై ఈనెల పదో తేదీన ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు హైదరాబాద్‌లో సదస్సును నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రొఫెసర్ హరగోపాల్, వీక్షణం సంపాదకులు వేణుగోపాల్, భార్గవ, రమేష్ పట్నాయక్, దేవి, సతీష్‌చందర్ తదితరులు ప్రసంగిస్తారని వివరించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు ఫైనాన్స్ క్యాపిటల్ అవసరాల కోసం రహస్య ఎజెండాను అమలు చేయడానికి పూనుకుంటున్నాయని విమర్శించారు. లౌకిక, ప్రజాస్వామిక విలువలను కాలరాస్తూ, ప్రతిపక్షాలను చిన్నాభిన్నం చేస్తున్నాయని తెలిపారు. మనువాద రాజ్యాంగం అమలుకు ప్రయత్నాలను ఆరంభించిందని పేర్కొన్నారు. ప్రశ్నించే మేధావులు, పార్టీల నాయకులు, వ్యక్తులు, సంస్థల ప్రతినిధులను ఇబ్బందులకు గురిచేస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలోని ప్రజాస్వామిక శక్తులన్నీ ఐక్యంగా పోరాడాల్సిన అవసరముందని కోరారు.

మాల్దీవు అధికారులకు ఎన్ఐఆర్‌డీపీఆర్‌లో శిక్షణ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రిపబ్లిక్ ఆఫ్ మాల్దీవ్స్ కౌన్సిల్, స్థానిక ప్రభుత్వ అథారిటీ నుంచి ఎంపిక చేసిన 23 మంది ప్రతినిధులకు హైదరాబాద్‌లోని ఎన్ఐఆర్‌డీపీఆర్‌లో శిక్షణను మంగళవారం ప్రారంభించారు. రెండు దేశాల మధ్య స్థానిక సంస్థల బలోపేతం, అభివృద్ధి కోసం పరస్పరం సహకారం అందించుకునే విషయంపై ఎన్ఐఆర్‌డీపీఆర్, రిపబ్లిక్ ఆఫ్ మాల్దీవ్స్ మధ్య ఎంఓయూ జరిగింది. శిక్షణా కార్యక్రమం ప్రారంభం సందర్భంగా ఎన్ఐఆర్‌డీపీఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ శశిభూషణ్ మాట్లాడుతూ..రెండు వారాల శిక్షణలో స్థానిక సంస్థల అభివృద్ధి ప్రణాళిక, వనరుల సమీకరణ, ఆర్థిక నిర్వహణ, ఈ-గవర్నెన్స్, సర్వీస్ చార్టర్‌లు, మహిళా సాధికారత, తదితరాలపై ప్రతినిధులు అవగాహన, జ్ఞానం పొందుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్ భంజా, లోకల్ గవర్నమెంట్ అథారిటీ ముఖ్య కార్యనిర్వహణాధికారి అఫ్షాన్ లతీఫ్, లోకల్ గవర్నమెంట్ అథారిటీ డైరెక్టర్ జనరల్ షామూన్ ఆడమ్, ఐఎఫ్ఎస్ అధికారి, హైకమిషన్ కార్యదర్శి కరణ్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిపై కేసు నమోదు

నవతెలంగాణ నల్గొండ

కాంగ్రెస్ సీనియర్ లీడర్, భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పై నల్లగొండ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఐపీసీ 506 సెక్షన్ కింద నల్లగొండ వన్ టౌన్ పోలీసులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి పై కేసు నమోదు చేశారు. టీపీసీసీ ఉపాధ్యక్షులు చెరుకు సుధాకర్, ఆయన కొడుకు డాక్టర్ చెరుకు సుహాస్‌ను చంపుతానని బెదిరించిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. కాంగ్రెస్ ఉపాధ్యక్షులు చెరుకు సుధాకర్‌ను తన అనుచరులు చంపేస్తారంటూ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు సంచలనం రేపాయి. చెరుకు సుధాకర్ కొడుకు సుహాస్‌కు కోమటిరెడ్డి కాల్ చేసిన ఆడియో వైరల్ అయ్యింది. ఈ క్రమంలో కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని చెరుకు సుధాకర్, కొడుకు సుహాస్ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎంపీపై పోలీసులు కేసు నమోదు చేశారు.

గొర్రెల మందపై కుక్కల దాడి, 16 గొర్రెలు మృతి

నవతెలంగాణ-కథలాపూర్

జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం గంభీర్‌పూర్ గ్రామంలో గొర్ల మందపై కుక్కలు దాడి చేసిన సంఘటనలో 16 గొర్రెలు మృత్యువాత పడగా, మరో 7 గొర్రెల పరిస్థితి విషమంగా ఉందని యజమాని కేశవేణి చొక్కయ్య తెలిపారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. రోజువారీ లాగే సోమవారం ఉదయం గొర్రెల మందను మేతకు తీసుకెళ్లి తిరిగి సాయంత్రం సమయంలో గొర్రెలను షెడ్డులోకి తోలాడు.

అనంతరం ఆతను ఇంటికి వెళ్లిన తర్వాత రాత్రి సమయంలో గొర్రెల మందలో కుక్కలు చొరబడి దాడిచేశాయి. గమనించిన స్థానికులు చొక్కయ్యకు సమాచారం ఇచ్చారు. అప్పటికే 16 గొర్రెలు చనిపోగా, 25 గొర్రెలు గాయపడినట్టు చొక్కయ్య తెలిపాడు. మృతి చెందిన గొర్రెల విలువ సుమారు రూ.3 లక్షల వరకు ఉంటుందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

మహిళ విద్యావంతురాలు అయినప్పుడే ఇల్లు భూతల స్వర్గం అవుతుంది. - వీరేశలింగం

టెన్నిస్‌కు సానియా గుడ్‌బై

సరైన ప్రోత్సాహం, ధృఢమైన సంకల్పం ఉంటే... మహిళలు సాధించలేనిదేమీ లేదని నిరూపించిన అతి కొద్దిమంది దిగ్గజ క్రీడాకారిణుల్లో ఒకరిగా 36 ఏండ్ల సానియా మీర్జా చరిత్రను పునర్లిఖించింది. తన కెరీర్ ఎక్కడ మొదలుపెట్టిందో... అదే ఎల్‌బి స్టేడియంలో చివరి మ్యాచ్ ఆడేసిన ఈ భారత టెన్నిస్ సూపర్‌స్టార్ ఘనంగా తన కెరీర్‌కు వీడ్కోలు పలికింది. మహిళలు ఎదుర్కొనే

> టెన్నిస్ ప్రపంచంలో అసమాన విజయాలను అందుకున్న ఈ సూపర్ స్టార్... ఎన్నో వివాదాలనూ, విమర్శలనూ ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొంది. స్కర్ట్ వేసుకుని ఆడటంపై మతపెద్దల ఫత్వా, మసీదులో షూటింగ్‌లో పాల్గొనడం, పాకిస్థాన్ క్రికెటర్ షోయబ్ మాలిక్‌తో వివాహం... వంటి వాటిని కొందరు వివాదాస్పదం చేసేందుకు ప్రయత్నించినా, ధైర్యంగా ఎదుర్కొంది.

ఆటుపోట్లతోపాటు మత కట్టుబాట్లను సైతం దాటి దేశానికి గర్వకారణంగా నిలిచి... ఓ పోరాట యోధురాలిగా తన ప్రస్థానాన్ని సాగించి.... యువ మహిళా క్రీడాకారులతోపాటు ఎందరికో ఆమె స్ఫూర్తిదాయకంగా నిలిచింది. రెండు దశాబ్దాల ఆమె క్రీడా జీవితాన్ని పరిశీలిస్తే... మూడు డబుల్స్ గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల, మరో మూడు మిక్స్‌డ్ గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల, 43 డబుల్స్ ట్రోఫీలు, 91 వారాలపాటు డబుల్స్‌లో నంబర్‌వన్‌గా నిలవడం లాంటి ఎన్నో ఘనతలు సాధించింది. అంతేకాదు... తన ఆటతోపాటు మాటతోనూ... చేతలతోనూ తాను ఎంత ప్రత్యేకమో నిరూపించుకుని... క్రీడల్లో అడుగుపెట్టాలనుకునే అమ్మాయిలందరికీ ఓ స్ఫూర్తిప్రదాతగా... సూపర్ స్టార్‌గా... నిలిచింది.



అమ్మాయిలు ఆటల్లో ప్రవేశించాలి... రాణించాలి... అన్న ఓ తండ్రి పట్టుదల సానియా మీర్జా విజయంలో కీలకపాత్ర. టెన్నిస్‌లాంటి ఖరీదైన, వ్యక్తిగత క్రీడలోకి తండ్రి ఇమ్రాన్‌మీర్జా ప్రోత్సాహంతో ఆరో ఏటే అడుగుపెట్టింది సానియా...11 ఏండ్ల వయసులో హైదరాబాద్‌లోని ఓ కోర్టులో సాధన చేయిస్తుండగా... 'ఇలాంటి పొట్టి దుస్తులతో టెన్నిస్ అవసరమా?' అంటున్న మాటలు ఈటెల్లా తగులుతూనే ఉన్నాయి ఆ తండ్రికి. మరో మిత్రుడు వచ్చి 'ఏంటి సానియాను మార్టినా హింగిస్ చేద్దామను కుంటున్నావా' అంటూ ఓ కామెంట్ చేసి వెళ్లిపోయాడు. తర్వాతి రోజుల్లో మార్టినా హింగిస్‌తోనే నంబర్‌వన్ జోడీగా నిలవడంతోపాటు 14 డబుల్స్ టైటిల్స్ సాధించి తానెంత ప్రత్యేకమో సానియా నిరూపించుకుంది. ఎన్ని వ్యాఖ్యలెదురైనా చిన్నారి సానియాను తన శిక్షణలోనే రాటుదేల్చాడు ఇమ్రాన్ మీర్జా. టోర్నీలు గెలిచాకా... ప్రోత్సాహకాలు అందజేయడం, ముందుగానే ఔత్సాహిక క్రీడాకారుల్లో ప్రతిభను గుర్తించి తగు విధంగా ప్రోత్సాహాన్నిస్తే మట్టి నుంచి మాణిక్యాలు తీయొచ్చు. ఆ దూరదృష్టి ప్రభుత్వాలకు కొరవడింది. మొదట్లో సానియా కుటుంబానికి దేశవ్యాప్తంగా టోర్నీలకు విమానాల్లో వెళ్లే స్తోమత లేక పాతకారులోనే వందల కొద్దీ కిలోమీటర్లు ప్రయాణం చేసింది. 13ఏండ్ల వయసులో జాతీయ అండర్-14, అండర్-16 టైటిల్స్ గెలిచి తొలిసారి అందరి దృష్టినీ ఆకర్షించింది. ఎల్‌బి స్టేడియంలో తొలిసారి సీనియర్ స్థాయి టోర్నీ హైదరాబాద్ ఓపెన్‌లో సింగిల్స్ విభాగం నుంచి పోటీపడి తొలిరౌండ్లోనే పరాజయం పాలైనా... రెండేండ్ల తరువాత అదే టోర్నమెంట్ విజేతగా తన ముద్రను బలంగా చాటింది. ఈ క్రమంలోనే గ్రాండ్‌స్లామ్స్‌లో పోటీపడుతూ 2007 ఆగస్టులో సింగిల్స్‌లో ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 27వ స్థానానికి చేరుకుని, ఆ ఘనత సాధించిన తొలి భారతీయ మహిళగా నిలిచింది. ఆ తరువాత సింగిల్స్ నుంచి డబుల్స్ విభాగానికి మారి, టెన్నిస్ ప్లేయర్లు కలలుగనే గ్రాండ్‌స్లామ్ ట్రోఫీని డబుల్స్ విభాగంలో మూడుసార్లు, మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో మరో మూడుసార్లు సాధించి తన సత్తా చాటింది.

టెన్నిస్ ప్రపంచంలో అసమాన విజయాలను అందుకున్న ఈ సూపర్ స్టార్... ఎన్నో వివాదాలనూ, విమర్శలనూ ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొంది. స్కర్ట్ వేసుకుని ఆడటంపై మతపెద్దల ఫత్వా, మసీదులో షూటింగ్‌లో పాల్గొనడం, పాకిస్థాన్ క్రికెటర్ షోయబ్ మాలిక్‌తో వివాహం... వంటి వాటిని కొందరు వివాదాస్పదం చేసేందుకు ప్రయత్నించినా, ధైర్యంగా ఎదుర్కొంది. 2012 లండన్ ఒలింపిక్స్ సందర్భంలో మిక్స్‌డ్ డబుల్స్‌లో తనతో సానియాను ఆడిస్తేనే విష్ణుతో కలిసి డబుల్స్ ఆడతానని పేస్ చెప్పడంపై ఘాటుగా స్పందించింది. పురుషాధిక్యతకు నిదర్శనంగా పేర్కొంటూ, ఒక ఆటగాడి కోసం తనను ఎరగా వేశారని జాతీయ టెన్నిస్ సమాఖ్యపై మండిపడింది. ఇలా... తనదైన శైలిలో టెన్నిస్ క్రీడాయవనికపై ముద్రవేసిన సానియా కెరీర్‌కు స్వస్తి పలికినా... ఎందరో సానియాలను తీర్చిదిద్దుతానని చేసిన ప్రకటన భారత టెన్నిస్‌కు సరికొత్త తారలను తీసుకురావాలని ఆశిద్దాం. సరైన సామర్థ్యం ఉండి, ఆటాడే వసతులు లేక, ప్రోత్సాహం, డబ్బు లేక మరుగునపడిన ఆణిముత్యాలను వెలికితీసేందుకు ప్రభుత్వాలు నడుంబిగిస్తే... సరైన ప్రోత్సాహాన్నిస్తే... ఎందరో సానియాలను సృష్టించొచ్చు.

క్రైస్తవమత కుట్రదారులకు జైలుశిక్ష - నికరాగువాలో పెరుగుతున్న ప్రజాచర్చిలు!

లాటిన్ అమెరికాలోని నికరాగువాలో మానవ హక్కులకు భంగం వాటిల్లిందంటూ తాజాగా ఐరాస మానవహక్కుల సంస్థ ఒక నివేదికను విడుదల చేసింది. తటస్తంగా ఉండాల్సిన సంస్థలు తాము ఇచ్చిన వివరాలను, జరిగిన ఉదంతాలను పట్టించుకోకుండా ఏకపక్షంగా తమ గురించి తప్పుడు ప్రచారం చేస్తున్నట్లు నికరాగువా వామపక్ష శాండినిస్టా ప్రభుత్వం ఆ నివేదికను తోసిపుచ్చింది. డేనియల్ ఒర్టేగా అధిపతిగా ఉన్న ప్రభుత్వం కాథలిక్ బిషప్ రోలాండో అల్వారెజ్‌కు ఫిబ్రవరి తొమ్మిదవ తేదీన 26 సంవత్సరాల శిక్ష విధించి జైల్లో పెట్టిందంటూ అనేక క్రైస్తవ మత సంస్థలు గగ్గోలు పెడుతున్నాయి. పోప్ ఫ్రాన్సిస్ కూడా ఆ ఉదంతం పట్ల విచారం, ఆందోళన ప్రకటించారని, సదరు బిషప్ కోసం ప్రార్ధనలు జరపాలని ఎసిఎన్ (ఎయిడ్ టు ద చర్చ్ ఇన్ నీడ్) సంస్థ పిలుపునిచ్చింది. మతపరమైన ఊరేగింపుల మీద కూడా ప్రభుత్వం ఆంక్షలను విధించినట్లు ఆరోపిస్తూ అందువలన గుడ్‌ఫ్రైడే వంటి వాటిని కూడా చర్చిలకే పరిమితం చేసినట్లు మత సంస్థలు పేర్కొన్నాయి. బిషప్ రోలాండో అల్వారెజ్ వంటి వారు అమెరికాతో చేతులు కలిపి 2018లో ఒర్టేగా సర్కార్‌ను కూల్చేందుకు కుట్ర చేశారు. అలాంటివారు 222మందిని కోర్టులలో విచారించి శిక్షలు వేశారు. వారి పౌరసత్వాలను రద్దు చేశారు. వారందరికీ ఆశ్రయం కల్పించేందుకు అమెరికా ముందుకు రావటంతో ఒక విమానంలో వారిని పంపేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసింది. తాను అమెరికా వెళ్లేది లేదని బిషప్ తిరస్కరించాడు. దాంతో అతన్ని జైల్లో పెట్టి అంగీకరించిన వారిని ఫిబ్రవరి తొమ్మిదవ తేదీన విమానంలో అమెరికా పంపారు.వారిలో పదకొండు



ఎం. కోటేశ్వరరావు

> అమెరికాతో చేతులు కలిపిన క్రైస్తవమతాధికారులు వామపక్ష ప్రభుత్వాన్ని కూలదోసేందుకు చర్చీలను ఆయుధాలు, కిరాయిమూకల కేంద్రాలుగా మార్చారు. ఆదివారం ప్రార్ధనల్లో ప్రభుత్వ కూల్చివేత సుభాషితాలు వల్లించారు. చర్చ్‌కు వచ్చిన వారిలో ఎవరైనా శాండినిస్టాలు(కమ్యూనిస్టులు) ఉన్నారా అని మరీ పిలిచి నిలబడిన వారిని చర్చికి రావద్దని ఆదేశాలు జారీ చేశారు. ఇలాంటి చర్యలు 2018 కుట్రలో అనేక మంది ఫాదర్లు స్వయంగా హింసాకాండలో పాల్గొనటాన్ని చూసిన అనేక మందికి చర్చ్‌లు, ఫాదర్ల మీద విశ్వాసం పోయింది. తమకు మేలు చేస్తున్న పాలకులను కూల్చివేసి నిరంకుశ, దోపిడీదార్లను బలపరుస్తున్న చర్చి ఉన్నతాధికారుల తీరును చూసి నివ్వెరపోయారు.

మంది మతాధికారులు కూడా ఉన్నారు.

నికరాగువాలో అసలేం జరుగుతోంది? తప్పుడు ప్రచారాలకు ఎందుకు పూనుకున్నట్లు? ముందుగా గమనించాల్సింది, ఇది మొదటిసారి కాదు. అక్కడ తొలిసారిగా వామపక్ష ప్రభుత్వం ఏర్పడినపుడు, కొంత కాలం తరువాత తిరిగి అధికారానికి వచ్చిన తరువాత ప్రచారం సాగుతూనే ఉంది. అమెరికా దేశాల సంస్థ(ఓఎఎస్) సంస్థతో కలిసి ఐరాస మానవహక్కుల కమిషన్ ప్రతినిధులు తాజాగా ఒక నివేదిక ఇచ్చారు. ఏకపక్షంగా ప్రపంచం ముందు నికరాగువాను చెడుగా చూపేందుకు చూసింది. భారత్‌ను కనుగొనేందుకు బయలు దేరిన కొలంబస్ తన నాలుగవ యాత్రలో 1502లో పసిఫిక్ సముద్రం వైపు నుంచి నికరాగువాలో అడుగు పెట్టాడు. తరువాత 1523 నుంచి ఆ ప్రాంతం మొత్తాన్ని ఆక్రమించి 1821వరకు స్పెయిన్ వలసగా మార్చారు. 1821లో గౌతమాలా స్వాతంత్ర్యం ప్రకటించు కుంది. అదే ఏడాది మెక్సికోలో భాగంగా మారింది. రెండు సంవత్సరాలకే మెక్సికో రాజరికాన్ని కూలదోసి మిగతా ప్రాంతాలతో కలసి కొత్త రిపబ్లిక్‌ను ఏర్పాటు చేశారు. దానిలో భాగమైన నికరాగువా 1838లో స్వాతంత్ర్యాన్ని ప్రకటించు కుంది. అప్పటి నుంచిఅంతర్యుద్దానికి లోనైంది.

1848లో కాలిఫోర్నియాలో బంగారాన్ని కనుగొన్న తరువాత తూర్పు అమెరికా నుంచి అక్కడికి కార్మికులను చేర్చేందుకు అమెరికన్లు నికరాగువా మీదుగా ప్రయాణించటం దగ్గరిదారిగా భావించి లక్షలాది మంది అటుగా వచ్చారు. నికరాగువాపై ఆధిపత్యం కోసం పోటీపడిన అక్కడి మితవాద, ఉదారవాద వర్గాలలో రెండవది అమెరికన్లను ఆహ్వానించి వారి మద్దతు తీసుకుంది. దీన్ని అవకాశంగా తీసుకొని ఎన్నికల పేరుతో 1856లో ఫిలిబస్టర్ విలియం వాకర్ అనేవాడు తాను నికరాగువా అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు ప్రకటించుకున్నాడు. 1857లో వాకర్‌ను తరిమివేసి మితవాద శక్తుల ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. 1909 వరకు నికరాగువా స్వతంత్ర దేశంగా ఉంది. 1893 నుంచి 1909వరకు నికరాగువా అధ్యక్షుడిగా ఉన్న జోస్ శాంటోస్ జెలయాపై అమెరికా మితవాద శక్తులతో తిరుగుబాటు చేయించింది. తమ పౌరులను రక్షించే పేరుతో 1909 నవంబరు 18 నికరాగువా తీరానికి అమెరికా తన యుద్ధ నౌకలను పంపింది. దాంతో జెలయా పదవి నుంచి తప్పుకున్నాడు. తరువాత అమెరికా అనుకూల ప్రభుత్వం ఏర్పడింది. దానిలో కుమ్ములాటలు తలెత్తాయి. 1912 నుంచి 1933 వరకు అమెరికా మిలిటరీ స్వాధీనంలో నికరాగువా ఉంది. కాలువ తవ్వకంతో సహా అనేక ఒప్పందాలను తనకు అనుకూలంగా చేసుకుంది.

1927 నుంచి 1933 వరకు తిరుగుబాటు మిలిటరీ అధికారి అగస్టో సీజర్ శాండినో గెరిల్లా పద్దతిలో మితవాద ప్రభుత్వం, అమెరికా మిలిటరీ మీద సాయుధ పోరాటం సాగించాడు. దాంతో 1933లో ఒక తొత్తు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి అమెరికా అక్కడి నుంచి వైదొలిగింది. శాండినో తిరిగి తిరుగుబాటు చేయవచ్చన్న జనరల్ అంటాసియా సోమోజా గార్సియా సలహామేరకు శాండినోను హతమార్చాలని పథకం వేశారు. దానిలో భాగంగా శాంతి ఒప్పందం మీద సంతకాలు చేసే పేరుతో 1934 ఫిబ్రవరి 21వ తేదీ రాత్రి విందుకు ఆహ్వానించారు. విందు తరువాత తిరిగి వెళుతున్న శాండినోను సోమోజా హత్య చేయించాడు. తరువాత తానే గద్దెనెక్కాడు. 1956లో సోమోజాను ఒక యువకవి కాల్చి చంపాడు. సోమోజా పెద్ద కుమారుడు లూయిస్ సోమోజాను గద్దె నెక్కించారు. 1967లో సీనియర్ సోమోజా చిన్న కుమారుడు అంటాసియో సోమోజాను గద్దెనెక్కించారు. శాండినోలు 1979 కూల్చేంతవరకు అధికారంలో ఉన్నాడు. సోమోజాపాలన మీద తిరుగుబాటు చేసిన శక్తులు ఆగస్టో సీజర్ శాండినో పేరుతో శాండినిస్టా విముక్తి దళాన్ని ఏర్పాటు చేశారు. దాని నేతగా డేనియల్ కార్టేగా 1979లో అధికారానికి వచ్చాడు. అనేక సంక్షేమ పథకాలను అమలు చేశాడు. దేశంలో అస్థిర పరిస్థితులను సృష్టించి ఒర్టేగాను దోషిగా చూపి 1990 ఎన్నికల్లో ఓడించారు. తిరిగి 2007 నుంచి ఇప్పటి వరకు వరుసగా ఒర్టేగాను జనం ఎన్నుకుంటున్నారు.

2018లో ఒర్టేగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా విఫల తిరుగుబాటు కుట్ర జరిగింది. ఏప్రిల్ 18 నుంచి జూలై 17వరకు ప్రభుత్వాన్ని వ్యతిరేకించే శక్తులు అమెరికా తదితర దేశాలు, సంస్థలు ఇచ్చిన మద్దతు, డబ్బు, ఆయుధాలతో హింసాకాండకు పాల్పడ్డాయి. ఇరవైరెండు మంది పోలీసు అధికారులు ఆ దాడుల్లో మరణించగా 400మందికి పైగా తుపాకి గాయాలయ్యాయి. అరవై మంది అధికార శాండినిస్టా పార్టీ కార్యకర్తలు లేదా మద్దతుదార్లను చంపివేశారు. వందలాది మంది గాయపడ్డారు. ఏప్రిల్ 19, 20, 21 తేదీల్లో అనేక చోట్ల ప్రతిపక్ష సాయుధమూకలు పోలీస్ స్టేషన్లు, శాండినిస్టా ఆఫీసులపై జరిపిన దాడుల్లో పెట్రోలు బాంబులు, తుపాకులను వినియోగించిన తీరు వీడియోల్లో ఉంది. వీటిని అసలు పరిగణనలోకి తీసుకోలేదు. వాటికి సంబంధించి స్థానిక పత్రికల్లో వచ్చిన వార్తలు కూడా ఐరాస కమిషన్‌కు కనిపించలేదు. శాంతియుతంగా ప్రారంభమైన ప్రదర్శనలపై పోలీసులు దాడులకు పాల్పడినట్లు, తొలుత జరిగిన నిరసనల్లో అసలు ప్రతిపక్షాలకు చెందిన వారెవరూ పాల్గొనలేదని ఐరాస కమిషన్ చెప్పింది.

ఎవరెన్ని కుట్రలు చేసినా వాటన్నింటికీ ఇప్పటి వరకు ఒర్టేగా సర్కార్ తిప్పికొడుతున్నది. జన విశ్వాసం పొందు తున్నది. ముందే పేర్కొన్న 2018 విఫల కుట్ర తరువాత జరిగిన 2019 కరీబియన్ ప్రాంతీయ ఎన్నికలు, 2021జాతీయ ఎన్నికలు, 2022 మున్సిపల్ ఎన్నికల్లో అధికార శాండినిస్టా నేషనల్ ఫ్రంట్



భారీ మెజారిటీలతో గెలిచింది. జనాభాలో 85శాతం మంది క్రైస్తవులే, వారిలో సగానికి పైగా రోమన్ కాథలిక్‌లు. పదిహేనుశాతం జనాభా మతంలేని వారు. లాటిన్ అమెరికా అంతటా చర్చి ఎప్పుడూ నిరంకుశ శక్తులు, మితవాదులు కనుసన్నలలోనే పనిచేసింది. వారికి వ్యతిరేకంగా ప్రారంభమైన ఉద్యమాలలో ప్రజల పక్షం వహించే మతపెద్దలు అనేక మంది మమేకమయ్యారు. అలాంటి దేశాలలో నికరాగువా ఒకటి.వారికి నియంతలను వ్యతిరేకించటం, పేదల సంక్షేమం ప్రధానం తప్ప పోరు చేస్తున్న వారు పురోగామి వాదులా, కమ్యూనిస్టులా? మతం పట్ల వారి వైఖరి ఏమిటన్నది ప్రధానంగా కనిపించలేదు. వామపక్ష, కమ్యూనిస్టు గెరిల్లాలకు కూడా మతపెద్దలని గాక వారేవైపు ఉన్నారన్నదే గీటురాయి. అక్కడి వాస్తవ పరిస్థితుల నుంచే ఈ పరిణామం. అందుకే లాటిన్ అమెరికా దేశాల్లో జరిగిన, జరుగుతున్న పరిణామాలు పడక కుర్చీ మార్క్సిస్టు సిద్ధాంతవేత్తల చట్రంలో జరగటం లేదు. ఒక చేత్తో బైబిల్ ఒక చేత్తో ఎర్రజెండా పట్టుకున్న వెనెజులా నేత హ్యూగో ఛావెజ్‌ను "అమెరికా క్రీస్తు" అని అనేక మంది జనం నమ్మారు. నికరాగువాలో కూడా అదే జరుగుతోంది. అమెరికాతో చేతులు కలిపిన క్రైస్తవమతాధికారులు వామపక్ష ప్రభుత్వాన్ని కూలదోసేందుకు చర్చీలను ఆయుధాలు, కిరాయిమూకల కేంద్రాలుగా మార్చారు. ఆదివారం ప్రార్ధనల్లో ప్రభుత్వ కూల్చివేత సుభాషితాలు వల్లించారు. చర్చ్‌కు వచ్చిన వారిలో ఎవరైనా శాండినిస్టాలు(కమ్యూనిస్టులు) ఉన్నారా అని మరీ పిలిచి నిలబడిన వారిని చర్చికి రావద్దని ఆదేశాలు జారీ చేశారు. ఇలాంటి చర్యలు 2018 కుట్రలో అనేక మంది ఫాదర్లు స్వయంగా హింసాకాండలో పాల్గొనటాన్ని చూసిన అనేక మందికి చర్చ్‌లు, ఫాదర్ల మీద విశ్వాసం పోయింది. తమకు

> ఎవరెన్ని కుట్రలు చేసినా వాటన్నింటికీ ఇప్పటి వరకు ఒర్టేగా సర్కార్ తిప్పికొడుతున్నది. జన విశ్వాసం పొందుతున్నది. ముందే పేర్కొన్న 2018 విఫల కుట్ర తరువాత జరిగిన 2019 కరీబియన్ ప్రాంతీయ ఎన్నికలు, 2021జాతీయ ఎన్నికలు, 2022 మున్సిపల్ ఎన్నికల్లో అధికార శాండినిస్టా నేషనల్ ఫ్రంట్ భారీ మెజారిటీలతో గెలిచింది. జనాభాలో 85శాతం మంది క్రైస్తవులే, వారిలో సగానికి పైగా రోమన్ కాథలిక్‌లు. పదిహేనుశాతం జనాభా మతంలేని వారు. లాటిన్ అమెరికా అంతటా చర్చి ఎప్పుడూ నిరంకుశ శక్తులు, మితవాదులు కనుసన్నలలోనే పనిచేసింది. వారికి వ్యతిరేకంగా ప్రారంభమైన ఉద్యమాలలో ప్రజల పక్షం వహించే మతపెద్దలు అనేక మంది మమేకమయ్యారు.

మేలు చేస్తున్న పాలకులను కూల్చివేసి నిరంకుశ, దోపిడీదార్లను బలపరుస్తున్న చర్చి ఉన్నతాధికారుల తీరును చూసి నివ్వెరపోయారు. దాంతో క్రీస్తును ఆరాధించాలంటే చర్చ్‌లకే పోనవసరం లేదని అనేక మంది భావించారు. ఇండ్లకే పరిమితం కానివారు సామూహిక ప్రార్థనలు జరిపేందుకు ప్రత్యామ్నాయాలను చూశారు. అవే ప్రజా చర్చ్‌లుగా ఉనికిలోకి వచ్చాయి.

ఇలాంటి ప్రజాచర్చ్‌లు 1970 దశకంలో ప్రారంభమైన 1979లో నియంత పాలన అంతంతో మరింతగా పెరిగాయి. ఇవి క్రైస్తవం-విప్లవం మధ్య ఎలాంటి వైరుధ్యాలు లేవన్న క్రైస్తవ విముక్తి సిద్ధాంతాన్ని ముందుకు తెచ్చిన పూజారుల ప్రచార కేంద్రాలుగా కూడా పని చేశాయి. వారిలో ఒకరైన ఫాదర్ మిగుయెల్ డి స్కోటో ప్రస్తుతం నికరాగువా విదేశాంగ మంత్రిగా పని చేస్తున్నారు. "నీవు జీసస్‌ను అనుసరించకపోతే విప్లవకారుడుకారుడివి కూడా కాలేవు" అంటారాయన. ఇలాంటి వారు అనేక మంది ఇప్పుడు ఒర్టేగా సర్కార్‌లో పేదల సంక్షేమం కోసం పాటుపడుతున్నారు. వారు క్రైస్తవులే గానీ శాండినిస్టా పాలనను ప్రతిఘటించే అధికార మతపెద్దల తెగకు చెందిన వారు కాదు. 1990లో తాము కాథలిక్కులమని చెప్పుకున్నవారు 94శాతం ఉండగా ఇటీవల అది 50శాతానికి తగ్గి ఇప్పుడు 37శాతం ఉన్నట్లు సర్వేలు వెల్లడించాయి. లాటిన్ అమెరికాలో ఒక చిన్న దేశమైన నికరాగువా (జనాభా 70లక్షల లోపు) ఐరాస మానవహక్కుల సంస్థను శిఖండిగా చేసుకొని అమెరికా, దాని కూటమి చేస్తున్న ప్రచారదాడికి గురవుతోంది. కరీబియన్-దక్షిణ పసిఫిక్ సముద్రాల మధ్య వ్యూహాత్మకంగా కీలకంగా ఉన్న దేశాలలో అదొకటి. అందువల్లనే ఆ ప్రాంత దేశాలను ఆక్రమించుకొనేందుకు, వీలుగాకుంటే తన తొత్తు ప్రభుత్వాలను రుద్దేందుకు అమెరికా నిరంతరం చూస్తూ ఉంటుంది. దానిలో భాగమే ఇటీవలి పరిణామాలు.

సెల్: 8331013288



గమ్యమే 'ఆమె' లక్ష్యం...



స్వప్న కొండ

మహిళ అనే పదం ఈ మహిలో చాలా గొప్పది. సృష్టిని సృష్టించే ఈ మహిళ గొప్పతనం వర్ణించనలవి కానిది. స్త్రీ అనగానే కేవలం సౌందర్య భావనతో ప్రాచీన కవులు ఎన్నో కావ్యాలలో రకరకాలుగా వర్ణించారు. అందం, ఆలోచన, అణకువ, వివేకం, నేర్పు, బుద్ధి కుశలత, ఓపిక, సహనం అన్నింటికీ రూపం ఇస్తే అదే స్త్రీ. ఇన్ని గొప్ప లక్షణాలు. సృష్టిలో మరెవరికి ఉండవేమో... అందుకే అంటారు 'ముదితలు నేర్వగరాని విద్య కలదే ముద్దార నేర్పించినన్...' నేర్చుకుంటే స్త్రీకి రాని విద్య ఏదైనా కలదా! గుండు సూది నుంచి అంతరిక్షం దాకా ఏ రంగంలోనైనా నేటి స్త్రీ దూసుకుపోతుంది. అందుకే ఆమె విజయాలను గుర్తించడం, మహిళల ఆర్థిక సామాజిక సాంస్కృతిక రాజకీయ విజయాలను గౌరవించడం కోసం, లింగ సమానత్వం పునరుత్పత్తి హక్కులు మహిళలపై హింస, సమాన హక్కులు మొదలైన వాటి గురించి మాట్లాడుకునే సందర్భాన, ప్రతి ఏటా మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా జరుపుకుంటాం.

స్త్రీ...
జీవన గమనంలో నేస్తమై.
బాధలలో కన్నీళ్ళు తుడిచే తోబుట్టువై.
మనసు భారమైనప్పుడు వెన్నుతట్టి తోడయ్యే భార్య.
కష్టాల్లో నీ చేయి విడువని అండై...
పురిటి నొప్పులు తెలియని పురుష జాతికి తల్లై
గెలుపులో వెనకుండి,
కడగండ్లలో తోడుండి
ఎల్లప్పుడూ పక్కనుండేది స్త్రీ...

అందుకే స్త్రీని భూదేవితో పోలుస్తారు. స్త్రీ అంటే సహనం, సహనం అంటే స్త్రీ అని...

ఒక మహిళని ఆట బొమ్మలా చూసే రోజులు పోవాలి. చూసే కళ్ళలో మనసులో మార్పు వచ్చితీరాలి. ఎందుకంటే మనిషి పుట్టుకను ప్రసాదించే శక్తి స్త్రీకే సాధ్యం. తనకు జన్మనిచ్చిన స్త్రీ జాతిని ఏ విధంగా అవమానించినా అది ఎంతో అమానుషం. క్షమించరానీ నేరం. ఈ నేరాలను చేసిన వాళ్ళను కఠినంగా శిక్షించాలి. నిర్భయ చట్టాలకు మించిన కఠిన శిక్షలు అమలులోకి రావాలి...

స్త్రీలు విద్యావంతులు కానంత వరకు ఏ దేశమూ బాగుపడదు. మన అభివృద్ధి అంతా స్త్రీల అభివృద్ధిపైనే ఆధారపడి ఉన్నది. పురుషులతో సమానంగా స్త్రీలు అభివృద్ధి చెందితేనే అభివృద్ధి సాధ్యం. 'విద్య లేని వారు పశువుతో సమానం' కదా! మరి విద్య లేని స్త్రీలలో, స్త్రీలతో ఉండే పురుషుల సంగతి ఏమిటి? విద్యాధికులం అని గర్వపడే పురుషులకి ఇది చెంపపెట్టు. ఎన్నో దశాబ్దాలుగా స్త్రీలు విద్యకి దూరమయ్యారు. కొన్ని దశాబ్దాలుగా ఎందరో మహానుభావుల కృషి వల్ల విద్య స్త్రీలకు కూడా అందుబాటులోకి వచ్చింది. కానీ వారు అన్ని రంగాలలో అభివృద్ధి సాధిస్తున్నారు. ఇదే అవకాశం మొదటి నుంచి ఉంటే ఆ అభివృద్ధి ఊహించనలవి కానిది. స్త్రీలు ఎన్నో రంగాల్లో చేరి ఉద్యోగాలు చేస్తున్నారు. ఆడది అబల కాదు సబల అని నిరూపించుకున్నారు. కానీ ఉద్యోగ ధర్మంతో పాటు ఇంటి పని, వంట పని, పిల్లల పెంపకం తన బాధ్యత అయింది. ఈ పనుల్లో సమతుల్యం పాటించక తప్పడం లేదు.

ప్రతి సంవత్సరం మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుతారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి శతాబ్దానికి మించిన చరిత్ర ఉంది. 1908 సంవత్సరంలోకి తక్కువ పనిగంటలు, మెరుగైన ప్యాకేజీ, ఓటు హక్కు కోసం న్యూయార్క్ నగరంలో 15000 మంది మహిళలు భారీ ప్రదర్శన చేయడం వల్ల సోషలిస్టు పార్టీ 1909 సంవత్సరంలో జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రకటించింది 1975 సంవత్సరంలో అధికారికంగా గుర్తించింది. గత కొన్ని సంవత్సరాలుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం విభిన్న థీమ్‌లతో జరుపుకుంటున్నాం.

ఈ సంవత్సరం 2023లో ఆవిష్కరణ, సాంకేతికలో లింగ సమానత్వం అనే అంశాన్ని థీమ్‌గా నిర్ణయించారు. సాంకేతిక అభివృద్ధిలో మహిళలు, ఇతర అట్టడుగులు పాలుపంచుకుంటున్నప్పుడు మహిళల అవసరాలను తీర్చే, లింగ సమానత్వాన్ని ముందుకు తీసుకువెళ్లే ఆవిష్కరణ సంభావ్యత పెరుగుతుంది. దీనికి విరుద్ధంగా వారి అసాధారణ ఆర్థిక పరిణామాలను కలిగి ఉంటుంది.

ఐకాస, ఉమెన్స్ జెండర్స్ స్నాప్ షాట్ 2022 నివేదిక ప్రకారం డిజిటల్ ప్రపంచంలో మహిళలు లేకపోవడం వల్ల గత పదేండ్లలో తక్కువ, మధ్య ఆదాయ దేశాల స్థూల జాతీయత్పత్తి తగ్గింది. ఏమి చేయలేక పోయినట్లయితే ఈ నష్టం 2025 నాటికి పెరుగుతుంది. అందువల్ల అంతర్జాతీయ మహిళా దినోత్సవం 2023 డిజిటల్ రంగాలలో మహిళలు, బాలికల హక్కులను రక్షించడం, టెక్నాలజీ ఇన్నోవేషన్ అండ్ ఫర్ జెండర్ ఈక్వాలిటీ కింద ఆన్‌లైన్ సదుపాయం కల్పించడం జరిగింది. మహిళ అన్ని రంగాల్లో బుల్లెట్‌లా ముందుకు దూసుకుపోతుంది. ఆమె గెలుపు, ప్రగతిని ఆపటం ఎవరి తరము కాదు.

అమ్మ ఆమె ఓ సంయుక్త వాక్యం!

కాలుకు ముల్లు గుచ్చుకున్నా
కంటిలో కన్నీటి పొరలల్లుకున్నా
విరామమెరగని వాక్యమై
నా ఎదుట ప్రత్యక్షమవుతుంది!

గాయాలు గుణ పాఠాలు నేర్పుతాయి
బాధలన్నీ వంటి బిగువున
దాక్కుంటాయి
నొప్పి ఏ వైద్య పరీక్షకు అందదు
ఆమె ఓదార్పే భరోసా
వాక్యమవుతుంది!

నేనే మంత్ర విద్యలెరుగను
వేళకన్నీ సమకూరుతుంటయి
ఆమే ఇంట్లో లేనప్పుడే
నివాసమంతా అస్పష్ట
వాక్యమవుతుంది!

తాను లేకుంటే నేనేమైపోతాననే
అమ్మకు ఆమెకు నిత్య వివాదం
భిన్నాభిప్రాయాలు ఎన్ని ఉన్నా
ఆమె చేతిలోనే నన్నుంచి అదృశ్య
వాక్యమైంది!

పుట్టినప్పటి నుంచీ
నేను నేల మీద నడయాడినంత వరకు
అమ్మ ఆమే నిత్యం నన్ను
కంటికి రెప్పలై కాపాడిన సంయుక్త
వాక్యాలు!

ఈ సృష్టి ప్రతి కదలికా
ఆది నుంచీ ఆమె కరస్పర్శతోనే
నీవూ నేనూ ఎన్ని వాక్యాలు రాస్తే
ఆమెకో సమాన వాక్యం కాగలం!!

- కొట్ల వెంకటేశ్వర రెడ్డి
9440233261

మార్చి 8 మహిళలకు స్ఫూర్తి కావాలి

"75ఏండ్ల అజాది అమృత్ మహోత్సవంలో ఆమె మరణించింది. అయినా, ఆమె మానం నుండిరక్తం స్రవిస్తూనే ఉంది. కాశ్మీర్ నుండి కన్యాకుమారి దాకా... అత్యాచారాలకు గురైన శవాలు ఎందుకో ఈ మట్టిలో ఇంకటం లేదు... మనువాదం, ఫాసిజం, పితృస్వామ్యం దేశంలో నలుదిశలా ఊరేగుతున్నాయి. ఆమె మానప్రాణాలు ఉక్కుపాదాల కింద నలుగుతూనే ఉన్నాయి..." ఓ మహిళా కవి ఆవేదన. ఆమె చెపు తున్నట్టుగానే ప్రస్తుత సమాజం అద్దం పడుతోంది.

1910 నుండి మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవాలు వస్తున్నాయి... పోతున్నాయి... కానీ మహిళల సామాజిక స్థితిగతుల్లో మార్పు రావడం లేదు. ఈ పరిస్థితిలో ఈ ఆజాదీ ఎవరిది? ఈ ఉత్సవాలు ఎవరివి? అన్న ప్రశ్న వస్తుంది. రోజు రోజుకూ స్త్రీలపై హింస రకరకాల రూపంలో పెరిగిపోతూ ఉంది. ఇలా ఎందుకు జరుగుతుంది..? ముందుతరాల వారికి హింసలేని సమాజాన్ని అందించలేమా..? ఆకాశంలో సగమైన స్త్రీలు శ్రమ, ఉత్పత్తిలో సగానికి తక్కువ ఏమికాదు. కానీ కడుపులో బిడ్డను కనాలన్నా, తాను ఏమి చదవాలి, ఎంత వరకు చదువుకోవాలి, ఎలా జీవించాలనే విషయాలలో నిర్ణయించుకొనే స్వేచ్ఛ మాత్రం స్త్రీకి లేదు. స్త్రీ నడక, నడత చివరకు నవ్వుపై కూడా ఆంక్షలు విధించారు. ఇలా స్త్రీలంటే చిన్న చూపు, వివక్ష. స్త్రీ ఎప్పుడు మగవాడి కనుసన్నల్లో జీవించాలి. చిన్నప్పుడు తండ్రి, పెండ్లి తర్వాత భర్త, ముసలితనంలో కొడుకుల ఆధీనంలో జీవించాలి. ఇలా స్త్రీని బంధీని చేయటం ఈ సమాజం మొదటి నేరం. ఇక ఘనమైన మన చరిత్ర, సంస్కృతిలో కూడ "కార్యేషు దాసి, కరణేషు మంత్రి, భోజ్యేషు మాత, శయనేసు రంభా" అంటూ స్త్రీని పురుషునికి సొంత ఆస్తిగా మలిచారు. ఇలా భూస్వామ్య, పితృస్వామిక సంస్కృతిని వ్యవస్థీకృతం చేశారు. ఈ పరిస్థితి మారాలి. స్త్రీని కనీసం మనిషిగా చూసి గౌరవించే ఒక మానవీయ సమాజాన్ని నిర్మించేందుకు అందరూ కృషి చేయాలి.



అరుణ

అమలుకు నోచుకోని చట్టాల కారణంగా స్త్రీలపై కుటుంబ, లైంగిక హింస, రాజ్యహింస రోజు రోజుకూ పెరిగిపోతోంది. 1956, 1986లలో చేయబడ్డ హిందూ వారసత్వ చట్టం ప్రకారం ఆడ, మగ తేడాలేకుండా ఆస్తిలో సమానహక్కు ఇవ్వబడింది. కానీ భూస్వామిక పితృస్వామ్య వ్యవస్థలో ఏ కుటుంబం మహిళలకు ఆస్తిలో సమాన వాటా ఇవ్వటం లేదు. 1961 వరకట్న నిషేధ చట్టం చేసినప్పటికి, వరకట్నం గౌరవంగా అమలు చేయబడుతూ ఉంది. పెళ్ళిపేరుతో జరిగే తంతూ ఫక్తు వ్యాపారంగా మారి, మహిళల పట్ల శాపమైంది. ఈ దురాచారానికి ఎంతోమంది స్త్రీలు బలైపోతున్నారు. ఈ దురాచారం కారణంగా ఆడపిల్లలను గర్భంలోనే చంపుతున్నారు. ఫలితంగా దేశంలో స్త్రీల జనాభా తగ్గిపోతోంది. ప్రకృతికి విరుద్ధమైన ఈ చర్యను నిలువరించటానికి 1994 గర్భస్థశిశువులు పరీక్షల నియంత్రణ చట్టం చేయబడింది. అయినా భ్రూణ హత్యలు ఆగలేదు. ఏ డాక్టరు, తల్లిదండ్రులకు గాని శిక్షలు పడ్డ సందర్భం లేదు. కనీసం కేసులు కూడా రిజిష్టర్ కావటం లేదు. ఆడపిల్లలు లేకుండా కొత్త సహస్రాబ్దంలోకి మనం అడుగుపెట్టబోతున్నట్లు ఐక్యరాజ్యసమితి గణాంకాలు చెబుతున్నాయి. ఇది ప్రమాదకరం. 1991 నుంచి దేశంలో ప్రపంచీకరణ దశ మొదలైపాశ్చాత్య విష సంస్కృతి పెచ్చరిల్లి స్త్రీ శరీరం సరుకుగా, అంగడి బొమ్మగా, విలాస వస్తువుగా మార్చబడింది. ఫలితంగా స్త్రీలపై లైంగిక హింస పెరిగిపోయింది. ఈ విష సంస్కృతి కారణంగా మన దేశంలో ప్రతి గంటకు ఐదుగురిపై లైంగికదాడులు జరుగుతున్నాయని గణాంకాలు చెబుతున్నాయి.

బహుళజాతి కంపెనీలు తమ వస్తువులను ప్రచారం చేసుకొని అమ్ముకొని సొమ్ముచేసుకోవటం కోసం బుల్లితెరలో వస్తున్న ప్రోగ్రామ్స్, సీరియల్స్ ఆడవారినే విలన్లుగా చూపిస్తున్నారు. సినిమాల్లో హీరోయిన్ల పాత్ర అర్థనగ్నంగా, ఆత్మగౌరవంలేనిదిగా చిత్రీకరిస్తున్నారు. హీరోలైతే జులాయిలగా, అమ్మాయిలను వెంటబడి వేధించటమే ప్రేమగా చూపిస్తున్నారు. చివరకు ఉపాధ్యాయులను కూడా వదలటం లేదు. దీని ప్రభావం నేటి యువతపై పడి మానవీయ సంబంధాలు దెబ్బతింటున్నాయి. పెరిగిన వస్తు వ్యామోహం, వినిమయం, పాశ్చాత్య విష సంస్కృతి మూలంగా మొత్తం మానవ సంబంధాలు మార్కెట్ సంబంధాలుగా మారిపోయాయి. రకరకాల నేరాలు పెరిగి తుదకు విలువలు లేని సమాజం ఏర్పడింది. ఈ పరిస్థితిని నిలువరించాల్సిన పాలకులు బహుళజాతి సంస్థలకు, ధనికులకు అమ్ముడుపోయి బాధ్యతారాహిత్యంగా నడుచుకుంటున్నారు. మహిళల సమస్యలు చర్చించుకొని పరిష్కరించుకోవటానికి



చట్టసభలలో కనీసం స్త్రీలకు ప్రాతినిధ్యం లేకుండా పోయింది. ఏనాడు పార్లమెంట్‌లో మహిళా ప్రతినిధులు 11శాతానికి మించిలేరు. గత యూపీఏ ప్రభుత్వం చట్టసభలలో మహిళలకు 33శాతం రిజర్వేషన్ ఇస్తూ మహిళా బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది. కానీ ఆమోదం మాత్రం పొందలేదు. ఒకవేళ పొందిన స్త్రీలు చట్టసభలకు ఎన్నికైతే పంచాయతీరాజ్ అనుభవమే పునరావృతం అవుతుంది. స్త్రీలు డమ్మీలుగా మిగిలిపోగలరు. స్త్రీలను ఇంటికే పరిమితం చేసే భూస్వామ్య భావజాలం నేడు రాజ్యమేలుతోంది. ఈ రకంగా మొదటి నుండి రాజకీయ పరమైన వివక్ష కొనసాగుతూనే ఉంది. తీవ్ర ప్రజా ఉద్యమం ఫలితంగా అప్పటి యూపీఏ ప్రభుత్వం ఆర్భాటంగా తీసుకువచ్చిన నిర్భయ చట్టం-2013 అమలులోకి వచ్చి స్త్రీల మీద హింసారూపాలు, లైంగికదాడులు పెరిగిపోతున్నాయేగాని తగ్గటం లేదు. పైపెచ్చు ఇప్పటి బీజేపీ ప్రభుత్వ చర్యలు ఇందుకు వత్తాసు పలుకుతున్నాయి. బిల్కిస్ బానో కేసులో శిక్షలు పడి 11మంది ముద్దాయిలను 'అమృతోత్సవం' పేరిట వదిలవేయటం, ముద్దాయిలు హారతులందుకొని మరీ స్వాగత సత్కారాలు పొందటం జరిగింది. అలాగే యూపీలోని 'హత్రాస్'లో దళిత యువతిని సామూహికంగా లైంగికదాడి చేసి తగులపెట్టారు. కాశ్మీర్‌లో ఆసిఫా అనే ముస్లిం పసికూనను పవిత్ర దేవాలయంలో రోజుల తరబడి లైంగికదాడి చేసి చంపిన ముద్దాయిలను అరెస్టుచేస్తే, అక్కడి బీజేపీ వారు నిందితులను విడుదల చేయమని ఊరేగింపులు చేయటం లాంటి సంఘటనలతో సభ్య సమాజం నివ్వెరపోయి సిగ్గుపడింది. ఈ సంఘటనలు 'బేటి బచావో' ప్రభుత్వ (బీజేపీ) అసలురంగు బయట పెట్టింది.

సామాజిక పరిణామంలో మొదట స్త్రీలకు మంచి గౌరవం ఉండేది. మాతృస్వామిక వ్యవస్థే ఇందుకు ఉదాహరణ. ఆ తరువాత వ్యక్తిగత ఆస్తి, వర్గ సమాజం ఏర్పడ్డాక స్త్రీలకు ఆస్తిహక్కులేకుండా పోయింది. దీంతో స్త్రీలకు విలువపోయి వంటింటి కుందేలు అయిపోయింది. ఇదే నేటివరకు కొనసాగుతూ ఉంది. సరిగ్గా వివక్ష ఇక్కడే మొదలైంది. స్త్రీలను రెండురకాల బానిసలుగా మార్చివేసింది వర్గ సమాజం. ఇంటి బయట జీతమొచ్చే బానిసగా, ఇంట్లో జీతం లేని బానిసగా చేసింది. స్త్రీలు శ్రమ చేయటం తప్ప వారికి ఆస్తిని కలిగి ఉండే హక్కులేదు. ఇది స్త్రీలను పూర్తిగా బలహీన పరిచింది. అప్పటి నుండి నేటి వరకు స్త్రీలు అనేక రకాలుగా దోపిడీకి గురవుతున్నారు. కాబట్టి స్త్రీల దోపిడీకి, వివక్షకు మూలం పెట్టుబడిదారీ మార్కెట్ ఉత్పత్తి విధానం. ఆర్థిక అసమానతలతో కూడిన ఈ విధానం నశించాలి. అందుకు మరో స్వాతంత్ర్య పోరాటం జరగాలి. సోషలిస్ట్ వ్యవస్థలు ఏర్పడాలి. సోషలిస్ట్ వ్యవస్థలో సామాజిక ఉత్పత్తిలో శ్రమ విముక్తి జరిగి స్త్రీల భాగస్వామ్యం పెరిగి వారి విముక్తికి దారితీస్తుంది. ఇదే స్త్రీ విముక్తికి, అన్ని సామాజిక సమస్యల పరిష్కారానికి మార్గం.

సెల్: 9705450705





దేశ అభివృద్ధిలో పురుషులతో పాటు సమానంగా మహిళలు కూడా భాగం పంచుకుంటున్నారు. అయినప్పటికీ చాలా దేశాల్లో మగవారితో సమానమైన గౌరవం, అవకాశాలు స్త్రీలకు లభించడం లేదు. కొన్ని దేశాల్లో మహిళలు కటుంబం అనే నాలుగు గోడల మధ్యే నలిగిపోతున్నారు. లోకంలో స్త్రీ లేకపోతే జననం లేదు. స్త్రీ లేకపోతే గమనం లేదు. స్త్రీ లేకపోతే సృష్టిలో జీవం లేదు. స్త్రీ లేకపోతే అసలు సృష్టే లేదు. తల్లిగా లాలిస్తూ.. చెల్లిగా తోడుంటూ.. భార్యగా బాగోగులు చూస్తూ.. సేవకురాలిలా పనిచేస్తూ.. కుటుంబ భారాన్ని మోస్తూ... సర్వం త్యాగం చేస్తుంది మహిళ. అంతటి గొప్ప మహిళలకు చాలా దేశాలు క్రీడా, రాజకీయ, రక్షణ మంత్రిత్వ శాఖ, సైనిక రంగాలంలో ప్రోత్సహించడానికి ముందుకు వస్తున్నా అవి పూర్తి స్థాయిలో అమలులోకి రావడం లేదు.

డిజిటల్ ప్రపంచంలో మహిళలు

ప్రస్తుతం డిజిటలైజేషన్‌కు ప్రాధాన్యం పెరిగింది. ఈ డిటిటల్ యుగంలో ఇంటర్నెట్ సౌకర్యం నిషేదించిన దేశాల్లో కూడా మహిళలు డిజిటల్ వ్యవస్థను విరివిగా ఉపయోగిస్తున్నారు. కానీ గ్రామీణ ప్రాంతాల్లో నివసించే బాల బాలికలకు, మహిళలకు కుటుంబ నేపథ్యంలో ప్రాథమిక వినియోగం కూడా ఉండడం లేదన్నది యుఎన్ ఉమెన్స్ జెండర్ స్నాప్ షాట్ 2022 నివేదిక ప్రకారం తెలుస్తుంది. డిజిటల్ ప్రపంచంలో మహిళలు లేకపోవడం వల్ల గత పదేండ్లలో తక్కువ, మధ్య ఆదాయ దేశాల స్థూల దేశీయోత్పత్తి \$1 ట్రిలియన్ తగ్గిందనీ దీనిపై దృష్టి పెట్టకపోతే ఈ నష్టం 2025 నాటికి \$1.5 ట్రిలియన్లకు పెరుగుతుందని నివేదికలు హెచ్చరిస్తున్నాయి.

సమాజంలో మహిళలు లేకపోతే దేశ అభివృద్ధే ఉండదు. అలాంటి స్త్రీలను గౌరవించేందుకు ప్రతి సంవత్సరం మార్చి 8న మహిళ దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. ఈ 2023 అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని CSW - 67 (కమీషన్ ఆఫ్ స్టేటస్ ఆఫ్ విమెన్) 2023 థీమ్ DigitALL : "ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ ఫర్ జెండర్ ఈక్వాలిటీ". దీన్ని అమలులోకి తీసుకురావాలని, డిజిటల్ ప్రదేశాలలో మహిళలు, బాలికల హక్కులను రక్షించడం, ఆన్లైన్ , ఐసీటీ - సదుపాయం కల్పించి లింగ ఆధారిత హింసను పరిష్కరించడం అనే ప్రాముఖ్యతను హైలైట్ చేస్తుంది. నేడు 'అంతర్జాతీయ మహిళా దినోత్సవం' సందర్భంగా డిజిటల్ ప్రపంచంలో మహిళల పాత్ర ఎలా ఉందో తెలుసుకుందాం...



డిజిటల్ విద్యతో కొత్త ఆశయాలు

అసమానతలు తగ్గించాలి

మహిళలు, బాలికలు వారి హక్కులు, ప్రజల నిత్యావసరాల గురించి అవగాహనను ఆవిష్కరణలో సాంకేతికత, డిజిటల్ విద్యకు లింగ బేధం లేకుండా స్పందించే విధానాన్ని అమలులోకి తీసుకువచ్చి డిజిటల్ వ్యవస్థను ఉపయోగించడం ద్వారా స్థూల ఆదాయాన్ని పెంచవచ్చు. ఈ డిజిటల్ లింగ అంతరం ఫలితంగా మహిళలు వెనుకబడిపోవడంతో, డిజిటల్ టెక్నాలజీలతో యాక్సెస్, ప్రావీణ్యం పరంగా పురుషులు, మహిళల మధ్య పెరుగుతున్న అసమానతలను తగ్గించాలి. డిజిటల్ టెక్నాలజీ పురోగమనాలు మానవతావాద, అభివృద్ధి సమస్యలను పరిష్కరించడానికి, 2030 ఎజెండాలో నిర్దేశించిన స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలను సాధించడానికి అపారమైన అవకాశాలను అందిస్తున్నాయి.



సరైన ఆలోచన ఉంటే

గీతాంజలి రావు... టైమ్ మ్యాగజైన్ మొట్టమొదటి కిడ్ ఆఫ్ ది ఇయర్'. పదిహేనేండ్ల శాస్త్రవేత్త, ఆవిష్కర్త అయిన గీతాంజలి రావు టైమ్ మ్యాగజైన్ మొట్టమొదటి 'కిడ్ ఆఫ్ ది ఇయర్'గా ఎంపికైంది. ఈమె కలుషితమైన తాగునీటి నుండి ఓపియాయిడ్ వ్యసనం, సైబర్ బెదిరింపు వరకు సమస్యలను పరిష్కరించడానికి సాంకేతికతను ఉపయోగించారు. మన చుట్టూ అంతర్జాల ప్రపంచం విస్తరించి ఉన్నా... ఆర్థిక రంగంలో మాత్రం అంతగా ఉపయోగించడం లేదు. సరైన ఆలోచన ఉంటే కొద్ది అవగాహనతోనే మన చేతిలో వున్న ఫోన్ ద్వారానే మనం ఏ విద్య నైనా అభ్యసించ వచ్చు.

యూట్యూబ్ ద్వారా...

"మహిళలు సాధించిన ప్రగతి స్థాయిని బట్టి నేను సంఘ పురోగతిని కొలుస్తాను" అన్న బీఆర్ అంబేద్కర్ వాక్యాలని గుర్తుచేసుకుంటూ ఈ మధ్యనే విడుదలైన 'జయ జయ జయహే' సినిమానే తీసుకుంటే భర్త కొట్టె దెబ్బల నుండి తప్పించుకోవడానికి ఇంటి దగ్గర వుండి కరాటే నేర్చుకున్న అంశాన్ని ప్రాతిపదికగా తీసుకున్న సినిమా కథ మన చుట్టూ జరిగే హింస నుండి తప్పించుకోవడానికి ఓ మంచి ఉదాహరణగా చెప్పుకోవచ్చు. అంత వరకు ఎందుకు ఎందరో మహిళలు యూట్యూబ్‌లో తమకు నచ్చిన వంటలు చేస్తూ, నేర్పుతూ, ఆదాయ మార్గాల్ని సృష్టించుకుంటున్నారు. డిజిటల్ విద్య ద్వారా అనేక ఉద్యోగ అవకాశాలు ఏర్పరుచుకునే దిశలు మహిళలు ఆలోచిస్తారని నేటి ఆశిస్తూ మహిళా దినోత్సవం సందర్భంగా 'ఆమె'కు చక్కని బహుమతిగా డిజిటల్ విద్య ద్వారా కొత్త ఆశయాలని అందించడమే కాకుండా మనసారా శుభాకాంక్షలు తెలియజేయండి.

- రూపరుక్మిణి.కె

మహిళకు సమానత్వం ఇవ్వాలి



మహిళ కేవలం కొన్ని పనులకే పరిమితం కాకూడదు. అన్నింటిలో సమానత్వం కోసం నిరంతరం కృషి చేస్తూనే ఉండాలి. DigitAll అనే ప్రాతిపదికతో ఈ సంవత్సరం కమ్యూనికేషన్ రంగంలో మన సమాన హక్కుల కోసం ఒక కూడికను ఏర్పాటు చేశారు. తద్వారా వెనకబడిన మహిళలను ముందుకు తీసుకువెళ్ళటానికి చర్యలు చేపట్టినందుకు ధన్యవాదములు. కరోనా వల్ల మహిళలకు ఇంటి పని, వంట పనే కాకుండా స్మార్ట్ ఫోన్ ఆవశ్యకత దాని, ఉపయోగాలు, దానిని వాడే తీరు తెలుసుకొని ప్రస్తుతం చాలా వరకు ఆన్‌లైన్‌పైనే ఆధారపడి పోతున్నారు. DigitAll అనేది కేవలం నినాదంలా కాకుండా డిజిటల్‌కు సంబంధించిన అన్నింటిలోనూ మహిళలు కూడా సమానంగా రాణించేలా మనం ఆ ఆధునికతో కూడిన టెక్నాలజీని నేర్చుకోవాలి. టెక్నాలజీపై అవగాహన పెంచుకోవడం ద్వారా ఎంత ఉపయోగం ఉంటుందో నేనూ ఒక ఉదాహరణే. పదిహేను సంవత్సరాలు టీచర్‌గా పని చేసాను. ఆ సమయంలో స్కూల్లో వాడా టెక్నాలజీ చాలా తక్కువ. ప్రతీది పుస్తకంలో చూసి చెప్పడమే. క్రమంగా పిల్లల మార్కులు ఆన్‌లైన్ చెయ్యడం, డిజిటల్ క్లాస్ రూములు ఏర్పాటు చేయటం ప్రారంభించారు. అవి ఏర్పాటు చెయ్యడం వలన మాలాంటి వాళ్ళు ఎంతోమంది టెక్నాలజీ గురించి తెలుసుకొని, నేర్చుకొని ఇప్పటి ప్రస్తుత కాలామానానికి సరితూగుతున్నాము. అయితే టీచర్ ఉద్యోగం మానేసి ఎనిమిదేండ్ల కిందట వ్యాపారం మొదలుపెట్టాను. దాంతో కష్టమర్లతో మాట్లాడటానికి వాట్సాప్ వాడడం, మార్కెటింగ్ కోసం డిజిటల్ ప్లాట్‌ఫామ్స్, ఫేస్‌బుక్, బిల్లింగ్, స్టాఫ్ట్ వేర్ వంటికి ప్రస్తుతం అనర్గళంగా వాడగలుగుతున్నాను. కాబట్టి DigitAllకు నేనే నిజమైన సాక్ష్యాన్ని. 50 ఏండ్లు పైబడిన ప్రతి మహిళ జ్ఞాపక శక్తి తగ్గి పోకుండా ఆన్‌లైన్ పజిల్స్, బ్రెయిన్ గేమ్స్ వంటివి ఆడడం మంచిది.

- వి.ప్రతిభ

ఆన్ డిక్టేషన్ తీసుకుని



ఆడుతూ పాడుతూ ఎం.ఎ. వరకు చదివాను. కానీ ఉద్యోగ విషయంలో చాలా సమస్యలు ఎదుర్కొన్నాను. ఎప్పటికప్పుడు పాతవాటిని మర్చిపోయి ముందుకు వెళ్ళడం, కుంగిపోకుండా ఉండడం నా మనస్తత్వం. ఏ పనైనా నేను చెయ్యగలను అని చెప్పడం, అలాగే చెయ్యడం అనేదే నన్ను ఈ రోజు డిజిటల్ ప్రపంచంలో ఒక విజేతగా నిలబెట్టింది. కంప్యూటర్ రంగంలో కొత్త విషయాలు నేర్చుకుంటూ, ఎంతోమంది మానసికంగా కుంగిపోయిన వాళ్ళకి నేర్పించి వాళ్ళ జీవితాలు నిలబెట్టగలిగాను. కంప్యూటర్ నేర్చుకోవడం మొదలుపెట్టిన కొత్తలో చాలా కష్టపడ్డాను. పట్టుదలతో నేర్చుకున్నాను. అవసరమైన వారికి అనువుగా వర్కులు చేసిపెట్టగలడం నాకు చాలా సంతృప్తినిచ్చింది. అమెరికా నుంచి ఆన్ డిక్టేషన్ తీసుకుని పుస్తకాలకి పుస్తకాలు తయారు చేయడం మరో విజయం. స్వయంకృషితో పైకి రావడంతో ఎంతో సంతృప్తి మిగిలింది.

- దామరాజు నాగలక్ష్మి

ఆన్‌లైన్‌లోనే ఎక్కువ కోచింగ్



మా అమ్మ నాగమణి, నాన్న రాపాల వెంకటేశ్వరరావు. ఆరవ తరగతి వరకు నేను అవేరేజ్ స్టూడెంట్‌ని. మా నాన్నకి ఆక్సిడెంట్ అయ్యాక కుటుంబ బాధ్యతలు అంటే ఏమిటో తెలిసొచ్చాయి. అప్పటి నుండి బాగా చదువుతూ టాప్ 3లో వుండేదాన్ని. ఫస్ట్ టైం నన్ను నేను పేపర్‌లో చూసుకోవడం, మధిరలో ఈ అమ్మాయికి చదువు రాదు అని చెప్పిన సర్‌తో మీరు చదువు చెప్పిన వాళ్ళకి ఎవరికైనా ఇన్ని మార్కులు వచ్చాయా అని నాన్న అడిగారు. అప్పుడు, ఆ తర్వాత సీఏ క్వాలిఫై ఐనప్పుడు .. మా నాన్న చాలా హ్యాపీగా ఫీలయ్యారు. పేరెంట్స్ హ్యాపీగా ఉంటే అది నా వల్లే కాబట్టి నాకెంతో తృప్తి నిచ్చింది. గుంటూరులోని మాస్టర్‌మైండ్ కాలేజీలో చేరి సీరియస్‌గా చదివాను. అమ్మాయిలు, అబ్బాయిలు అనే తేడా చూపించి ఔట్‌స్టేషన్ ఆడిట్స్‌కి అబ్బాయిలనే పంపేవారు. అలాగే కాలేజీలో అమ్మాయిలు, అబ్బాయిలు మాట్లాడుకోకూడదు అనే రూల్ పెట్టారు. దాంతో జాబ్ చేసేటపుడు కూడా అబ్బాయిలతో మాట్లాడడానికి భయం వేసేది. ఒక్కోసారి రాత్రి ఆలస్యమైతే అమ్మ ఈ ఉద్యోగం వద్దు మానేసెయ్ అనేది. అయితే నేను కోచింగ్ తీసుకునేటపుడు ఆన్‌లైన్ క్లాసులు చూసి చాలా నేర్చుకున్నాను. ఇలా డిజిటల్ రంగం నాలాంటి అమ్మాలకు ఎంతో ఉపయోగపడింది. నీ గోల్ నీకు క్లియర్‌గా ఉంచుకో దానికి కష్టపడు. ఇంట్లో తిడతారు, ఏం చెయ్యట్లేదు, టైం వేస్ట్ చేస్తున్నావు అని అంటుంటారు. అయితే ఒక్కసారి విజయం సాధించామా అన్నీ మారిపోతాయి. నీ ఆలోచనలకు నువ్వే పెట్టుబడి తెచ్చుకోవాలి. మీ తల్లిదండ్రుల మీద ఆధారపడొద్దు. గ్రాడ్యుయేషన్ తర్వాత ఓ లక్ష్యంగా నడిచిన ప్రయాణంలో ఇప్పుడు నేను చార్టెడ్ అకౌంట్‌గా స్థిరమైన సంపాదనతో నలుగురికీ సహాయం చేసే స్థాయికి చేరుకున్నాను.

- ఆర్.ప్రసన్న

మా నాన్నకు ఏదైనా జరిగితే వదలను

- లాలూ కుమార్తె రోహిణి
- లాలూ కుమార్తె ఇంట్లో ఐదు గంటలపాటు సీబీఐ.విచారణ...



న్యూఢిల్లీ: ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్‌ను మంగళవారం కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ ప్రశ్నిస్తోంది. ఆయన రైల్వే మంత్రిగా ఉన్న సమయంలో ఉద్యోగాలు ఇప్పించేందుకు కొంతమంది అభ్యర్థుల నుంచి భూములు తీసుకున్నారని అభియోగాలు నమోదయ్యాయి. ఈ కేసు విచారణలో లాలూ ,ఆయన కుమార్తె మీసా భారతి ఇంట్లో కొనసాగింది.

2004 నుంచి 2009 వరకు యూపీఏహయాంలో లాలూ రైల్వే మంత్రిగా ఉన్నారు. ఈ క్రమంలోనే 2008-09 మధ్య రైల్వే ఉద్యోగాలకు నియామక ప్రక్రియ జరగ్గా.. కొందరు అభ్యర్థులకు ఉద్యోగాలు ఇచ్చేందుకు వారి నుంచి లాలూ కుటుంబం భూములు, ఇతర ఆస్తులను లంచంగా తీసుకున్నట్టు వచ్చిన ఆరోపణలపై గతంలో సీబీఐ కేసు నమోదుచేసింది. బీహార్ మాజీ సీఎం లాలూతోపాటు ఆయన భార్య రబ్రీదేవి, మరో 14 మందిపై చార్జిషీటు దాఖలు చేసింది. సోమవారం రబ్రీని ఆమె నివాసంలో ప్రశ్నించిన సీబీఐ.. ప్రస్తుతం లాలూను విచారిస్తోంది.

నా తండ్రికి ఏదైనా జరిగితే.. ఎవర్నీ వదలను..

ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ నుంచి సీబీఐ గంటల తరబడి విచారిస్తోంది. దీనిపై లాలూ కుమార్తె రోహిణీ ఆచార్య ట్విటర్ వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. తన తండ్రిని నిరంతరం వేధిస్తున్నారని, ఆయనకు ఏదైనా జరిగితే ఎవర్నీ వదలనని హెచ్చరించారు. ఈ మేరకు వరుస ట్వీట్లు చేశారు.'తన తండ్రిని వేధిస్తోన్న తీరు సరికాదు. ఇవన్నీ గుర్తుంటాయి. సమయం అన్నింటికంటే శక్తివంతమైంది. ఆయనకు దిల్లీలోని పీఠాన్ని కదిలించే శక్తి ఇప్పటికీ ఉంది' అని అన్నారు. అలాగే సహనానికి కూడా హద్దు ఉంటుందని, దాన్ని కూడా పరీక్షిస్తున్నారంటూ మండిపడ్డారు.ఇదిలా ఉంటే.. సింగపూర్‌లో విజయవంతంగా కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స అనంతరం లాలూ ప్రసాద్ ఇటీవలే స్వదేశానికి తిరిగొచ్చారు. రోహిణినే ఆయనకు కిడ్నీ దానం చేసిన విషయం విదితమే.

నియంతృత్వమే

(మొదటిపేజీ తరువాయి)

వచ్చిన మార్పు...తుడుచుకుపెట్టుకు పోయింది. ఇందుకు ప్రధాన కారణం ఆయా దేశాల్లోని పాలకులు, వారి రాజకీయ విధానాలు. కేవలం 13శాతం ప్రజలే స్వేచ్ఛాయుత ప్రజాస్వామ్య దేశాల్లో జీవిస్తున్నారు. 35 దేశాల్లో వాక్ స్వాతంత్ర్యం క్షీణిస్తోంది. 45 దేశాల్లో మీడియాపై సెన్సార్‌షిప్ పెరిగింది. 37 దేశాల్లో పౌర హక్కులకు తీవ్రస్థాయిలో విఘాతం కలిగింది. అర్మేనియా, గ్రీస్, మారిషస్..తదితర దేశాల్లో ప్రజాస్వామ్యం వేగంగా బలహీనపడుతోంది.

కోవిడ్-19 పేరుతో

అనేక దేశాల్లో ప్రభుత్వాలు కోవిడ్-19 సంక్షోభాన్ని సాకుగా చూపి మొత్తం అన్ని వ్యవస్థల్ని తమ చేతుల్లో బంధించాయి. పౌరుల స్వేచ్ఛ, హక్కుల్ని బలహీనపర్చేలా అనేక చట్టాలు చేశాయి. హంగేరీ అధ్యక్షుడు విక్టోర్ ఓర్బాన్ తన అధికారాన్ని నిలబెట్టుకోవటానికి దేశంలో పలు మార్లు అత్యవసర పరిస్థితులు ప్రకటించాడు. కోవిడ్ సమయంలో ఆరోగ్య అత్యవసర పరిస్థితి, 2022లో ఉక్రెయిన్ యుద్ధాన్ని సాకుగా చూపి అత్యవసర పరిస్థితి విధించాడు. అమెరికాలోని కెంటకీలో బొగ్గు తవ్వకాలకు వ్యతిరేకంగా సాగిన నిరసనలపై అణచివేత, అబార్షన్లను నిషేధిస్తూ టెక్సాస్‌లో నిర్ణయం...అమెరికా స్థాయిని దిగజార్చింది.

భారత్‌లో...

జమ్మూకాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేశాక, మోడీ సర్కార్ అక్కడ కొత్త చట్టాల్ని తీసుకొచ్చింది. ఏప్రిల్ 2020లో 'నివాస చట్టాన్ని' అమల్లోకి తీసుకొచ్చింది. కాశ్మీరీల హక్కులను దెబ్బతీస్తూ కేంద్రం ఏకపక్ష ధోరణితో కీలక నిర్ణయాలు చేస్తోంది. దీంతో కాశ్మీర్‌లో పరిస్థితి నానాటికి దిగజారుతోంది. అనేక దేశాల్లో నెలకొన్న 'నియంత పోకడలు' భారత్‌లోనూ ఉన్నాయి. 2020లో ఏకపక్షంగా విధించిన లాక్‌డౌన్‌తో ఎంతోమంది వలసకూలీలు, పేదలు రోడ్డునపడ్డారు. 'ఎన్నికలతో కూడిన నియంతృత్వ' దేశంగా భారత్‌ను 2021లో వి-డెమ్ పేర్కొంది. పౌర సంఘాల అణిచివేత, వాక్ స్వాతంత్రంపై దాడులు, మీడియా, పౌర హక్కుల కార్యకర్తలపై నిఘా పతాక స్థాయికి చేరింది. విద్య, సాంస్కృతిక రంగాల్లో అణచివేత, వివక్ష తీవ్రస్థాయికి చేరాయి. తప్పుడు సమాచారం, మతపరమైన ఏకీకరణ..నియంతృత్వాన్ని బలోపేతం చేస్తున్నాయి. అందువల్లే ఆఫ్ఘనిస్తాన్, భారత్, బ్రెజిల్, మయన్మార్‌లు 'నియంతృత్వ' దేశాలుగా వేగంగా మార్పు చెందుతున్నాయి.

బీజేపీ ఎమ్మెల్యేనా..మజాకా..!

(మొదటిపేజీ తరువాయి)

కుమారుడు వి ప్రశాంత్ మదాల్ నుంచి లోకాయుక్త గత వారం రూ. 8 కోట్లకు పైగా రికవరీ చేసింది. ఆ తర్వాత లోకాయుక్త లంచం కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేసి విరూపాక్షప్పను నంబర్ వన్ నిందితుడిగా పేర్కొన్నారు.

పరారీలో ఎమ్మెల్యే...

మాదాల్ విరూపాక్షప్పపై అవినీతి ఆరోపణలు రావడంతో పరారీలో ఉన్నాడు. లంచం కేసులో దర్యాప్తు అధికారి ఎదుట హాజరుకావాలని కోర్టు బీజేపీ ఎమ్మెల్యేను ఆదేశించింది. తిరిగి వచ్చిన ఆయనకు దావణగెరెలో మద్దతుదారుల నుంచి ఘన స్వాగతం లభించింది.

మరోవైపు లోకాయుక్త నిబంధనల ప్రకారం ఉచ్చు బిగించిన అధికారులు నిమగ్నమయ్యారు.

లంచం కేసులో డిప్యూటీ ఎస్పీ ప్రమోద్ కుమార్, ఇన్ స్పెక్టర్ కుమారస్వామి విచారణాధికారులుగా ఉన్నారు. తాజాగా వారిని మార్చేసి... కొత్త దర్యాప్తు అధికారులుగా డిప్యూటీ ఎస్పీ ఆంథోనీ జాన్, ఇన్‌స్పెక్టర్ బాలాజీబాబు నియమితులయ్యారు.

కరాటక రాష్ట్రం దావణగెరె జిల్లా చన్నగిరి ఎమ్మెల్యే మాదాల్ విరూపాక్షప్ప తన కొడుకు రూ.40 లక్షలు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డాడు. క్యాష్ ఫర్ కాంట్రాక్ట్ కుంభకోణంలో, ఎమ్మెల్యే కుమారుడు వి ప్రశాంత్ మదాల్ నుండి లోకాయుక్త గత వారం రూ. 8 కోట్లకు పైగా రికవరీ చేసింది. ఆ తర్వాత లోకాయుక్త లంచం కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేసి విరూపాక్షప్పను నంబర్ వన్ నిందితుడిగా పేర్కొన్నారు.

విరూపాక్షప్ప ఛైర్మన్‌గా ఉన్న కర్ణాటక సోప్స్ అండ్ డిటర్జెంట్స్ లిమిటెడ్ కార్యాలయంలో లోకాయుక్త అధికారులు ట్రాప్ చేసి లెక్కల్లో చూపని నగదును స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు.

తదుపరి సోదాల్లో కేఎస్‌డీఎల్ కార్యాలయంలో సుమారు రూ.2 కోట్లు, ప్రశాంత్ ఇంటి నుంచి రూ.6 కోట్లకుపైగా స్వాధీనం చేసుకున్నారు. మొత్తంగా కర్ణాటకలోని పలు ప్రాంతాల్లో రూ.8.23 కోట్ల నగదు, భారీగా బంగారం, వెండి ఆభరణాలు, భూముల్లో పెద్ద మొత్తంలో పెట్టుబడులు బయటపడ్డాయి.

దేశపతికి ఎమ్మెల్సీ

(మొదటిపేజీ తరువాయి)

ఆదేశించారు. గవర్నర్ కోటాలోని మరో ఇద్దరు ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికను గురువారం జరిగే మంత్రివర్గ సమావేశంలో ఖరారు చేయాలని నిర్ణయించారు. ప్రస్తుత ఎమ్మెల్సీలు నవీన్ కుమార్, గంగాధర్‌గౌడ్, ఎలిమినేటి కష్టారెడ్డిల పదవీకాలం ముగిసింది. దీనితో ఎమ్మెల్యే కోటాలో ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలైంది. గతంలో ఉపాధ్యాయుడిగా పనిచేసి, పదవీకాలం ముగిసిన నవీన్‌కుమార్‌కు మాత్రమే సీఎం కేసీఆర్ మరోసారి అవకాశం ఇచ్చారు. అలాగే ప్రస్తుతం ముఖ్యమంత్రి కార్యాలయం ఓఎస్డీగా పనిచేస్తున్న దేశపతి శ్రీనివాస్‌కు ఈసారి ఎమ్మెల్సీ అవకాశం ఇచ్చారు. దేశపతిని ఇప్పటికే పలుమార్లు ఎమ్మెల్సీగా అవకాశం కల్పిస్తారని ప్రచారం జరిగింది. కానీ పలు కారణాలతో ఇది వాయిదా పడుతూ వచ్చింది. మరో ఎమ్మెల్సీగా ఎంపికైన చల్లా వెంకట్రామిరెడ్డి మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి మనుమడు. ఆయన ఇటీవలే బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీ దేశవ్యాప్త విస్తరణలో ఆయన సేవల్ని ఉపయోగించుకోవాలనే ఉద్దేశ్యంతో వెంకట్రామిరెడ్డికి అవకాశం ఇచ్చినట్టు తెలుస్తుంది. మరోవైపు ఎమ్మెల్సీలుగా అవకాశం కల్పిస్తారనే ఆశతో ఉన్న భిక్షమయ్య గౌడ్, దాసోజు శ్రవణ్, స్వామిగౌడ్‌కు నిరాశ మిగిలింది. అయితే గవర్నర్ కోటాలో ఎంపిక చేసే పేర్లలో తాము ఉండొచ్చనే ఆశాభావాన్ని ఆశావహులు వ్యక్తం చేస్తున్నారు. గవర్నర్ కోటా కింద గతంలో పాడి కౌశిక్ రెడ్డి పేరును మంత్రివర్గ ఆమోదించి, గవర్నర్‌కు సిఫార్సు చేసినప్పుడు ఆమె పున్నపరిశీలన చేయాలని ఫైల్‌ను తిప్పిపంపిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గవర్నర్ కోటా అభ్యర్థుల విషయంపై ఆచితూచి వ్యవహరించాలని సీఎం కేసీఆర్ భావిస్తున్నట్టు సమాచారం. అందువల్లే ఆ అభ్యర్థుల పేర్లను నేరుగా ప్రకటించకుండా, మంత్రివర్గ సమావేశంలో చర్చించి, ఆమోదం తీసుకొని వెల్లడించాలని భావిస్తున్నట్టు తెలిసింది.

మాణిక్‌రెడ్డికి టీటీఏ సంపూర్ణ మద్దతు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీఎస్‌యూటీఎఫ్ బలపరిచిన అభ్యర్థి పాపన్నగారి మాణిక్‌రెడ్డికి ట్రైబల్ టీచర్స్ అసోసియేషన్ (టీటీఏ) సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు మంగళవారం టీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ హరికిషన్, ప్రధాన కార్యదర్శి వి శ్రీనునాయక్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు జె శ్రీనివాస్ రాథోడ్, కోశాధికారి కె కిషన్, రంగారెడ్డి జిల్లా నాయకులు శ్రీనివాస్ నాయక్ సమక్షంలో మద్దతు లేఖను టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె జంగయ్య, చావ రవి, ఎమ్మెల్సీ అభ్యర్థి మాణిక్ రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా హరికిషన్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగం, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం నిరంతరం పోరాడుతున్న టీఎస్‌యూటీఎఫ్‌తో ఐక్య ఉద్యమాల్లో కలిసి పనిచేస్తున్నామని చెప్పారు. ఈ ఐక్యతను బలోపేతం చేసేందుకే మాణిక్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలని నిర్ణయించామని వివరించారు. టీటీఏ నాయకులు, కార్యకర్తలందరూ మాణిక్‌రెడ్డి గెలుపు కోసం స్వచ్ఛందంగా కృషి చేస్తామని ప్రకటించారు. టీటీఏ మద్దతు ప్రకటించడం పట్ల టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె జంగయ్య, చావ రవి, ఎమ్మెల్సీ అభ్యర్థి మాణిక్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

నోట్ల గుట్టలున్న మీ ఎమ్మెల్యేపై చర్యలేవీ?

న్యూఢిల్లీ: మద్యం కుంభకోణం కేసులో ఏమీ లేని సిసోడియాపై అన్ని కేసులు పెట్టినప్పుడు.. నోట్ల గుట్టలు దొరికిన కర్నాటకలో బీజేపీ ఎమ్మెల్యేను ఎందుకు అరెస్టు చేయలేదు? అని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ప్రశ్నించారు. తాజాగా ప్రధాని మోడీకి ఆప్ అధినేత సూటి ప్రశ్న వేశారు. కర్నాటక లో బీజేపీ ఎమ్మెల్యే కుమారుడి 'లంచావతరం' ఘటనను ఉదహరిస్తూ తీవ్ర విమర్శలు గుప్పించారు.

"ప్రధాని జీ.. మనీశ్ సిసోడియా నివాసంలో సోదాలు జరిపినప్పుడు అధికారులకు ఏం లభించలేదు. అయినా సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)లోని అన్ని సెక్షన్ల కింద కేసులు పెట్టి ఆయనను అరెస్టు చేశారు. అదే మీ పార్టీ ఎమ్మెల్యే ఇంట్లో సోదాలు చేస్తే పెద్ద మొత్తంలో నగదు బయటపడింది. అయినా ఆయనను ఎందుకు అరెస్టు చేయలేదు? ఇంకెప్పుడూ అవినీతిపై పోరాటం గురించి మాట్లాడకండి. ఆ మాటలు మీకు సరిపోవు" అంటూ ఘాటు విమర్శలు చేశారు.

మనువాద ఎజెండాతో బీజేపీ

(మొదటిపేజీ తరువాయి)

నిత్యం జరగడం బాధగా ఉందన్నారు. మహిళలకు అన్ని రకాల వివక్షతలనుంచి విముక్తి కావాలంటే పోరాటమే ఏకైక మార్గమని చెప్పారు. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చి ఎనిమిదేండ్లయిందనీ, ఈ కాలంలో మహిళల హక్కులకు తీవ్ర ప్రమాదం ఏర్పడిందని వివరించారు. రాజ్యాంగంపైన్నే దాడి జరుగుతున్నదనీ, ప్రజల మౌలిక హక్కులకు భంగం వాటిల్లుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. లౌకిక, ప్రజాస్వామిక విలువల స్థానంలో మనుధర్మశాస్త్ర భావజాలంతో కూడిన విధానాలను ప్రతిష్టించాలని ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో పనిచేస్తున్న మోడీ ప్రభుత్వం కుట్రలకు తెరలేపిందని చెప్పారు. భారత రాజ్యాంగానికి పరిమితులున్నప్పటికీ..పనిభద్రత, ఆహారభద్రత, కనీస వేతనాలకు అవకాశంతో పాటు,వాటి సాధన కోసం పోరాటాలు నిర్వహించే కనీస ప్రజాస్వామిక హక్కులున్నాయని తెలిపారు. రాజ్యాంగ హక్కులకు లోబడే వరకట్న నిషేధ , గృహహింస వ్యతిరేక తదితర చట్టాలొచ్చాయని గుర్తుచేశారు. చట్టాలున్నా..వాటి అమలులో పాలకులు తమ పురుషాధిక్యతా భావజాలంలో భాగంగా అమలులో తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారని చెప్పారు. దీంతో పని ప్రదేశాల్లో వేధింపులు, లైంగిక దాడులు నిత్యకృత్యమయ్యాయని తెలిపారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న శ్రామిక మహిళలకు ఏ మాత్రం రక్షణ లేదన్నారు. పాలక వర్గాలు తమ రాజకీయ అధికారాన్ని పదిల పర్చుకునేందుకు మహిళలను కేవలం ఓటు బ్యాంకులుగా మలుచుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జనాభాలో సగభాగంగా ఉన్నప్పటికీ..చట్టసభల్లో 10శాతానికి మించి లేరని తెలిపారు. నిర్ణయాలు చేసే దగ్గర మహిళల ప్రాతినిధ్యం పెరిగాల్సిన అవసరం ఉందని చెప్పారు. చట్ట సభల్లో 33శాతం రిజర్వేషన్ల కోసం సాగుతున్న ఆందోళనల్లో (యూపీఏ ప్రభుత్వ కాలంలో) బీజేపీ పార్లమెంట్ మహిళా సభ్యులు సానుకూలంగా మాట్లాడారనీ, ఇప్పుడు పూర్తి మెజార్టీ వచ్చిన తర్వాత కిమ్మనకుండా ఉండటంలో మహిళా సాధికారత పట్ల బీజేపీ చిత్తశుద్ధి ఎంటో అర్థమవుతున్నదని విమర్శించారు. మోడీ ప్రభుత్వ ఆర్థిక విధానాల మూలంగా దేశంలో పేదలు దయనీయమైన జీవితాలను గడుపుతున్నారని చెప్పారు. బీజేపీ ఎనిమిదేండ్ల కాలంలో గ్యాస్ ధరలు రూ.450నుంచి రూ.1150 పెరగడం బాధాకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పేదలకు ఉపయోగపడుతున్న ఉపాధిహామీ చట్టానికి నిధులు తగ్గించిందని గుర్తుచేశారు. ఇలాంటి మహిళా వ్యతిరేక, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా మహిళా లోకం పోరాడాలని పిలుపునిచ్చారు.

పెరుగుతున్న దాడులు..వేధింపులు.. టీ జ్యోతి

ఆధునిక కాలం అని చెప్పబడుతున్న నేటి సమాజంలో మహిళలపై దేశంలో రోజుకొక చోట లైంగిక వేధింపులు, హత్యలు జరుగుతూనే ఉన్నాయని ఐద్వా ఉపాధ్యక్షులు టి జ్యోతి ఆందోళన వ్యక్తం చేశారు. సంప్రదాయాలు, ఆచారాలు, కట్టుబాట్ల పేరుతో స్త్రీని విలాస వస్తువుగా చూసే దుస్థితి నెలకొన్నదన్నారు. మను ధర్మశాస్త్రం స్త్రీలకు ఎలాంటి స్థానం కల్పించిందో, వారి పట్ల ఎలాంటి భావాన్ని కలిగి ఉందో..నేటికి అవే విధానాలు వారి పట్ల కొనసాగుతున్నాయని చెప్పారు. పురుషాధిక్యతా సమాజం మహిళనెప్పుడూ బానిసగానే చూస్తుందని తెలిపారు. మహిళలపై జరుగుతున్న దాడులకు మూలాలను వెతకాలన్నారు. వాటిపై సమరశీల పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

భద్రతలేని బతుకు..మల్లు లక్ష్మి

ఐద్వా ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి మాట్లాడుతూ మహిళలకు స్వాతంత్ర్యం, సమానత్వం పేపర్లోనే కనిపిస్తున్నాయని చెప్పారు. రోజురోజుకు భద్రత కరవౌతున్నదన్నారు. బడికి పోయిన పాప తిరిగి ఇంటికి వచ్చే వరకు తల్లి ఆందోళనతో ఎదురు చూడాల్సిన దౌర్భాగ్య స్థితి నెలకొన్నదని చెప్పారు. ఎల్‌కేజీ చదువుతున్న చిన్నారి నుంచి పండు ముదుసలి వరకు లైంగిక దాడులు జరుగుతున్న ఘటనలు వెలుగు చూస్తున్నాయన్నారు. దేశం విద్యా, వైద్యం తదితర రంగాల్లో పొరుగు దేశాలకంటే వెనుకబడి ఉందన్నారు. స్త్రీలపై దాడుల్లో మాత్రం ముందున్నామని చెప్పారు. దుర్ఘటన జరిగిన ప్రతిసారీ ప్రభుత్వాలు కంటితుడుపు చర్యలు చేపట్టడం తప్ప మూలాల్లోకి వెళ్లడం లేదని విమర్శించారు. మరోపక్క మహిళలు బయటకు రాకూడదని, దుస్తులు సరిగ్గా వేసుకోకపోవడం వల్లే ఆడపిల్లలపై దాడులు జరుగుతున్నాయని మనువాద బీజేపీ కేంద్రమంత్రులు వ్యాఖ్యానిస్తున్నారని విమర్శించారు. 'భారతమాతకు జై' అన్నవారే స్త్రీలను కించపరచడం వారి రెండు నాలుకల ధోరణికి అద్దం పడుతున్నదన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలు హింసలో మొదటి వరసలో ఉన్నట్టుగా గణాంకాలు చెబుతున్నాయని తెలిపారు. దేశంలో ప్రతి గంటకు నలుగురు మహిళలపై లైంగిక దాడులు, ప్రతి పది నిమిషాలకు ఒక కిడ్నాప్ జరుగుతున్నదని వివరించారు. ఉన్న మహిళా రక్షణ చట్టాలను తగిన రీతిలో అమలు చేయకుండా నీరుకారుస్తున్నారని తెలిపారు. ఆధునిక స్త్రీ చరిత్రను తిరిగి రాస్తుందన్న గురజాడ మాటలు నిజం కావాలనీ, మహిళలు, విద్యార్థులు, మేధావులు, అభ్యుదయవాదులు కలసికట్టుగా హింస లేని సమాజం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు బి హైమావతి, కార్యదర్శి బుగ్గవీటి సరళ, కెఎన్ ఆశాలత, నాగలక్ష్మి ప్రసంగించారు. శశికళ, వినోద, విమల, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి



నవతెలంగాణ-హైదరాబాద్

అభివృద్ధి పనులలో ఎలాంటి జాప్యం జరిగిన, నాణ్యతా ప్రమాణాలు పాటించకుంటే కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుంటామని రామంతపూర్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి అన్నారు. మంగళవారం డివిజన్‌లో జరుగుతున్న అభివద్ధి పనులను అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనులను త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందించాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలకుండా అధికారులు చొరవ చూపాలని ఆమె పేర్కొన్నారు.

కార్పొరేటర్ కార్యాలయంలో హెూలీ వేడుకలు

నవతెలంగాణ-హయత్ నగర్



వనస్థలిపురం? వనస్పారాబాద్ డివిజన్ పరిధిలో ఉన్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహ రెడ్డి నివాసంలో మంగళ వారం కార్యకర్తలు నడుమ డబ్బు,చప్పుల మధ్య హెూలీ సంబరాలు జరుపుకున్నారు.డప్పులు వాయిస్తూ ఒకరినొకరు రంగులు పూసుకుని వేడుకలు ఘనంగా నిర్వహించారు.

నందీహిల్స్ కాలనీలో హెూలీ సంబరాలు



మీర్‌పేట్ మున్సి పల్ కార్పోరే షన్ పరిధిలో నందీహిల్స్ కాలనీలో హెూలీ ఆడుతున్న మహి ళలు చిన్నారులు, కార్మికులు, సిఐటియు నాయకులు.

నవతెలంగాణ-మీర్ పేట్

బల్దియాలో జనన, మరణ ధ్రువపత్రాల లొల్లి

- 31వేల సర్టిఫికెట్లను రద్దుచేసిన జీహెచ్ఎంసీ
- విజిలెన్స్ విచారణకు కమిషనర్ ఆదేశం
- ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డికి బాధ్యతలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జీహెచ్ఎంసీ)లో నకిలీ జనన, మరణ సర్టిఫికెట్ల జారీ, బయటికొస్తే వాటిని రద్దు చేయడం, నగర వాసులను ఇబ్బందులకు గురిచేయం పరిపాటిగా మారింది. జనన, మరణ ధ్రువపత్రాల జారీ ప్రక్రియ అస్తవ్యస్తంగా ఉందని, సమూల మార్పులు చేస్తామని, కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో నగరవాసులకు సులభంగా సర్టిఫికెట్లను జారీచేయడానికి అవకాశముందని జీహెచ్ఎంసీ అధికారులు గొప్పలు చెప్పారు. కాని పరిస్థితి అందుకు విరుద్ధంగా మారింది. ఒక్క మాటలో చెప్పాలంటే జనన, మరణ సర్టిపికెట్లను తీసుకోవడం నగరవాసులకు భారంగా మారింది. కాసుల కక్కుర్తి కోసం అసలు పత్రాల్లేకుండా వేల సంఖ్యలో సర్టిఫికెట్లు జారీ చేసిన ఘనత జీహెచ్ఎంసీకే దక్కుతుంది. గతంలో ఫేక్ సర్టిఫికెట్ల జారీలో జీహెచ్ఎంసీ మెడికల్ ఆఫీసర్, ఇతర సిబ్బంది పట్టుబడిన విషయం తెలిసిందే. అయితే విదేశాలకు వెళ్లడానికి బర్త్ సర్టిఫికెట్లు, ఆస్తుల కోసం డెత్ సర్టిఫికెట్లను కొందరు అక్రమార్కులు అడ్డదారిలో పొందడానికి అధికారుల నిర్లక్ష్యమే కారణం. కాని నిబంధనల ప్రకారం, ప్రభుత్వ నిబంధనలను అనుసరించి సర్టిఫికెట్ తీసుకున్నవారూ ఉన్నారు. అయితే చెల్లని కాగితాలతో వేల సర్టిఫికెట్లు జారీ చేయటం, అక్రమం బట్టబయలైన తర్వాత సక్రమంగా ఎవరు తీసుకున్నారు? అక్రమంగా ఎవరు తీసుకున్నారు? అనే విషయాలను పట్టించుకోకుండా అన్నింటిని రద్దు చేయటం పట్ల ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతుంది. బాధ్యతాయుతమైన అధికారులే కాసుల కోసం ఇలా అడ్డదారిలో జనన, మరణ సర్టిఫికెట్లు జారీ చేయగా వాటిని రద్దు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఆస్తిపన్ను చెల్లించకపోతే, ట్రేడ్ లైసెన్స్‌లు లేకుండ వ్యాపారాలు చేస్తే, చివరకు బతుకుదెరువు కోసం టులెట్ బోర్డులు పెట్టిన వాటిపై వేలాది రూపాయల జరిమానాలు విధిస్తున్నా.. 30వేల సర్టిఫికెట్లను రద్దు చేసిన జీహెచ్ఎంసీ అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని జనం ప్రశ్నిస్తున్నారు.

నాన్ అవెలబిటీ సర్టిఫికెట్ అంటే?

జీహెచ్ఎంసీ జారీ చేసే నాన్ అవెలబిలిటీ సర్టిఫికెట్ అంటే ఇంట్లో జన్మించిన వారికి బర్త్, మరణించినవారికి డెత్ సర్టిఫికెట్లకు సంబంధించిన వివరాలు రికార్డుల్లో లేకపోయిన, ఏడాది తర్వాత తీసుకున్నవారికి నాన్ అవెలిబిలిటీ సర్టిఫికెట్‌ను జారీ చేస్తారు. ఈ సర్టిఫికెట్ తీసుకున్న తర్వాత రెవెన్యూ ఉన్నతాధికారుల వద్ద తమ స్టేట్ మెంట్‌ను రికార్డు చేయడంతోపాటు అధికారులు సర్టిఫైతో వార్త పత్రికల్లో ప్రకటన ఇచ్చి, అభ్యంతరాలను ఆహ్వానించి, ఎవరు అభ్యంతరాలు వ్యక్తం చేయకపోతే సర్కారును ఆశ్రయించి సదరు బర్త్, డెత్‌కు సంబంధించిన గెజిట్ పొందాల్సి ఉంటుంది. ఆ తర్వాత జనన, మరణాలపై అన్ని కోణాల్లో విచారించిన తర్వాత సర్కారు జారీ చేసే గెజిట్ సహాయంతో స్థానిక సంస్థ నుంచి అసలైన సర్టిఫికెట్ పొందవచ్చు. అయితే నామమాత్రపు వివరాలు ఇచ్చినా వేలాది రూపాయలు లంచాలు తీసుకుని సర్కిల్ స్థాయిల్లో నాన్ అవెలబిలిటీ సర్టిఫికెట్లు జారీ చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

31వేల సర్టిఫికెట్లు రద్దు

జీహెచ్ఎంసీ అధికారుల నిర్లక్ష్యంతో జారీచేసిన సర్టిఫికెట్లు సరైనవని కావని బహిర్గతమవడంతో 31వేల జనన, మరణ ధ్రువ పత్రాలను రద్దు చేశారు. జనవరి 2020 నుంచి 2022 డిసెంబర్ మధ్య 31వేల సర్టిఫికెట్లను జారీచేశారు. వీటిలో సుమారు 27వేల సర్టిఫికెట్లు ఫేక్ ఉన్నాయని, మరో 4వేల సర్టిఫికెట్లను నిబంధనల ప్రకారమే జారీచేసినట్టు ప్రచారం జరుగుతుంది. అధికారులు రద్దు చేయడంతో నిబంధనల ప్రకారం సర్టిఫికెట్లు తీసుకున్నవారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో జీహెచ్ఎంసీ జారీచేసిన బర్త్ సర్టిఫికెట్‌తో ఇప్పటికే విదేశాలకెళ్లినవారి గోస వర్ణనాతీతం. చాలా మంది నగరంలో ఇండ్లలో పుట్టిన వారు సైతం విదేశాలకు వెళ్లాల్సి వస్తే తప్పా బర్త్ సర్టిఫికెట్లు తీసుకోకపోవడంతోపాటు ఏడాది తర్వాత కూడ మరింత కొంత మంది తీసుకోవడంలేదు.

విజిలెన్స్ విచారణ

గ్రేటర్‌లోని 31వేల జనన, మరణ ధ్రువపత్రాలను జీహెచ్ఎంసీ రద్దు చేయడంపై విజిలెన్స్ విచారణకు కమిషనర్ లోకేష్ కుమార్ ఆదేశాలు జారీచేశారు. ఈ బాధ్యతలను జీహెచ్ఎంసీ ఈవీడీఎం డైరెక్టర్ ఎన్.ప్రకాశ్‌రెడ్డికి అప్పగించారు. విచారణ అనంతరం సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటారా? లేదా? చూడాల్సిందే.

కన్నుల పండుగగా హెూలీ వేడుకలు



నవతెలంగాణ-నాగోల్

నాగోల్ డివిజన్‌లో హెూలీ పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం హెూలీ వేడుకలను డివిజన్ ప్రజలు కన్నుల పండుగగా ఘనంగా నిర్వహించుకున్నారు. హెూలీ సందర్భంగా సోమవారం రాత్రి డివిజన్‌లోని వివిధ కాలనీలలోని ప్రధాన కూడళ్లలో కాలనీవాసులు కాముడి దహనాన్ని నిర్వహించారు. మంగళవారం నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ నాథ్ యాదవులు కాలనీవాసులు , జీహెచ్ఎంసి సిబ్బందితో కలిసి హెూలీ వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఒకరిపై ఒక రంగులను చల్లుకుంటూ హెూలీ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. కార్పొరేటర్ అరుణ సురేందర్ నాథ్ యాదవ్ మాట్లాడుతూ అన్ని రంగులు కలిసి అందమైన హరివిల్లు విరిసినట్టు సమాజంలో అన్ని వర్గాలు కలిస్తేనే అందమైన సమాజ నిర్మాణవుతుందని తెలియజేసే గొప్ప పండు గే ఈ హెూలీ పండుగ అని అన్నారు . ఈ రంగుల పండగ మీ జీవితాన్ని సప్తవర్ణ శోభితం చేయాలని ఆకాంక్షిస్తూ నాగోల్ డివిజన్ ప్రజలకు హెూలీ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు.

మానసిక దివ్యాంగుల మధ్య హెూలీ సంబరాలు

నవతెలంగాణ-బడంగ్‌పేట్



బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్‌గుల్ గ్రామంలో మాతదేవోభవ అనాథ ఆశ్రమంలో 112 మంది మతిస్థిమితం సరిగ్గా లేని అనాథ, మానసిక దివ్యాంగులతో మంగళవారం ఘనంగా హెూలీ వేడుకలను ఆశ్రమ వ్యవస్థాపకులు గట్టు గిరి కుటుంబ సభ్యులు, ఆశ్రమ సిబ్బంది జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి పండగలు కూడా జరుపుకోలేని అనాథల ముఖంలో ఆనందం చూడడం తాము ఎంతో అదష్టంగా భావిస్తున్నామని తెలిపారు. ఆశ్రమంలో ఒకరికొకరు రంగులు పూసుకుని చాలా సంతోషంగా హెూలి సంబరాలు జరుపుకోవటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ వ్యవస్థాపకులు గట్టు గిరి, కుటుంబ సభ్యులతో పాటు ఆశ్రమ సిబ్బంది తదతరులు పాల్గొన్నారు.

ప్రేమ ఆప్యాయతలు తెలిపే పండుగ హెూలీ



- కార్పొరేటర్ కొత్త కాపు అరుణ రవీందర్ రెడ్డి

నవతెలంగాణ-సంతోష్‌నగర్

ప్రేమ ఆప్యాయతలు తెలిపే పండగ హెూలీ అని కార్పొరేటర్ కొత్త కాపు అరుణ రవీందర్ రెడ్డి తెలిపారు. మంగళవారం సైదాబాద్ డివిజన్ పరిధిలోని ఆమె నివాసం వద్ద కార్పొరేటర్ ఆధ్వర్యంలో హెూలీ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ఒకరికి ఒకరు రంగులు పూసుకుంటు, వివిధ రంగులను చల్లుతూ.. హెూలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ రంగుల వసంతోత్సవాన్ని రాష్ట్ర ప్రజలంతా ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కోరుకుంటూ..రాష్ట్ర ప్రజలందరికీ హెూలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్పొరేటర్ మాట్లాడుతూ... సంతోషం, ఔన్నత్యం, ఉల్లాసం, ఆనందాల పండుగ ప్రతీ ఒక్కరి జీవితంలో కొత్త ఉత్సాహాన్ని , కొత్త శక్తిని సుఖ సంతోషాలు, శాంతి సౌఖ్యాలు నింపాలని, ఆనందకరమైన, సురక్షితమైన, రంగులతో హెూలీ జరుపు కోవాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని, అన్ని పండుగలను ఘనంగా జరుపుకుంటున్నామన్నారు. ప్రతీ పండుగను ఆనందో త్సాహాల మధ్య సుఖ సంతోషాలతో జరుపుకుంటున్నారని అన్నారు. పిల్లలు హెూలీ ఆడేటప్పుడు తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రసాయనాలతో కూడిన హానికరమైన రంగులతో కాకుండా సాధారణమైన సహజసిద్ధమైన రంగులు, నీటితోనే పండుగను నిర్వహించుకోవాలని సూచించారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సభ్యులు, యువకులు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు

పట్టుదల ఉంటే ఉద్యోగం సాధించొచ్చు

- డీసీపీ సాయి శ్రీ

నవతెలంగాణ-హయత్‌నగర్



ప్రస్తుత సమాజంలో మహిళలు ఉన్నత స్థాయి లో ఉండాలి అంటే పెళ్లి అయిన కూడా పట్టుదలతో, కుటుంబ సభ్యుల సహకారంతో ఉద్యోగం పొందొచ్చు అని ఎల్బీనగర్ జోన్ డీసీపీ సాయి శ్రీ సూచించారు. ఆమె మహిళా దినోత్సవం సందర్భంగా నవతెలంగాణతో మాట్లాడారు. 'నేను డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదివే రోజుల్లో నాకు పెండ్లి సంబంధాలు వచ్చాయి. మా తల్లిదండ్రులు, అత్త మామ ల స్వస్థలం హైదరాబాద్ కావడం నాకు కలిసొచ్చిన అంశం. నా భర్త అయిన శేఖర్ సాఫ్ట్ వేర్ ఉద్యోగి. మాకు ఇద్దరు ఆడ పిల్లలు. మా మామయ్య ఐఏఎస్ కావాలనే కోరికతో ఏ పీపీఎస్‌సీ పరీక్షలు రాయగా 2010లో ప్రభుత్వ ఉద్యోగం సాధించి డీఎస్పీగా మొదటి పోస్ట్ కాకినాడలో చేశాను. సమాజంలో ప్రతీ చోట మంచి వాళ్ళు, చెడ్డ వాళ్లు ఉంటారు. నేను ఉద్యోగ రీత్యా సమాజంలో ప్రజలకు, కుటుంబంలో పిల్లలకు తల్లిగా కూడా అదే స్థాయిలో న్యాయం చేయడానికి ప్రయత్నం చేస్తాను. పిల్లలను మంచి సత్ప్రవర్తనతో ఉంచకపోతే ఈ స్థాయిలో ఉన్నా కూడా సమాజంలో ఓడినట్టే. 2020లో ఎస్పీగా పదోన్నతి రావడంతో ఇంటెలిజెన్స్ విభాగంలో పనిచేశారు. ప్రస్తుతం రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఉన్న ఎల్బీనగర్ జోన్ డీసీపీ గా పనిచేస్తున్నారు.



కాలనీవాసులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యల



- మలక్ పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల

నవతెలంగాణ-సంతోష్‌నగర్

కాలనీవాసులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని మలక్ పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. ఎమ్మెల్యే బలాల అధికారులతో కలిసి మూసారం బాగ్ డివిజన్ సాయినగర్ కాలనీలో పర్యటించారు. కాలనీలో తిరిగి డ్రయినేజీ, మ్యాన్ హెూల్స్, రోడ్డు, నాలా, సమస్యలు పరిశీలించారు. స్థానిక పోచమ్మ టెంపుల్ కుడి వైపు నుంచి మూసారంబాగ్ నాలావైపు రోడ్డు నిర్మాణం వలన తలెత్తిన సమస్యను ఎమ్మెల్యేకు వివరించారు. టెంపుల్ ఎదురుగా ఇటీవల నిర్మించిన సీసీ రోడ్డుకు సమాంతరంగా నాలావైపు రోడ్డు నిర్మిస్తే వరదనీరు ఇండ్లలోకి వచ్చి చేరుతుందని ఎమ్మెల్యేకు చెప్పారు. కాలనీ వాసులకు ఎవరికీ ఇబ్బంది తలెత్తకుండా రోడ్డు నిర్మాణం చేపట్టాలని జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. కొత్త పనులకు ప్రతిపాదనలు తయారు చేసి, వీలైనంతమేరకు అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. పర్యటనలో డీఈఈ ప్రదీప్ కుమార్. జలమండలి డీజీఎం షీలారాణి, ఏరియా మేనేజర్ చంద్రు నాయక్, విద్యుత్ శాఖ ఏఈ ప్రీతి, ఎండీ అస్లాం, ఇలీయాస్, బాబా, నరేష్, రజాక్, అమిత్, దౌలతా ఖాన్, పాల్గొన్నారు.

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా న్యాయ విజ్ఞాన సదస్సు

నవతెలంగాణ-సిటీబ్యూరో



నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, న్యూ ఢిల్లీ, తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, హైదరాబాద్, నేషనల్ కమిషన్ ఫర్ విమెన్ ఆదేశాల మేరకు 04-03-2023 నుండి 11-03-2023 వరకు అంతర్జాతీయ మహిళా వారోత్సవాల సందర్భంగా, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా న్యాయ విజ్ఞాన సదస్సు శివ శివాని డిగ్రీ కళాశాల, కొంపల్లి లో నిర్వహించారు. ఈ కార్యక్రమం లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి శంకర్ శ్రీదేవి అధ్యక్షత వహించి మహిళా చట్టాల గురించి, ఉచిత న్యాయ సహాయము గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ న్యాయ విజ్ఞాన సదస్సు లో 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి దిలీప్ కుమార్ నాయక్ పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి వివిధ చట్టాల గురించి అవగాహన కలిగించారు. సుమారుగా 600 విద్యారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేయడం అప్రజాస్వామికం


- మేయర్ పారిజాత నర్సింహా రెడ్డి

నవతెలంగాణ-బడంగ్‌పేట్



ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులను అక్రమంగా అరెస్టు చేయటం అప్రజాస్వామికమని మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు.మంగళవారం ఎల్బీనగర్ నియోజకవర్గంలోని ఫ్లైఓవర్ వెంటనే ప్రారంభించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ధర్నా కార్యక్రమం చేపట్టడం జరిగిందని ఈ ధర్నా కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకొని అక్రమంగా అరెస్ట్ చేసి బాలాపూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించడం ఏమిటని ప్రశ్నించారు. బాలాపూర్ పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకుని కాంగ్రెస్ కార్యకర్తలను మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చిగిరింత నర్సింహా రెడ్డిలు పరామర్శించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులను ప్రభుత్వం పోలీసులతో అక్రమంగా అరెస్టులు, దాడులు చేయించి భయ భ్రాంతులకు గురిచేస్తున్నదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో బడంగ్ పేట్ కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్ రెడ్డి,నాయకులు చింతపట్ల ప్రవీణ్, వరికుప్పల మహేష్ తదితరులు ఉన్నారు.

మహిళా కడుపులో నుంచి మూడు కేజీల కణితి తొలగింపు



నవతెలంగాణ-బడంగ్ పేట్

బాలాపూర్ లోని చవాన్ హాస్పిటల్ వారు అరుదైన చికిత్స నిర్వహించారు. కడుపులో నుంచి దాదాపు మూడు కేజీల కణితిని తొలగించి మహిళకు ప్రాణం పోశారు చవాన్ హాస్పిటల్ సిబ్బంది. క్యాన్సర్ వేస్తే భయపడాల్సిన అవసరం లేదదని డా.ఉదయ్ చౌహాన్ ఈ సందర్భంగా తెలిపారు. కడుపు ఉబ్బి, నొప్పితో బాధపడుతున్న 46 సంవత్సరాల జ్యోతిబాయ్ అనే మహిళకు బాలాపూర్ చావాన్ ఆస్పత్రి డాక్టర్ ఉదయ్ చౌహన్, డాక్టర్ భాగ్యలక్ష్మి, డాక్టర్ శంకర్ ఆనంద్ వారి బందం ఎంతో శ్రమించి అరుదైన శస్త్ర చికిత్స చేసి మహిళ కడుపులో నుండి దాదాపు మూడు కేజీల కణితిని తొలగించి మహిళకు ప్రాణం పోశారు. మంగళవారం డాక్టర్ ఉదయ్ చౌహాన్ మాట్లాడుతూ జ్యోతిబాయ్ లాంటి రోగులు ఎలాంటి భయాందోళన గురికాకుండా తమ ఆస్పత్రిని సందర్శించి పూర్తి ఆరోగ్యంతో తిరిగి ఇంటికి వెళ్తారని తెలిపారు. ఆస్పత్రిలో క్యాన్సర్‌కు సంబంధించి ప్రత్యేకంగా వైద్య బందం ఉండడంతో ఇతర రాష్ట్రాల నుంచి ఎంతో మంది క్యాన్సర్ రోగులు తమ ఆస్పత్రికి వచ్చి పూర్తి ఆరోగ్యంతో తిరిగి ఇంటికి వెళ్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. బాలాపూర్ చవాన్ ఆస్పత్రిలో 24 గంటల ఎమర్జెన్సీ సర్వీసులు, ఐసీయూ, డెంటల్ కేర్, క్యాన్సర్ వంటి రోగులకు ప్రత్యేక వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

మహిళలు స్వతహాగా వారి కాళ్లపై నిలబడాలి

- సరూర్ నగర్ మండల తహసీల్దార్ జయశ్రీ

నవతెలంగాణ-సరూర్‌నగర్

పట్టుదల ఉంటే ఏ పని అయినా సాధ్యమవుతుందని, మహిళలు స్వతహాగా వారి కాళ్లపై నిలబడి ధైర్యం తెచ్చుకొని జీవితంలో ముందుకు పోవాలని సరూర్ నగర్ మండల తహసీల్దార్ జయశ్రీ తెలిపారు. మహిళా దినోత్సవ సందర్భంగా నవ తెలంగాణతో జయశ్రీ మాట్లాడుతూ 'నేటి మహిళ అన్ని రంగాల్లో రాణిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తుంది. గతంతో పోలిస్తే మహిళల్లో చదువుకునే వారి సంఖ్య బాగా పెరిగింది. ఉద్యోగరీత్యా సమాజంలోని ప్రజలకు కుటుంబంలో పిల్లలకు తల్లిగా కూడా అదే స్థాయిలో న్యాయం చేయడానికి ప్రయత్నిస్తూ ఉంటాను. ప్రజా ప్రతినిధులుగా ఉద్యోగులుగా సమర్థవంతంగా మహిళలు విధులు నిర్వహిస్తున్నారు. అంది వచ్చిన ప్రతీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ తమ ప్రత్యేకతను చాటుతున్నారు. కుటుంబ ఆర్థిక విషయాలను మహిళలు సమర్థవంతంగా మేనేజ్ చేసినంత మరెవరు చేయలేరు. నా వంతు సేవలు, వత్తి ధర్మాన్ని సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నాను' అన్నారు.


'నూతన రోడ్లతో తీరనున్న శ్రీరాం కాలనీ ప్రజల కష్టాలు'

నవతెలంగాణ-బడంగ్‌పేట్



జల్ పల్లి మున్సిపల్ లోని శ్రీరాం కాలనీలో రాష్ట్ర విద్యా శాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి సహకారంతో రూ.1కోటి 50లక్షల నిధులతో నూతనంగా వేసిన సీసీ రోడ్లు, బీటీ రోడ్లుతో ప్రజల కష్టాలు తీరుతాయని 19,20 వార్డుల కౌన్సిలర్లు పల్లపు శంకర్,భాషమ్మలు అన్నారు.మంగళవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను వారు పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం నిరంతరం ఎంతో కషి చేస్తున్నదని తెలిపారు. జల్ పల్లి మున్సిపల్ అభివృద్ధికి మంత్రి కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేయటం జరిగిందన్నారు. గతంలో ప్రజలకు మౌలిక సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని మంత్రి ప్రత్యేక నిధులు కేటాయించి రోడ్లు, డ్రయినేజీలు, విద్యుత్ దీపాలు, మిషన్ భగీరథ పథకంలో తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మారుతి,కాలనీ వాసులు ఉన్నారు.

పిల్లలకు నైతిక విలువలు బోధించాలి



- సరూర్ నగర్ మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మంజుల

నవతెలంగాణ-సరూర్‌నగర్

'పోలీసు ఉద్యోగం అనేది కత్తి మీద సాము లాంటిది. సహజంగానే ఈ విభాగంలో పురుషాధిపత్యం. రాజకీయ ఒత్తిడి కూడా ఎక్కువే. 24 గంటలు అలెర్ట్ గా ఉండాల్సిందే. అనేక సవాళ్ల మధ్య పని చేయాల్సి వస్తుంది. అయినప్పటికీ టెన్షన్ పడకుండా అన్నింటినీ ధైర్యంగా ఎదుర్కొంటున్నా. మహిళలు అటు వ్యక్తిగత జీవితానికి ఇటు విధులకు న్యాయం చేసే విధంగా అహర్నిశలు శ్రమిస్తున్నారు. కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో కష్టపడి చదువుకున్న. లైంగికదాడులు పూర్తిగా తగ్గిపోవాలంటే ముందు తమ పిల్లలకు నైతిక విలువలు బోధించాలి. క్రమశిక్షణ.. అది ఇంటి నుంచే మొదలు కావాలి' అని ఇన్‌స్పెక్టర్ మంజుల అన్నారు.



మహేశ్వరం నియోజకవర్గం అర్కేపురం డివిజన్‌లో హెూలీ పండుగ సందర్భంగా రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక మధుర ఉపేందర్ రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలియజేసి, కృతిమ రంగులతో హెూలీ ఆడిన యువజన కాంగ్రెస్ నాయకులు, వాసవి కాలనీ నివాసులు తదితరులు.

నవతెలంగాణ-సరూర్‌నగర్

నేటి సమాజంలో మహిళలు ఆర్థికంగా ఎదగాలి

- హయత్‌నగర్ తహసీల్దార్ సంధ్యా రాణి

నవతెలంగాణ-హయత్‌నగర్



ప్రస్తుతం ఉన్న సమాజంలో మహిళలు చదువులో రాణించక పోయిన పర్వాలేదు కానీ ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి కృషి చేయాలని అప్పుడే మనకు తగిన గౌరవ మర్యాదలు దక్కుతాయని హయత్‌నగర్ తహసీల్దార్ సంధ్యా రాణి మహిళ దినోత్సవం సందర్భంగా నవతెలంగాణ తో వెల్లడించారు. ఆమె మాట్లాడుతూ తన భర్త పోలీసు అధికా రిగా ఉన్న సమయంలో 2002లో అకాల మరణం అనం తరం తనకు ఆ ఉద్యోగం వచ్చిందని, తన భర్త కుటుంబ సభ్యుల నుండి తనకు ఎలాంటి ప్రోత్సాహకం అందలేదని, తన తల్లిదండ్రుల సహకారంతో తన ఇద్దరూ పిల్లలు సైతం వ్యాపార రంగంలో రాణిస్తున్నారని తెలిపారు. సమాజంలో మహిళలు స్వతహాగా వారి కాళ్లపై నిలబడే ధైర్యం వచ్చినప్పుడే మనం అభివృద్ధి చెందిన ట్లు అనిపిస్తుందన్నారు.సమాజంలో చదువు,ఉద్యోగం రెండింటి లో ఏదో ఒక దానిలో తప్పని సరిగా మహిళలు రాణించి తీరాలని పిలుపునిచ్చారు.

సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవాలి

- బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గ మహిళ వర్కింగ్ ప్రెసిడెంట్ పటేల్ సునీత రెడ్డి


నవతెలంగాణ-సరూర్‌నగర్



ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని పురుషులకు సమానంగా ఏమాత్రం తీసిపోబోమని నిరూపిస్తున్నారు అని బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గ మహిళ వర్కింగ్ ప్రెసిడెంట్ పటేల్ సునీత రెడ్డి అన్నారు. మహిళా దినోత్సవ సందర్భంగా నవ తెలంగాణతో వారు మాట్లాడుతూ 'మహిళలు ఇప్పుడిప్పుడే ఇంటి గడప దాటి తమ నైపుణ్యాన్ని వెలికితీస్తున్నారు. మహిళలను ప్రోత్సహిం చకపోయిన పర్వాలేదు కానీ వ్యక్తిత్వాన్ని దెబ్బతీసే విధంగా కించపరచవద్దు. పురుషులతో పోలిస్తే మహిళలకు ఓర్పు, సహనం ఎక్కువ. ఎలాంటి క్లిష్ట పరిస్థితులైన ధైర్యంగా ముందుకు సాగుతుంది. నేటి మహిళ అన్ని రంగాల్లో రాణిస్తుంది. చివరకు భారత సైన్యంలో కూడా మహిళ తన సత్తా చాటుతుంది. రాబోయే రోజుల్లో ప్రభుత్వ ఉద్యోగమైన ప్రయివేటు ఉద్యోగంలోనైనా సగభాగము మహిళలే చోటు సంపాదించుకుంటారు. రాజకీయ రంగంలోనూ కూడా మహిళలు రాణిస్తున్నారు' అని అన్నారు.

మహిళా సాధికారతకు స్ఫూర్తి అంతర్జాతీయ మహిళా దినోత్సవం

నవతెలంగాణ-నాగోల్



మహిళలు ఆకాశంలో సగం, అవని లో సగం, అన్నింట సగం. అటువంటి మహిళా లోకం శక్తికి ప్రత్యేకగా నిర్వహించే పండగ, మహిళలంతా సంతోషంగా జరుపుకునే వేడుక, మహిళల సాధికారిక దిశగా నడిపించడం కోసం నిర్వహించే సంబరమే అంతర్జాతీయ మహిళా దినోత్సవం. ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకలు సంబరాలు అంగరంగ వైభవంగా జరుపుకుంటున్నాం. విధిరాతను ఎదిరించి ఆత్మ గౌరవాన్ని ప్రత్యేకంగా నిలుస్తూ ఎందరో నారీమణులు చరిత్ర లో తమకంటూ ఓ స్థానాన్ని సాధించుకుంటున్నారు. అయితే మహిళల స్థితిగతులు బాగుపడనిదే సమాజం అభివృద్ధి చెందదు. సమాజ నిర్మాణంలో సగభాగమైన స్త్రీ సమానత్వమే మన ప్రగతికి మూలం ఇదే నినాదంతో ఐక్యరాజ్యసమితి ప్రతి ఏటా మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహిస్తున్నది. సమాజంలో మహిళలు ఆత్మగౌరవంతో స్వశక్తితో తమ ఆర్థిక అవసరాలు తామే తీర్చుకోగలిగే జీవనాధార అవకాశాలు స్వయంగా నిర్మించుకోగలిగి ఉన్నత స్థితికి చేరుకుని స్త్రీ శక్తి ఎంతో ప్రపంచానికి తెలియజేస్తు నే ఉన్నారు. వైద్యం ,విద్య ,వ్యాపారాలు ,రాజకీయాలు ,క్రీడలు, బ్యాంకింగ్, అంతరిక్ష, టెక్నాలజీ వంటి పలు రంగాలలో మహిళలు రాణిస్తూ మహిళా సాధికారిక సాధన దిశగా అడుగులు వేస్తున్నారు. మానవ వనరుల సంపూర్ణ వినియోగంలో వీరి పాత్ర కూడా కీలకం. రంగం ఏదైనా ఉన్న ఉన్నత శిఖరాలను చేరుకొని పురుష శక్తికి తామేమి తీసిపోమని చాటి చెబుతోంది స్త్రీ శక్తి . తాము కేవలం ఇంటికే పరిమితం కాదంటూ పురుషులకు దీటుగా విజయాలు సాధిస్తున్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం పండగ భారతదేశంలోని మహిళలకు కాస్తంత చేదు అనుభవాలనే మిగిలిస్తుందనే చెప్పవచ్చు. ఎక్కడ చూసినా స్త్రీ శక్తి వంచనకు గురవుతూనే ఉంది. సభ్య సమాజ చైతన్యాన్ని, సామాజిక బాధ్యతను సవాలు చేస్తూ సాగిపోతున్న మహిళలపై దారుణ అఘాయిత్యాలకు అంతులేకుండా పోయింది. వీటిని నియంత్రించేందుకు ఎంతటి కఠినమైన చట్టాలను తీసుకువచ్చిన నిర్వీర్యమవుతున్నాయి. ఇందుకు గల కారణాలను గుర్తించి అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ అవరోధాలను అధికమిస్తూ అడుగు ముందుకు వేయాలి.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం మొట్టమొదటిగా కార్మిక ఉద్యమం నుంచి పుట్టుకొచ్చింది. 1908లో తక్కువ పనిగంటలు, మెరుగైన వేతనం, ఓటు వేసే హక్కు కోసం న్యూయార్క్ సిటీలో 15000 మంది మహిళలు ప్రదర్శన చేయగా ఈ మహిళా డిమాండ్లను దృష్టిలో పెట్టుకుని అమెరికాలోని సోషలిస్టు పార్టీ 1909వ సంవత్సరంలో జాతీయ మహిళా దినోత్సవంగా ప్రకటించినట్టు చరిత్ర ద్వారా తెలుస్తుంది. ఈ దినోత్సవం అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించాలని 1910లో కొపెన్ హెగెన్ నగరంలో జరిగిన ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆఫ్ వర్కింగ్ ఉమెన్ సదస్సులో కార్లా జెట్కిన్ అనే ఒక మహిళ ప్రతిపాదించగా ఈ సదస్సులో పాల్గొన్న 17 దేశాల నుంచి వచ్చిన 100 మంది మహిళలు కార్లా జెట్కిన్ ప్రతిపాదనను ఏక గ్రీవంగా అంగీకరించినట్టు తెలుస్తోంది. దాంతో 1911లో మొదటిసారిగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకున్నారు.1913 అంతర్జాతీయ మహిళా దినోత్సవం మార్చి 8కి మార్చి ప్రతి సంవత్సరం అదే రోజున నిర్వహిస్తారు. మహిళా దినోత్సవాన్ని పర్పుల్, గ్రీన్ , వైట్ రంగులతో రిప్రజెంట్ చేస్తారు.

చిన్నా,పెద్ద తారతమ్యం లేకుండా ఆడేది హెూలీ



నవతెలంగాణ-సంతోష్ నగర్

చిన్న పెద్ద తేడా లేకుండా ఆడేది హెూలీ పండుగ అని యాకుత్ పురా నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి సామ సుందర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఐ ఎస్ సదన్ డివిజన్ పరిధిలోని కుటుంబ సభ్యులతో కలిసి హెూలీ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు హెూలీ శుభాకాంక్షలు తెలిపారు. హెూలీ పండుగలు తెలంగాణ సంస్కతిని చాటి చెబుతాయన్నారు. చిన్న, పెద్ద తేడా లేకుండా అన్ని వయసుల వారు ఎంతో సంతోషంగా హెూలీ జరుపుకోవడం అనాదిగా వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సభ్యులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

బడంగ్‌పేట్‌లో ఘనంగా హెూలీ సంబరాలు



నవతెలంగాణ-బడంగ్‌పేట్

బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న వివిధ డివిజన్లలో కాలనీల్లో కుల,మతాలకు అతీతంగా చిన్న,పెద్ద అనే తేడా లేకుండా అందరూ కలిసి మెలసి ఘనంగా హెూలీ పండుగ సంబరాలు జరుపుకున్నారు. కార్పొరేటర్ నిమ్మల సునీత శ్రీకాంత్ గౌడ్, బీజేవైఎం అధ్యక్షులు రాళ్ల గూడెం రామకష్ణారెడ్డిల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా హెూలీ సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో నాదర్‌గుల్ సహకార బ్యాంక్ డైరెక్టర్ తోట ప్రతాపరెడ్డి, ఏనుగు మోహన్ రెడ్డి నాయకులు నిమ్మల రవికాంత్ గౌడ్, జెనిగ నర్సింగ్ యాదవ్, మహేందర్, గడ్డం శ్రీకాంత్‌రెడ్డి, తోట అరేందర్ రెడ్డి, సంతోష్ రెడ్డి ధన్పాల్ రెడ్డి, కష్ణ గౌడ్, రఘునందన్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్కే పురం లోని హెూలీ సంబరాలు ఘనంగా జరిగాయి. చిన్నారులు, పెద్దలు హెూలీ వేడుకలు జరుపుకున్నారు.
(నవతెలంగాణ - సరూర్ నగర్)

మహిళలు సమాజ సేవ చేయడంలో ముందుండాలి



- వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రాగిరి హారిక

నవతెలంగాణ-కంటోన్మెంట్

మహిళలు సమాజ సేవ చేయడంలో ముందు ఉండాలని బోయిన్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రాగిరి హారిక ఆనంద్ గౌడ్ అన్నారు మహిళా దినోత్సవ సందర్భంగా నవ తెలంగాణతో వారు మాట్లాడుతూ.. ఒకప్పుడు మహిళలు ఇంటికి పరిమితమై ఉండేవాళ్లని మారుత "న్న రోజులతో మహిళలు కూడా మారాలని పిలుపునిచ్చారు. ఇంటికే పరిమితం కాకుండా సమాజ సేవ కోసం కూడా ముందుకు రావాలని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చినప్పటి నుండి మహిళలకు కూడా అన్ని రంగాల్లో ప్రాధాన్యత లభిస్తుందని చెప్పారు బోయిన్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మొదటి చైర్‌పర్సన్‌గా తాను ఉండటం తనకి ఎంతో గర్వకారంగా ఉందని అన్నారు. సమాజసేవ ద్వారా అనుభవం సంపాదించి అన్ని రంగాలలో అవగాహన పెంపొందించుకోవచ్చని ఆమె పేర్కొన్నారు. అలాగే భర్తలు కూడా వారి భార్యలు సమాజ సేవ చేసేందుకు ప్రోత్సాహించాలని చెప్పారు. తన భర్త ఆనంద్ గౌడ్ ప్రోత్సాహం వల్లే చైర్ పర్సన్

మల్లాపూర్‌లో డ్రయినేజీ మురుగు.. రోడ్లపై పరుగు



నవతెలంగాణ-నాచారం

మల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఈద్గా రోడ్డు చాణిక్యపురి కాలనీలోని డ్రయినేజీ పొంగిపొర్లుతున్నది. మల్లాపూర్‌లో డ్రయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని బ్యాంకు కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు సుర్గం రాజేష్ పేర్కొన్నారు. వాటర్, డ్రయినేజీ వ్యవస్థ ఒకటి కావడంతో నిత్యం డ్రయినేజీ పొంగిపొర్లుతున్నా వాటర్ వర్క్స్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. గతంలో జిహెచ్ఎంసి సిబ్బంది పర్యవేక్షణలో భూగర్భ డ్రయినేజీ పొంగినా మ్యాన్ హెూల్ మూతలు పగిలిపోయిన, మురుగు పరుగు పెడుతున్న పట్టించుకునేవారు. ప్రస్తుతం మెట్రో వాటర్ వర్క్స్ ఆధీనంలో డ్రయినేజీ మ్యాన్ హెూల్స్ శుభ్రం చేసే పని అప్పగించిన తర్వాత నిత్య కత్యంగా డ్రయినేజీ రోడ్లపై పొంగిపొర్లుతున్న పట్టించుకునే నాధుడే లేడు. రోజుల తరబడి రోడ్లపై మురుగునీరు ప్రవహిస్తున్న కన్నెత్తి కూడా చూడని వాటర్ వర్క్స్ అధికారులు సిబ్బంది ఏం చేస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మురుగులో నడుచుకుంటూ వెళ్లవలసిన దుస్థితి ఎదురవుతుందని వారు చెబుతున్నారు. అధికారులకు, స్థానిక కార్పొరేటర్ కు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పెడచెవున పెడుతున్నారే తప్ప సమస్యను పరిష్కరించడంలో విఫలం అవుతున్నారని మండిపడ్డారు. మల్లాపూర్‌లో డ్రయినేజీ సమస్య సర్వసాధారణంగా మారింది. స్థానిక ప్రజలు మురుగులో మరిగిపోతున్నారు. ఏ కాలనీకి వెళ్లిన డ్రయినేజీ మురుగు దర్శనమిస్తుంది. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ అధికారులు స్పందించి డ్రయినేజీ మురుగు సమస్యను నియంత్రించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం నిర్వహించిన విద్యావతి పాండు యాదవులు

- బహుమతులు అందజేసిన బీఆర్ఎస్ మల్కాజ్ గిరి పార్లమెంటు ఇన్‌చార్జి



నవతెలంగాణ-కంటోన్మెంట్

అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం బోర్డు మాజీ సభ్యుడు పాండు యాదవ్ ఆయన సతీమణి విద్యావతి మల్లారెడ్డి గార్డెన్‌లో ఘనంగా వేడుకలు నిర్వహించారు మహిళలకు క్రీడల పోటీలను నిర్వహించారు. మ్యూజికల్ చైర్ స్పూన్ అండ్ లెమన్ రోప్, బెలూన్స్ బాల్ త్రోయింగ్ లాంటి ఆటలను ఆడించారు. విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమానికి బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి రాజశేఖర్ రెడ్డి, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి ముఖ్యఅతిగా పాల్గొన్నారు.

మహిళలకు క్రీడలు నిర్వహించిన శ్రీ గణేష్



నవతెలంగాణ కంటోన్మెంట్

తిరుమలగిరి లాల్ బజార్‌లో మహిళా దినోత్స వాన్ని పరిష్కరిం చుకొని మంగళవారం బీఆర్ఎస్ ఏడో వార్డు నాయ కురాలు వినీత ఆధ్వర్యంలో శ్రీ గణేష్ ఫౌండేషన్ చైర్మెన్ మహిళ లకు క్రీడలు నిర్వహించారు. అనంతరం విజేతలకు శ్రీ గణేష్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగంలో ముందుకు రావాలని కోరారు ముఖ్యంగా ఆర్థికంగా నిలదొక్కుని స్వశక్తి పైకి రావాలని ఆయన చెప్పారు. కార్యక్రమంలో జయశీలం, వినీత, నీత గ్లోరీ, పలువురు మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు

ప్రజా సేవలో ఎనలేని సంతృప్తి ఉంది

- నేరేడ్ మెట్ కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్ రెడ్డి



నవతెలంగాణ-నేరేడ్ మెట్

ఒకప్పుడు నేను సాధారణ గహిణిని రాజకీయాలు తెలియదు...రాజకీయ కుటుంబం కాదు. రాజకీయాలలో మహిళలకు ప్రాధాన్యత నివ్వాలనే మంచి ఉద్దేశంతో సీఎం కేసీఆర్ నాకు జీహెచ్ఎంసీ ఎన్నికలలో తొలిసారిగా పోటీ చేసే అవకాశం కల్పించారు. మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు సహకారం, నా భర్త ప్రొత్సహంతో నేరేడ్ మెట్ డివిజన్ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థినిగా పోటీ చేశాను. డివిజన్ ప్రజలు ఆశీర్వదించడంతో కార్పొరేటర్ గా గెలిచి, డివిజన్ అభివద్ధికి కషి చేస్తున్నాను. నేను గెలుపొందడానికి, డివిజన్ సమగ్రాభివద్ధికి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అందిస్తున్న సహకారం, నా భర్త కషి ఎంతో ఉంది. అదే విధంగా అధికారులు, డివిజన్ ప్రజలు , బీఆర్ ఎస్ కుటుంబ సభ్యులు సహకారంతో మరింత క్రియాశీలకంగా పని చేస్తున్నాను. మహిళ గా డివిజన్ ప్రజలకు సేవలందించడంలో చాలా సంతోషంగా ఉంది. మహిళలు రాజకీయ రంగంలో రాణించగలరనడానికి నేను చక్కని ఉదాహరణ. నేటి యువతులు రాజకీయాలలో మరింత ముందుకు రావాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. పురుషులకు ధీటుగా మహిళలు ధైర్యంగా ముందుకు సాగాలి. లింగ వివక్షను ఎదిరించాలి. సమాజానికి మార్గ దర్శనం చేసేదిగా మహిళగా ఎదగాలి. మహిళలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అన్నింటా రాణించాలి. స్త్రీ లేకుంటే సష్టి లేదు.. ప్రతి ఒక్కరూ ఇది గుర్తించాలి. స్త్రీలను గౌరవించాలి, పూజించాలి. అప్పుడే మహిళా స్థితి గతులు మారాతాయి. మహిళల పట్ల ఆలోచన ధోరణిలో మార్పు రావాలి. సమ సమాజ నిర్మాణంలో మహిళలు చురుకైన పాత్ర పోషించాలి. అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

కష్టపడిన ప్రతీ ఒక్కరికి గుర్తింపు వస్తుంది



కష్టపడిన ప్రతీ ఒక్కరికి గుర్తింపు వస్తుంది. పేదరికంలో పుట్టడం మన తప్పు కాదు పేదరికం జయించి బాగా చదువుకొని మంచి లక్షల ఏర్పరచుకొని గొప్ప వ్యక్తులుగా ఎదగాలి. మహిళలు వంటింటికీ పరిమితం కాకుండా తమ అభిరుచులకు అనుగుణంగా పరుచుకోవాలి ప్రతీ మహిళ బాగా చదువుకొని ఆర్థికంగా సామాజికంగా రాజకీయంగా నిలదొక్కుకునే ప్రయత్నం చేయాలి నాలాగా నా పిల్లలు కష్టపడకూడదని భావించి మంచిగా చదివిపిస్తున్నాను వారు ప్రయోజకులుగా చూడలనుకుంటున్నాను.పంచాయతీ కార్యదర్శి గా ,ప్రత్యేక అధికారిగా రెండు సార్లు అవార్డ్ రావడం జరిగింది.

కీసర ఎంపీఓ మంగతయారు
నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

మహిళలకు సమాన అవకాశాలు ఇస్తేనే సమాజం అభివృద్ధి

- కార్పొరేటర్ సబితా అనిల్ కిశోర్ గౌడ్



నవతెలంగాణ- నేరేడ్ మెట్

అన్ని రంగాల్లో పురుషులకు ధీటుగా, మహిళలందరికీ సమాన అవకాశాలు కల్పించి వాళ్లను ప్రోత్స హించడం ద్వారానే సమాజం శరవేగంగా అభివద్ధి చెందుతుందని వెంకటాపురం డివిజన్ కార్పొరేటర్ సబితా అనిల్ కిశోర్ గౌడ్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని ఆమె మహిళలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మధ్య తరగతి కుటుంబానికి చెందిన వారమైనప్పటికి, తన భర్త కిశోర్ గౌడ్ సీనియర్ ం జకీయ నాయకుడు కావడంతో ఆయన చేసిన సేవలను గుర్తింపుగా మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు తనక కార్పొరేటర్ గా పోటీ చేసే అవకాశం కల్పించారన్నారు. మహిళలందరికీ సమాన అవకాశాలు కల్పించడం ద్వారానే వారికి సరైన న్యాయం చేయగలుగుతామని తెలిపారు. ప్రతీ ఒక్క మహిళ అధైర్య పడకుండా తన కాళ్ల మీద తాను నిలబడి అనుకున్న లక్ష్యాన్ని సాధించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని , కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్, ఒంటరి మహిళలు, కాన్పు సమయంలో మహిళల కోసం కేసీఆర్ కిట్, బీడీ కార్మికుల పింఛన్, డ్వాక్రా రుణాలు ఇలా మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ వారికి ఎల్లవేళలా అండగా నిలుస్తోందన్నారు. మహిళలందరూ వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని

ఫాతిమా స్కూల్ భవనాన్ని ప్రారంభించిన కార్పొరేటర్



నవతెలంగాణ-జవహర్‌నగర్

జవహర్ నగర్ లోని సెంట్ మేరీస్ కాలనీ, బాలాజీ నగర్ లో ఉన్న ఫాతిమా మాత పాఠశాల భవనం పై నిర్మించిన రెండవ అంతస్తు ను 22 వ డివిజన్ కార్పొరేటర్, హైదరాబాద్ అగ్ర పీఠాధిపతులు. హైదరాబాద్ ఆర్చ్ డైసిస్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మెన్ కార్డినల్ పూలా ఆంటోనీతో కలసి స్కూల్ భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సంస్థ వైస్ చైర్మెన్ బాలశౌరి ,ఫాదర్ పి .ఇన్నయ్య హాజరయ్యారు ఈ సందర్భంగా 22వ డివిజన్ కార్పొరేటర్ బింగి లావణ్య సతీష్ గౌడ్ మాట్లాడుతూ బాలాజీ నగర్‌లో నిర్మించిన పాఠశాల భవనం విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందజేస్తుందని ఆకాంక్షించారు. స్కూల్ ప్రిన్సిపల్ రెవరెండ్, ఫాదర్ మాదాను జోసఫ్‌ను అభినందిస్తూ విద్యారంగంలో చేస్తున్న వీరి సేవలను కొనియాడారు విద్య ఆవశ్యకతను తెలుపుతూ తల్లిదండ్రులు తమ బిడ్డలకు విద్యానందించి చైతన్యవంతులుగా చేయాలని పిలుపునిచ్చారు. సంస్థ వైస్ చైర్మెన్ సిగ్నూర్ బాలశౌరి ఫాతిమా మాత స్కూల్ అందించే నాణ్యమైన విద్యా ప్రమాణాలను అభినందిస్తూ ,స్కూల్ అందించే విద్యను ఉపయోగించుకోవాలని కోరారు. కార్పొరేటర్ లావణ్యను సంస్థ పెద్దలు వారి సేవలను ప్రశంసిస్తూ ప్రిన్సిపల్ రెవరెండ్ ఫాదర్ జోసఫ్, సంస్థ పెద్దలు ఫాతిమా స్కూల్ భవన నిర్మాణానికి ఆర్థిక, ఇతర వనరులను అందించినందుకు శాలువా తో సత్కరించి కతజ్ఞతలు తెలిపారు.స్కూల్లో సేవలు అందిస్తున్న అధ్యాపక ఉపాధ్యాయ బందాన్ని ప్రత్యేకంగా అభినందించారు ఈ కార్యక్రమానికి విద్యార్థులు వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

గోదావరి నీటికి 48 గంటలపాటు అంతరాయం

నవతెలంగాణ-సిటీబ్యూరో

రైల్వే శాఖ సిద్దిపేట జిల్లా కుకునూర్ పల్లి వద్ద నూతనంగా ట్రాక్ లైన్‌ను నిర్మిస్తున్న నేపథ్యంలో గోదావరి నీటికి అంతరాయం ఏర్పడింది. రైల్వే లైన్ నిర్మాణానికి ఆటంకం కలగకుండా హైదరాబాద్ మహానగరానికి తాగునీరు సరఫరా చేస్తున్న గోదావరి డ్రింకింగ్ వాటర్ సప్లై (జీడీడబ్ల్యూఎస్ఎస్) ఫేజ్ - 1 లో కొండపాక నుంచి ఘన్‌పూర్‌కు ఉన్న 3000 ఎంఎం డయా ఎంఎస్ మెయిన్ పైపు లైన్‌ను పక్కకు మార్చాల్సి వచ్చింది. ఈక్రమంలో గురువారం 9న ఉదయం 6 గంటల నుంచి 11న శనివారం ఉదయం 6 గంటల వరకు మొత్తం 48 గంటల పాటు ఈ పనులు జరుగనున్నాయి. దాంతో 48 గంటలపాటు పలు రిజర్వాయర్ పరిధిలోని ప్రాంతాల్లో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. 48గంటలపాటు తాగునీరు సరఫరా లేకపోవడంతో ప్రజలు నీటిని పొదుపుగా ఉపయోగించాలని జలమండలి ఎండీ దానకిషోర్ మంగళవారం కోరారు. అధికారుల సూచనలు పాటించి సహకరించాలని

మర్రి రాజశేఖర్ రెడ్డికి డైరీని అందజేసిన కురుమన్న



నవతెలంగాణ-నాచారం

బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ ఇంచార్జ్ మర్రి రాజశేఖర్ రెడ్డిని బీఆర్ఎస్‌కేవీ జీహెచ్ఎంసీ కాప్రా సర్కిల్ అధ్యక్షులు జి కురుమన్న కలిసి యూనియన్ డైరీ అందజేసి హెూలీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాప్రా సర్కిల్ పరిధిలోని పారిశుధ్య కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి దష్టికి తీసుకువెళ్లేందుకు సహకరించాలని కోరారు. మర్రి రాజశేఖర్ రెడ్డి కార్మికుల కష్టాలు తెలిసిన నాయకుడు అన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో కార్మికులకు ఏ ఆపద వచ్చిన నేనున్నానంటూ భరోసా కల్పిస్తూ బాధ్యతగా వ్యవహరిస్తున్నందుకు ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు.

శ్రీ శ్రీనివాస ఆఫీసర్స్ కాలనీలో హెూలీ వేడుకలు



నవతెలంగాణ-కాప్రా

కాప్రా డివిజన్ పరిధిలోని శ్రీ శ్రీనివాస ఆఫీసర్స్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యం లో బుధవారం హెూలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో యువకులు, పిల్లలు, మహిళలు రంగులు పూసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీ నాయకులు భాస్కర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, శంకర్రావు మాట్లాడుతూ ప్రజలందరికీ జీవితాలలో హెూలీ వేడుకలు వెలుగు నింపాలని కోరారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదల జీవితాలలో వెలుగు



నవతెలంగాణ-కాప్రా

సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదల జీవితాలలో వెలుగులు అని బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారిలక్ష్మారెడ్డి అన్నారు. కాప్రా డివిజన్ ఎల్లారెడ్డిగూడ చెందిన జీ కల్పనకు మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కును వారికి లక్ష్మారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యం చేయించుకొని ఆర్థిక సోమత లేని ప్రజలందరూ సీఎం రిలీఫ్ ఫండ్ సేవలను వినియోగించుకోవాలని అన్నారు. ఆర్థిక సహాయానికి సహాయ సహకారాలు అందించిన లక్ష్మారెడ్డికి బాధితులు కతజ్ఞతలు తెలియజేశారు.



స్వరాష్ట్రంలో మహిళలు స్వతహాగా ఎదుగుతున్నారు

- జీహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, కార్పొరేటర్ శాంతి



నవతెలంగాణ-నాచారం

స్వరాష్ట్రంలో స్వతహాగా మహిళలు అభివద్ధి చెందేందుకు సీఎం కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలు కండఫ్లకు కట్టినట్టు కనిపిస్తున్నాయని, రాజకీయాలలో మహిళలకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించి వంటింటికి పరిమితమైన మహిళలను పాలనా వ్యవస్థలో ప్రథమ స్థాయిలో నిలిపారు. జీహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నవతెలంగాణతో తన అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

ప్రశ్న: రాష్ట్రంలో మహిళలకు రక్షణ ఉందా...?

శాంతి, కార్పోరేటర్ : మహిళల రక్షణ కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశారు. నగరంలో షీ టీమ్‌లు మహిళల రక్షణ కోసం నిఘా నీడలా పనిచేస్తుంది. మహిళల భద్రత కోసం బాధ్యతాయుతంగా బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవహరిస్తుంది.

ప్రశ్న: మహిళలు స్వతహాగా అభివద్ధి చెందారని మీరు భావిస్తున్నారా...?

శాంతి, కార్పొరేటర్: రాష్ట్రం ఏర్పడిన తర్వాత మహిళలు స్వతంత్రంగా అన్ని రంగాలలో అభివద్ధి చెందారు. మహిళలకు ప్రత్యేక రాజకీయ రిజర్వేషన్లు మహిళలకు ప్రత్యేక రాయితీలు, అనేక సంక్షేమ పథకాలను ఇచ్చిన ఘనత సీఎం కేసీఆర్ కే దక్కుతుంది. నేటి మహిళలు తన కుటుంబంతో పాటు సమాజంలో స్త్రీ ఔనిత్యాన్ని చాటుతున్నారు.

ప్రశ్న: పాలనలో మహిళలకు ప్రాధాన్యత, గౌరవం ఉందా..?

శాంతి, కార్పొరేటర్: పాలనలో ప్రత్యేకమైన ప్రాధాన్యతతో పాటు మహిళగా గౌరవం కూడా మెండుగా ఉంది. మహిళా ప్రజా ప్రతినిధులకు, అధికారులకు సీఎం కేసీఆర్ ప్రాధాన్యత ఇస్తున్నారు కాబట్టే గ్రేటర్ హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి కాగలిగింది. నాలాంటి వాళు ఎందరో కార్పొరేటర్లుగా గెలిచి ప్రజా జీవితంలో కొనసాగుతున్నారు.

ప్రశ్న: మహిళలకు మీరిచ్చే సందేశం ఏమిటి...?

శాంతి, కార్పొరేటర్: సమాజంలో మహిళలు ఎంచుకున్న రంగాలలో రాణించాలంటే ఆత్మస్థైర్యంతో ముందుకు సాగినప్పుడు విజయం తన సొంతమవుతుంది. ముందుకు వెళుతున్న క్రమంలో అనేక కష్టాలు,ఒత్తిళ్లు ఎదురవుతాయి. వాటన్నింటినీ ఎదిరించి నిలబడితే అంతిమ విజయం నీదవుతుంది.

త్రిబుల్ సీ ముందు జరుగుతున్న పనుల్లో అపశృతి



- గేటు మీద పడి వ్యక్తి మృతి

నవతెలంగాణ-బంజారాహిల్స్

రాష్ట్రంలో నేరాల నివారణ కోసం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన బంజారాహిల్స్‌లోని రోడ్డు నెంబర్ 12లో ఉన్న కమాండ్ కంట్రోల్ సెంటర్ (సీసీసీ) వద్ద జరుగుతున్న గేట్ల నిర్మాణ పనుల్లో అపశృతి చోటు చేసుకుంది. కమాండ్ కంట్రోల్ సెంటర్ ముందు భారీ కడీలతో ఇనుప గేట్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. శ్రీ సాయి ఇండస్ట్రీస్ సంస్థ ఈ పనులు నిర్వహిస్తుండగా మంగళవారం పనులను పరిశీలించేందుకు వచ్చిన ఆ సంస్థ ప్రొప్రైటర్, కాంట్రాక్టర్ సుధాకర్‌పై ప్రమాదవశాత్తు గేటు పడింది. దీంతో తలకు తీవ్ర గాయలైన సుధాకర్‌ను సమీపంలోని సిటీ న్యూరో హాస్పిటల్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే చనిపోయినట్టు నిర్ధారించారు. పోలీసులు సుధాకర్ మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సీనియర్ పాత్రికేయుడు రాజేశ్వర్ రావుకు లోక్ దళ్ నివాళి

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

సీనియర్ పాత్రికేయులు చెన్నమనేని రాజేశ్వర్‌రావు మృతి పట్ల భారత జాతీయ లోక్ దళ్ పార్టీ జాతీయ కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు పుల్లూరి వెంకట రాజేశ్వరరావు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మీడియా రంగానికి రాజేశ్వర్‌రావు అందించిన సేవలను గుర్తు చేస్తూ ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. దశబ్దాల పాటు వివిధ పత్రికల్లో తనదైన శైలిలో రచనల ద్వారా ఎందరికో మార్గదర్శకం అయ్యారని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నేదురుమల్లి జనార్దన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చెన్నమనేని రాజేశ్వర్ రావు ఆయనకు ప్రెస్ అడ్వైజర్‌గా పని చేశారని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ బోర్డు (ఏపీఎస్ఈబీ)కి ఆయన సలహాదారులుగా వ్యవహరించారన్నారు. దీర్ఘకాలం ఆంధ్ర పత్రికలో రిపోర్టర్‌గా పని చేసిన రాజేశ్వర్‌రావు ఆ తర్వాత ఢిల్లీలో ఇండియన్ ఎక్స్ ప్రెస్, దక్కన్ క్రానికల్ పత్రికలకు పని చేశారన్నారు. మన తెలంగాణ పత్రికకు ఒంబుడ్స్ మన్‌గానూ, హెచ్ఎంటీవీ సలహాదారులుగానూ ఆయన పని చేశారని గుర్తు చేశారు.

సమైక్య జీవన పోరాట స్ఫూర్తి మార్చి 8

- సుందరయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎస్.వినయ్ కుమార్
- స్త్రీ పురుష సమానత్వం పై లఘు చిత్ర ప్రదర్శన



నవతెలంగాణ-హైదరాబాద్

శ్రమలో పుట్టి, శ్రమలో పెరిగి సమైక్య జీవన సౌందర్యంతో బతికే మహిళాభివృద్ధి, పోరాట దినమే మార్చి 8 అని సుందరయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎస్.వినయ్ కుమార్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా టిపిఎస్ కే షార్ట్ ఫిలిం గ్రూప్ దాశరధి థియేటర్‌లో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మూడు లఘు చిత్రాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎస్.వినయ్ కుమార్ మాట్లాడుతూ స్త్రీ పురుష సమానత్వాన్ని అన్ని రంగాల్లో సమభాగస్వామ్యాన్ని కోరుకుంటూ.. తీసిన సిని మాలు మహిళా లోకానికి మకుటాయమానమనీ, అద్భుత సందేశం అన్నారు. సమాజంలో పాతుకుపోయిన సామాజిక అంతరాలను పాలకులు అనుసరిస్తున్న మహిళా వ్యతిరేక విధానాలను ఎండగట్టిన తీరు ప్రశంసనీయమన్నారు. టిపిఎస్కే నాయకులు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈరోజు ప్రదర్శించిన " నేటి మహిళ" "పశువు" ప్రతి చెల్లి ప్రతి అక్క పోలీస్ ఆఫీసర్, ఈ చిత్రాలు మహిళా జీవితాలకు దర్పణం ఇలాంటి లాంటిదనీ, ఈ చిత్రాలను మహిళలోకం ప్రోత్సహించాలని సందేశాత్మక చిత్రాలు సమాజంలో పురుషాధిక్యతను తుడిచివేస్తాయని చెప్పారు. "వరకట్నంతో.. నీ మెడలో వేసిన తాళి కాదు.. అది ఎగతాళి.. నీ నుదుట దిద్దింది తిలకం కాదు.. చిత్రహింసలకు చిహ్నమైన రక్తపు బొట్టు.. నీ కాలికి తొడిగింది మెట్టె కాదు నీ ప్రగతి పై వేటువేసే సమ్మెట" అన్న డైలాగులు ఎందరినో ఆలోచింపజేశాయన్నారు. షార్ట్ ఫిలిం గ్రూప్ టీం నాయకులు బి డి ఎల్ సత్యనారాయణ " నేటి మహిళా" అనే చిత్రంలో నటుడు, నిర్మాత మాట్లాడుతూ మనలో ప్రతి ఒక్కరికీ భద్రత లేనప్పుడు ఎవరికి భద్రత ఉండదనే.. సత్యాన్ని మనం మర్చిపోకూడదనీ, ప్రజల పట్ల ప్రేమ, మానవతా, సమిష్టితత్వం, రుజువర్తన స్వార్థ రహిత్యం, పని పట్ల శ్రద్ధ, ఇవే నూతన మానవుని లక్షణాలు భవిష్యత్ లక్ష్యంగా లఘు చిత్ర నిర్మాణాలు జరగాలన్నారు. నిస్సారపు, నిర్జీవపు సమాజాన్ని వెనక్కి నడిపే సినిమాలు మనకొద్దనీ, మనిషే కేంద్రంగా..శ్రమే గీటురాయిగా సినిమాలు రావాలనీ, అలాంటి సినిమాలను టిపిఎస్కే, సుందరయ్య విజ్ఞాన కేంద్రం నిరంతరం చిత్ర ప్రదర్శన కేంద్రంగా ఉంటుందని సందేశంతో పాటు హామీనిచ్చారు. చిత్ర దర్శకులు పీ.మోహన్ రామ్ ప్రసాద్, నిర్మాత దుర్గాప్రసాద్ నేటి మహిళా నటీనటులు శ్రీదేవి బీడీఎల్ సత్యనారాయణ నటులు వైవిఆర్ ఆచార్యులు దర్శకుడు రఘు రామచంద్ర రచయిత నిర్మాత విజయ్ కుమార్ పశువు సినిమా యూనిట్‌కు సంబంధించిన శరణ్య, స్రవంతి, రామస్వామి మహేష్ బోయ ఉత్తమ నటి: శరణ్యను, స్రవంతిలను దాశరధి థియేటర్ నిర్వహణ కమిటీ ఎస్.వినయ్ కుమార్ భూపతి వెంకటేశ్వర్లు సత్కరించింది ప్రతి చెల్లి అక్క ఒక పోలీస్ ఆఫీసర్ అనే లఘు చిత్ర నటులు నిర్మాత రాజనాల సత్యం సుజావతి, సుశీల దూది పాల్గొని ఇలాంటి సినిమాలకు అండగా మద్దతుగా ప్రోత్సాకంగా మేము ఉంటామని ప్రకటించారు.

సంస్కృతి, సంప్రదాయాలను చాటిచేప్పేవే పండుగలు



- రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

నవతెలంగాణ-అడిక్‌మెట్

మన సంస్కృతి, సాంప్రదాయాలను చాటిచేప్పేవే మన పండుగలు అని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మంగళవారం ఇందిరా పార్కులో నిర్వహించిన హెూలీ వేడుకల్లో పాల్గొన్న సందర్భంగా మాట్లాడారు. భారతదేశంలోనే మనం జరుపుకునే పండుగలు ఎంతో గొప్పవన్నారు. ప్రతి పండుగ నిర్వహణకు ఒక ప్రత్యేక విశిష్టత ఉంటుందన్నారు. అందులో హెూలీ కూడా ఒకటి అన్నారు. హెూలీ వేడుకలను ప్రతి ఏడాదీ దేశం మొత్తం ఎంతో ఘనంగా జరుపుకోవడం సంతోషకరం అన్నారు. మనం జరుపుకునే పండుగలు, ఆచారాల గురించి నేటి తరం యువతలో చాలా మందికి తెలియదనీ, తల్లిదండ్రులు తమ పిల్లలకు తమ ఆచారాలు, సాంప్రదాయాల గురించి తెలియజెప్పాల్సిన అవసరం ఉందన్నారు. విదేశీ సంస్కృతికి ఆకర్షితులై మన సంస్కృతులు, ఆచారాలను మరచిపోతున్నారనీ వాటిని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ప్రతినిత్యం వేలాదిమంది వచ్చే నగరంలోనే అతిపెద్ద పార్క్‌గా ఉన్న ఇందిరా పార్క్‌ను ఎంతో అద్భుతంగా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత హైదరాబాద్ నగరం అన్ని రంగాల్లో ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. పార్క్‌లో చిల్డ్రన్స్ పార్క్, స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు వంటి పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై త్వరలోనే చర్యలు చేపట్టనున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, బీఆర్ఎస్ యువజన నాయకులు ముఠా జయసింహ, కార్పొరేటర్ రచన శ్రీ, సరస్వతి, ఉపాసకులు దైవజ్ఞ శర్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు మానసికంగా దృఢపడాలి

జీహెచ్ఎంసీ సర్కిల్-7 డిప్యూటీ కమిషనర్ అలివేలు మంగతాయారు



నవతెలంగాణ-హైదరాబాద్

'మహిళలు ఆడంబరాలు, వ్యక్తిత్వాలు కంటే ఆత్మవిశ్వాసంపై ఎక్కువ శ్రద్ధ వహించాలి. మహిళలు పురుషులతో సమానం. ఎక్కువ తక్కువ మాటలు రాకూడదు. అన్నిటిలో రాణిస్తున్నారు. ఒడిదుడుకులు ఉంటాయి. వాటిని అధిగమించి నిలబడినప్పుడే విజయం' అని జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ సంతోష్ నగర్ సర్కిల్ - 7 డిప్యూటీ కమిషనర్ అలివేలు మంగ తాయారు అన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా నవతెలంగాణతో మాట్లాడారు.

నవతెలంగాణ : సమాజంలో మహిళల పరిస్థితి ఎలా ఉంది?

డీసీ : మహిళలకు ప్రత్యేకత ఉంది. ప్రస్తుత కాలానికి అనుగుణంగా అందరూ రాణిస్తున్నారు. సాధికారత అవుతుంది. రక్షణ కూడా జరుగుతుంది. కానీ దాన్ని చూస్తూ కాకుండా అధిగమించుకునేలా ముందుకెళ్లాలి.

నవతెలంగాణ : మహిళల చదువు, ఉద్యోగాల్లో ఎలా ఉంది?

డీసీ : మహిళల చదువు ప్రస్తుతం బాగా పెరిగింది. సమాజంలో కూడా గుర్తింపు ఉన్నప్పటికీ సానుకూలమే కాకుండా ప్రతికూల ధోరణులు కూడా లేకపోలేదు. కానీ ప్రతి ఒక్కరికీ చదువు అందించే దిశగా తల్లిదండ్రులు కూడా చూస్తున్నారు. చదువుకోలేని స్థితిలో ఉన్న వారికి సహకరించడం మంచిది. మన వంతుగా మానవ దృక్పథంతో ప్రోత్సహించడానికి కృషి చేయాల్సిన అవసరం ఉంది.

నవతెలంగాణ : ఆయా రంగాల్లో మహిళలు రాణిస్తున్నారు? వారు ఎలా ఉండాలి?

డీసీ : ప్రస్తుతం అన్ని రంగాల్లోనూ మహిళలు రాణిస్తున్నారు. కానీ ఏదో ఓ వైపు చిన్న చూపు తప్పడం లేదు. వారు మోర్ ఎమోషనల్‌తో స్ట్రెంతెన్ కావాలి ఇంట్లో కాని బయటకాని జాగ్రత్తగా సెల్ఫ్ కాన్ఫిడెన్స్‌ను పెంచుకోవాలి. అలా నిలబడినప్పుడు ఇతరులు కూడా రాబోతున్న తరానికి కూడా మాదిరిగా ఉంటుందని ఆలోచన. ఓ పక్క మహిళలు అన్ని కల్పిస్తున్నట్టు ఉంటున్నప్పటికీ వెనుకబడిన వారిని ప్రోత్సహించాలి.

నవతెలంగాణ : సామాజికంగా, కుటుంబ పరంగా ప్రోత్సాహం ఎలా ఉంది? ఎలా ఉంటే బాగుంటుంది అనుకుంటున్నారు?

డీసీ : ఒకప్పుడు లెబానోన్, జోర్డాన్, అరేబియన్ మిడిల్ వంటి ప్రాంతాల్లో ఆడపిల్ల పుట్టగానే నోట్లో వడ్ల గింజ వేసి చంపేవారు. మన దగ్గర అలా లేదు. చాలా మార్పులు వచ్చాయి. సామాజికంగా కుటుంబపరంగా ప్రోత్సాహం ఉంది. అదే క్రమంలో అనుమతించదగ్గ స్వేచ్ఛను ఇస్తూ వారి ఉద్దేశాలకు అనుగుణంగా మనం ప్రోత్సహిస్తే వాళ్ల రాణించగలుగుతారు. వాటిలో చాలా వరకు అన్ని కుటుంబాలు ప్రోత్సహించడం లేకపోవడంతో కూడా వెనుకబాటు ఉంది. ప్రస్తుత రోజుల్లో ప్రతి ఒక్కరికీ ఉన్నత చదువు చదివి బాధ్యతగా ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఉంటుంది. వాటిని గుర్తించి ప్రోత్సహిస్తే బాగుంటుంది.

నవతెలంగాణ : మీరు ఈ స్థాయికి చేరుకోవడం.. ఇతరులకు ఏమైనా సూచన?

డీసీ : సమస్యలు తప్పవు. వాటిని చూస్తూ ఉండే దాని కంటే మనం ఎలా ముందుకు వెళ్తాం అనే దిశగా ఆలోచన చేస్తూ నిలబడాలి. ప్రతి పనుల్లో ఇబ్బందులు తప్పవు. వాటిని అధిగమించి సాధించి నిలబడినప్పుడు సార్ధకత. ఆత్మవిశ్వాసం ఎక్కువ శ్రద్ధ వహించాలి. మానసికంగా దృఢపడాలి.

నవతెలంగాణ : కుటుంబం, సమాజం నుంచి మహిళలకు ఎలాంటి సహకారం ఉండాలి?

డీసీ : ఆడవాళ్లు అవసరానికి మించి శ్రమిస్తారు. ఇంట్లో పనులు, ఉద్యోగులు చేసే వాళ్ళు ఉద్యోగాల్లో బయట పనులు చేశారు బయట పనుల్లో ఉంటూ శరీరాన్ని నిర్లక్ష్యం చేయవద్దు. శరీరానికి ఆరోగ్యం కాపాడుకోవడం ప్రధానం ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించడం చూసుకోవాలి. సమాజం స్త్రీల్లో వారి శక్తిని గుర్తించాలి. మానవ దృక్పథం కలిగి ప్రోత్సహిస్తే దీనిలో తక్కువ కాదు. అసాధ్యమైనది ఏదీ లేదు.

నవతెలంగాణ : విద్యార్థులకు మీ సూచన?

డీసీ : విద్యార్థినులు విద్యలో రాణించాలి. భవిష్యత్తు ప్రణాళికలకు విద్య స్ట్రేంతెన్ పెంచుకోవాలి. కాలేజీల్లో ప్రస్తుతం ఎదుర్కొంటున్న పరిణా మాలు అనుభవాలుగా మలుచుకుని భవిష్యత్తును అధిగమించుకోవాలి. అంతే తప్ప చిన్న చిన్న వాటిపై ఏమో నిర్ణయాలు తీసుకుంటూ ప్రాణాల మీదికి కోల్పోవడం మంచి నిర్ణయాలు సరైనది కాదు. భవిష్యత్ తరానికి మ నం మాదిరి కరంగా వారిని అధిగమించి నిలబడినప్పుడే సార్ధకత.

'ఆయుష్మాన్ భారత్'ను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన ఆయుష్మాన్ భారత్ ఉచిత ఆరోగ్య బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జంబాగ్ డివిజన్ ప్రధాన కార్యదర్శి కే రామకష్ణ అన్నారు. మంగళవారం జాంబాగ్‌లో అయన మాట్లాడుతూ ఈ పథకంతో ప్రతి ఒక్కరికీ రూ.5 లక్షల వరకు ఉచిత బీమా సౌకర్యం ఉంటుందని తెలిపారు. బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఈ పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఇంట్లో ఎంతమంది ఉంటే అందరికీ వర్తిస్తుందని తెలిపారు.

మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి



- ది వోగ్ నారి, మొహా ఇండియా వ్యాపార సంస్థల చైర్మెన్ సలోని జైన్

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

నేటి మహిళలు వ్యాపార రంగంలోకి అడుగుపెట్టి ఆ రంగంలో రాణించాలని 'ది వోగ్ నారి', 'మొహా ఇండియా' వ్యాపార సంస్థల చైర్మెన్ సలోని జైన్ మహిళలకు సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఫ్యాషన్ డిజైనింగ్‌లో డిగ్రీ చేసిన ఆమె లండన్ ఫ్యాషన్ వీక్‌లో తన కలెక్షన్ ప్రదర్శించడం ద్వారా వ్యాపారంలో అన్ని అంశాలు మార్కెటింగ్, డెలివరీ, డిజైనింగ్ చూసుకుంటున్నారు. నిత్యం మారే ఫ్యాషన్ ప్రపంచంలో సవాళ్లు ఎదుర్కొంటున్నప్పటికీ ఆమె తనను తాను మెరుగుపరుచుకుంటూ నాణ్యమైన ఉత్పత్తులను అందిస్తున్నారు. తన వినియోగదారుల సంతృప్తికి అమితమైన విలువనందించే సలోని జైన్ తన వ్యవస్థాపక ప్రయాణానికి తన కుటుంబ అండదండలు మాత్రం మర్చిపోలేదనీ, తన వ్యాపారాన్ని నిర్విరామంగా నిర్వహించడానికి ఉబెర్ కనెక్ట్ వంటి సేవలు తనకు సహాయపడ్డాయని ఆమె చెబుతున్నారు.

పురుషాధిపత్యాన్ని, దోపిడీ వర్గ సమాజాన్ని స్థిరీకరించే మనువాదాన్ని తిప్పికొడదాం

నవతెలంగాణ-అడిక్‌మెట్



పురుషాధిపత్యాన్ని, దోపిడీవర్గ సమాజాన్ని స్థిరీకరించే మనువాదాన్ని తిప్పికొడదాం అని పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కావేరి పిలుపునిచ్చారు. మంగళవారం ప్రగతిశీల మహిళా సంఘం హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల కమిటీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షురాలు జి.అనసూయ అధ్యక్షతన విద్యానగర్ మార్క్స్ భవన్ లో అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం సందర్భంగా సభను నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు జి.ఝాన్సీ మాట్లాడుతూ మహిళల హక్కుల పైన గతంలో ఎన్నడూ లేనంతగా దాడులు కొనసాగుతున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దేశంలో కుల, వర్గ, మత వివక్షతను పెంచుతున్నాయన్నారు. ఒక్క మహిళలపైనే కాకుండా దళితులు, మైనార్టీలపై దాడులకు ఆర్ఎస్ఎస్, బీజేపీ ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదన్నారు. నిత్యా వసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. ఉపాధి అవకాశాలు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎక్కడా పెరగ లేదన్నారు. ప్రజా సమస్యలను తీర్చలేని ప్రభుత్వాలు ప్రజల మధ్య విభేదాలను సృష్టిస్తూ విడగొడుతున్నారన్నారు. మనుధర్మ శాస్త్ర పునరుద్ధరణకు పూనుకుంటూ స్త్రీలను పురుషాధిపత్యానికి బలి చేస్తుందనీ, కేంద్ర ప్రభుత్వ ఫాసిస్ట్ పాలనకు వ్యతిరేకంగా ప్రజాస్వామిక అవకాశాలను రక్షించుకునే పోరాటాలను బలోపేతం చేయడానికి మార్చి 8 పోరాటాల నుంచి స్ఫూర్తిని పొందాలన్నారు. కార్యక్రమంలో ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షులు అరుణ, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కావేరి తదితరులు పాల్గొన్నారు.

అఖిల భారత శాంతి, సంఘీభావ సంఘం జాతీయ అధ్యక్షులుగా డాక్టర్ దిడ్డి సుధాకర్

నవతెలంగాణ-హిమాయత్‌నగర్



యుద్ధానికి వ్యతిరేకంగా శాంతి, భద్రత, మానవ హక్కులను కాపాడటం కోసం అంతర్జాతీయ సమాజాన్ని ఏకం చేసి ఉద్యమాలు నిర్మిస్తామని అఖిల భారత శాంతి, సంఘీభావ సంఘం నూతనంగా ఎన్నికైన జాతీయ అధ్యక్షులు డాక్టర్ దిడ్డి సుధాకర్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన డాక్టర్ దిడ్డి సుధాకర్ అఖిల భారత శాంతి, సంఘీభావ సంఘంలో క్రియాశీలక కార్యకర్తగా పని చేస్తూ యుద్ధాలకు, మతోన్మాదానికి వ్యతిరేకంగా, శాంతిని కాపాడుటకై జరిగిన అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించారు. ఇటీవలే మూడు రోజుల పాటు చండీగఢ్ నగరంలో జరిగిన అఖిల భారత శాంతి, సంఘీభావ సంఘం జాతీయ మహా సభలలో సంఘం జాతీయ అధ్యక్షులుగా డాక్టర్ దిడ్డి సుధాకర్ ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. దిడ్డి సుధాకర్ తో పాటు పల్లబ్ సేన్ గుప్తా, నీలోత్పల్ బసు జాతీయ అధ్యక్ష వర్గంగా, అరుణ్ కుమార్, హరిచంద్ సింగ్ బట్‌లు జాతీయ ప్రధాన కార్యదర్శులుగా ఎన్నికైయ్యారు. మంగళవారం హిమాయత్‌నగర్‌లోని ఐపీసో రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డాక్టర్ దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ.. యుద్ధాలు, ఉగ్రవాదం, తీవ్రవాదం, మతోన్మాదం అత్యంత ప్రమాదకరమైనవనీ, విధ్వంసకరమైనవన్నారు. జాతి సంఘర్షణ, జాతి హింస, జాతి యుద్ధాలు, అనేక కోణాల్లో తీవ్రవాదం, నయా వలసవాదం, ఆధిపత్యం వంటివి ప్రపంచంలో శాంతికి, భద్రతకు పెద్ద అవరోధాలుగా పని చేస్తూనే ఉన్నాయని తెలిపారు. ప్రజలందరి మానవ హక్కుల పరిరక్షణ, పర్యావరణ పరిరక్షణ, అంతర్జాతీయ సమాజం ఏకీకరణకు సంబంధించిన ఆవశ్యకతపై తమ దృష్టిని కేంద్రీకరించడం ప్రారంభిస్తామన్నారు. ప్రపంచ ప్రజల సర్వతోముఖమైన సుస్థిర అభివృద్ధిని సురక్షితమైన దృక్పథంతో అంతర్జాతీయ సంబంధాల శాంతియుత, సహకార, సామరస్యపూర్వకమైన వాతావరణం సృష్టించడానికి ఈ ఐపీసో జాతీయ మహా సభలు శ్రీకారం చుట్టాయని పేర్కొన్నారు. భారతదేశంలో హింసతో మెజారిటీ గుర్తింపును సృష్టించడంలో మితవాద శక్తులు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయనీ, దేశంలో జాతి, కులం, మతం, లింగం మొదలైన వాటి ఆధారంగా వివక్షలు, హింస పెంచుతున్నారని ఇవి దేశానికి అత్యంత ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. మతోన్మాదం చాలా హానికరమైనదని, దేశంలో శాంతికి, అభివృద్ధికి తీవ్ర విఘాతం కలిగిస్తుందని చెప్పారు. దేశ పౌరుల మధ్య ద్వేషం, శత్రుత్వాన్ని మితవాద శక్తులు సృష్టిస్తున్నాయని, వాటిని శాంతియుత మార్గాల ద్వారా అడ్డుకుంటామని, న్యాయం, సామాజిక, ఆర్థిక, రాజకీయ, ఆలోచన, వ్యక్తీకరణ, నమ్మకం, విశ్వాసం, ఆరాధన స్వేచ్ఛను కల్పిస్తున్న భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, లౌకికవాదాన్ని రక్షించుకుంటామని ఆయన వెల్లడించారు. హరిచంద్ సింగ్ బట్ చండీగఢ్ డిక్లరేషన్ ప్రవేశపెట్టారని, దీంతో పాటు యుక్రెయిన్ యుద్ధం, క్యూబా, పాలస్తీనాలపై పలు తీర్మానాలను మహా సభ ఆమోదించిందని డాక్టర్ దిడ్డి సుధాకర్ తెలిపారు.

183 రోజులు పని దొరకని పరిస్థితుల్లో జీవిస్తున్నాం

- తెలంగాణ శ్రామిక మహిళా ఫోరం (ఏఐటీయూసీ) రాష్ట్ర కన్వీనర్, సీపీఐ సీనియర్ నాయకురాలు పి.ప్రేమ్ పావని



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

భారతదేశ జనాభాలో మహిళలు 48.5 శాతం. భారత శ్రామిక శక్తిలో 56 కోట్లలో మహిళా శ్రామికులు 17 కోట్ల మంది మొత్తం శ్రామిక శక్తిలో ఏ చట్టాలు వర్తించని 16 కోట్ల మందికి ఏడాదికి 183 రోజులు పని దొరకని పరిస్థితుల్లో జీవిస్తున్నారని తెలంగాణ శ్రామిక మహిళా ఫోరం (ఏఐటీయూసీ) రాష్ట్ర కన్వీనర్, సీపీఐ సీనియర్ నాయకురాలు పి.ప్రేమ్ పావని ఆందోళన వ్యక్తం చేశారు. 113వ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రధాన సమేత శక్తిగా ఉన్న 40 కోట్లలో కేవలం 25 శాతం మంది మాత్రమే మహిళా శ్రామికులు ఏ చట్టాలు వర్తించని 87.3 శాతం గ్రామీణ మహిళా కార్మికులు వీరు పొలంలో సేద్యం చేయడంతోపాటు వ్యవసాయ కూలీలుగా పని చేస్తున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పనులు లేని కారణంగా పట్టణాలకు వలస వచ్చిన మహిళలు అసంఘటిత కార్మికులుగా నిర్మాణ రంగంలో గృహ కార్మికులుగా, కుటీర పరిశ్రమల్లో చిరు వ్యాపారాలుగా వివిధ రకాల జీవనోపాధిని కల్పించుకుంటూ జీవిస్తున్నారని ఆమె చెప్పారు. కరోనా మహమ్మారి కారణంగా పట్టణ, గ్రామీణ మహిళా కార్మికుల స్థితిగతుల్లో ఘననీయమైన మార్పులు చోటు చేసుకున్నాయనీ, ఉపాధి కోల్పోవడం, నిరుద్యోగం, పేదరికం వీరిని వెంటాడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారికి చేయూతని వ్వకపోగా నిత్యావసర ధరల పెరుగుదల, పెట్రోల్, డీజిల్ రేట్ల పెంపుదల తాజాగా పెంచిన వంట గ్యాస్, వాణిజ్య గ్యాస్ సిలిండర్ల ధర పెరుగుదల మహిళల జీవితాల్లో తీవ్ర అలజడిని సృష్టించిందని గుర్తు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్థిక బడ్జెట్ లో అన్ని సంక్షేమ పథకాలకు బడ్జెట్ కేటాయింపులు కుదించడం వల్ల పేద, మధ్య తరగతి కుటుంబాలపై తీవ్ర ప్రభావం చూపిందన్నారు. ప్రజలకు కావాల్సిన విద్య, వైద్యం, ఆరోగ్యం, పౌష్టికాహారం పొందటం ఎండుబావి అయిందని విమర్శించారు. 2030 నాటికి సుస్థిర అభి వృద్ధి లక్ష్యాలను చేరుకోవడంలో భారతదేశం కనిపించనంత దూరంలో ఉందనీ, మోడీ ప్రభుత్వం మాత్రం ప్రపంచం మనదేశం వైపు చూస్తుందనీ, ఆర్భాటాలు ప్రకటించడం హాస్యాస్పదం అన్నారు. మహిళలు, బాలికలకు రక్షణ కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. దేశంలో మహిళలకు భద్రత, రక్షణ కరువైందనీ, రాబోయే రోజుల్లో మహిళల స్థితిగతుల్లో మార్పు కోసం పాలకుల ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై అనునిత్యం పోరాడాల్సిన అవసరం ఉందని సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం ప్రభుత్వాలు వేడుకగా కాకుండా మహిళల సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాధికారత దిశగా చర్యలు చేపట్టే విధంగా ఒత్తిడి పెంచేందుకు మహిళ లోకం పోరాటాలు చేపట్టాలని ఆమె సూచించారు.



చిక్కడపల్లి పరిధిలోని బాగ్‌లింగం పల్లిలో ఉన్న అచ్చయ్యనగర్‌లో హెూలీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు, మహిళలు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సంబురాలు జరుపుకున్నారు.
నవతెలంగాణ-అంబర్‌పేట

మార్కెటింగ్‌ను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తున్న కోరుపోలు నిఖిత

- ఏఎస్‌బీఎల్ సేల్స్ అండ్ మార్కెటింగ్ డైరెక్టర్ కోరుపోలు నిఖిత

నవతెలంగాణ-హిమాయత్‌నగర్



వినియోగదారులను ఎదుర్కొంటూనే అమ్మకాలు, మార్కెటింగ్‌ను పెంపొందించే కార్యక్రమాలను నడిపించడంలో ఏఎస్‌బీఎల్ సేల్స్ అండ్ మార్కెటింగ్ డైరెక్టర్ కోరుపోలు నిఖిత అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రాథమిక స్థాయి నుంచి బ్రాండ్‌ను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించిన ఆమె ఏఎస్‌బీఎల్ ప్రాజెక్టులు ఎన్నింటికో విజయవంతంగా నేతృత్వం వహిస్తున్నారు. అంతేకాకుండా ఏఎస్‌బీటీఎల్, ఆరోగ్యవంతమైన వృద్ధిని నమోదు చేయడంలోనూ కీలకంగా వ్యవహరించారు. విక్రయాలకు ముందు దశ, అమ్మకం తర్వాత సమగ్రమైన విధానంలో కమ్యూనికేషన్ ఉండాలనే ఆమె మార్కెటింగ్ అనేది ఖచ్చితంగా రెండు వైపులా ఉండే కమ్యూనికేషన్ అని నమ్ముతుంటారు. ఎకనామిక్స్ ప్రధాన అంశంగా అకౌంటింగ్, ఫైనాన్స్ అంశాలుగా పుర్ద్యు యూనివర్శిటీ నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ఆమె, ఆ తర్వాత అత్యంత ప్రతిష్టాత్మకమైన న్యూయార్క్ యూనివర్శిటీ నుంచి ఎకనామిక్స్‌లో మాస్టర్స్ డిగ్రీ చేశారు. పుస్తక పఠనం పట్ల అమితాసక్తి కలిగిన నిఖిత, ట్రావెలింగ్‌ను అమితంగా ఇష్టపడతారు. తమ కుటుంబ సభ్యులతో నాణ్యమైన సమయం గడపడాన్ని ఆమె అమితంగా ఇష్టపడతారు.

ఎమ్మెల్యేకు హోలీ పండుగ శుభాకాంక్షలు



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళలు మంగళవారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ని ఆయన నివాసం వద్ద మర్యాదపూర్వకంగా కలిసి హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా పలు ఆహ్వాన పత్రికలు అందజేశారు.



తిమ్మాయిపల్లిలో హోళి వేడుకల్లో పాల్గొన్న మంత్రి మల్లారెడ్డి

పరికి చెరువును కబ్జాదారుల చెర నుంచి కాపాడండి

నవతెలంగాణ - కూకట్‌పల్లి

పరికి చెరువును కబ్జాదారుల కబంధ హస్తాల నుండి కాపాడి మిషన్ కాకతీయ పథకం ద్వారా సుందరీకరణ చేపట్టి మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దాలని పరికిచెరువు పరిరక్షణ సమితి సభ్యులు శేరిలింగంపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు ఆరికెపూడి గాంధీకి మంగళవారం వినతి పత్రంలో కోరారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని ఆల్విన్ కాలనీ డివిజన్ భూదేవి హిల్స్ ఆనుకొని ఉన్న పరికిచెరువు సుమారు 50 ఎకరాలలో విస్తరించి ఉంది. పరికి చెరువులో ప్రైవేటు వ్యక్తులు ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా ఇళ్ల నిర్మాణ వ్యర్థాలను తీసుకువచ్చి చెరువు పూడ్చి కబ్జాలకు పాల్పడుతున్నారని తెలిపారు. మండల అధికారులు టిప్పర్‌లను, టాక్టర్లను గుర్తించి పోలీస్ స్టేషన్లో కేసులు బుక్ చేసినప్పటికీ కబ్జాదారుల ఆగడాలు మితిమీరుతున్నాయని గుర్తుచేశారు. చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ దిమ్మలు కూడా కనిపించకుండా తొలగించారని పేర్కొన్నారు. ఇరిగేషన్ అధికారులు అలసత్వం కారణంగా పూర్తిగా చెరువు కనుమరుగైపోతుందని, చెరువు కాపాడాల్సిన వారే వత్తాసు పలుకుతున్నారని తెలిపారు. మండల అధికారులు అనేకసార్లు కబ్జాలకు పాల్పడిన ప్రాంతాల్లో కూల్చివేతలు కూడా చేపట్టారని, అయినా కూడా కబ్జాదారులు అమాయక ప్రజలకు అంటగట్టి సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. నిజాం నవాబులు గొలుసు కట్టు చెరువుగా పంట పొలాలకు తాగునీటికి ప్రజలకు ఇబ్బందులు కలగ కుండా పరికిచెరువును ఏర్పాటు చేశారని స్థానికులు వినతి పత్రంలో తెలిపారు. పరికి చెరువులో గుర్రపు డెక్క పేరుకు పోయి దోమలు, ఈగలు వృద్ధి చెంది స్థానికుల కంటిమీద కొనుకు లేకుండా చేస్తున్నాయని, చెరువును పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో రామకృష్ణ, చంద్రశేఖర్ రెడ్డి, గోపాల్, యాదగిరి, సత్యనారాయణ, సుదర్శన్, నాగేశ్వర రావు, ప్రసాద్, ధరణినగర్, చక్రధర్ నగర్, ఆల్విన్ కాలనీ, తులసి నగర్, శ్రీ తులసి నగర్, చక్రధర్ కాలనీ, శివనగర్ వాసులు ఉన్నారు.



ఆల్ ఇండియా వర్శిటీ మహిళా సాఫ్ట్ బాల్ పోటీలకు సీఎంఆర్ విద్యార్థి ఎంపిక

నవతెలంగాణ - కూకట్‌పల్లి

ఈనెల 15వ తేదీ నుండి 21వ వరకు చండీగర్‌లోని పంజాబ్ యూనివర్సిటీలో జరిగే ఆల్ ఇండియా ఇంటర్ వర్సిటీ సాఫ్ట్ బాల్ మహిళల ఛాంపియన్షిప్ పోటీలలో పాల్గొనే, జేఎన్టీయూ జట్టులో కండ్లకోయలోని సీఎంఆర్ టెక్నికల్ క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాల నుండి, కూకట్‌పల్లి ఆల్విన్ కాలనీలో నివాసం ఉంటున్న గడ్డి రాజ్‌కుమార్ యాదవ్, సంధ్యారాణి దంపతుల ముద్దుల కూతురు గడ్డిభవ్యశ్రీ ఎంపికైనట్లుగా కళాశాల నిర్వాహకులు ప్రిన్సిపాల్ రాజిరెడ్డి అధికారికంగా ప్రకటించారు.

ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ పిల్లల్లో చదువుతోపాటు మానసిక ఉల్లాసాన్ని శారీరక దృఢత్వాన్ని పెంపొందించడానికి క్రీడలు ఎంతగానో సహకరిస్తాయని ఆయన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భవ్యశ్రీ తల్లిదండ్రులు తమ పాప మరింత ఉన్నతమైన స్థాయికి ఎదగాలని కోరుతూ సంతోషాన్ని వ్యక్తం చేశారు. సీఎంఆర్ కళాశాల డీన్, అధ్యాపక బృందం, ఫిజికల్ డైరెక్టర్లు శ్రీధర్, యుగంధర్, తోటి మిత్రులు అభినందనలు తెలియజేశారు.



పార్టీ నాయకులకు కాసులపంటగా ప్రభుత్వ నిధులతో నిర్మాణాలు

- లుక్స్ గ్లోబల్ ఫౌండేషన్ ఫౌండర్ చైర్మెన్ బిక్షపతి యాదవ్

నవతెలంగాణ-దుండిగల్

కుతుబుల్లాపూర్ నియోజక వర్గం, నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజలు కట్టిన పన్నులతో ప్రభుత్వ నిధులచే నిర్మించబడిన వివిధ కాలనీలోని కమ్యూనిటీ హాలులు వ్యక్తిగత ఆదాయాలు సమకూర్చే కేంద్రాలుగా మారి స్థానిక అధికార పార్టీ స్థానిక నాయకులకు తలా కొంత పంచుకుంటు అందులో కొంత మందికి కాసులపంటగా మారిందని లుక్స్ గ్లోబల్ ఫౌండేషన్ ఫౌండర్ చైర్మెన్ బిక్షపతి యాదవ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా నిజాంపేట్ బండారి లేఔట్‌లోని కమ్యూనిటీ హాల్ కాలనీ ప్రజల అవసరానికి పనికొస్తుందని ఉద్దేశంతో ప్రభుత్వ నిధులతో నిర్మించబడిన కమ్యూనిటీ హాల్ ఇక్కడ ఉన్న అధికార పార్టీ నాయకుల గుప్పెట్లో పెట్టుకొని కార్పొరేషన్‌కి రావలసిన ఆదాయానికి గండి కొడుతున్నారని, గతంలోనే అనేకమార్లు ఇక్కడున్న అధికారులకు, ప్రజాప్రతినిధులకు స్థానికులు విన్నవించుకున్న ఉలుకు పలుకు లేకుండా ఇక్కడున్న అధికారులు ప్రజాప్రతినిధులు వ్యవహరిస్తున్నారని తెలిపారు. అలాగే నేటి మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలు ఏర్పరచుకునే స్టాల్స్ కొరకు ఒక్కొక్క స్టాల్‌కు దాదాపు 3000 నుండి 5000 వసూలు చేస్తున్నారని, బాహాటంగానే తెలియ వస్తుంది. ఈ డబ్బులు ఎవరి జేబుల్లోకి వెళ్తుందని, మరో వైపు స్థానిక పార్కులో జిమ్ పరికరాలు మరమ్మతులు చేపట్టవలసి ఉన్నా పట్టించుకునేవారు కరువయ్యారని, కమ్యూనిటీ హాల్ నిర్మించినప్పటి నుండి ఇప్పటివరకు వసూలైన డబ్బుల పైన లెక్క పత్రం ఏమాత్రం ఏమి లేదని ఎవరైనా ప్రశ్నించి అడిగితే సామాన్లు కొంటున్నామని తెలుపుచూ దబాయిస్తున్నారని, కనీసం కమ్యూనిటీ హాల్ కరెంటు బిల్లు కూడా చెల్లించకుండా వ్యవహరిస్తున్నారని, ప్రజా ప్రయోజనాల కోసం కాలనీలో నిర్మించబడిన కమ్యూనిటీ హాల్ కాలనీ ప్రజలకు అందరికీ అందుబాటులో ఉండాలి కదా, కమ్యూనిటీ హాలు తాళాలు అధికార పార్టీ నాయకుల చేతుల్లో బంధించుకుని ఉంటే, ఇక్కడున్న కార్పొరేషన్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం స్థానికులకు విస్మయాన్ని కలిగిస్తుందన్నారు. ఇప్పటికైనా కార్పొరేషన్ వచ్చే ఆదాయం గండిపడు తుంటే పై అధికారులు కాపాడి చర్యలు చేపట్టాలని తెలియజేస్తున్నారు.



ఘనంగా మహిళా దినోత్సవం

జీవై ఫౌండేషన్ శేరిలింగంపల్లి



నవతెలంగాణ - కూకట్‌పల్లి

బీజేపీ నాయకులు గజ్జల యోగానంద్ ఆధ్వర్యంలో క్రిస్టల్ గార్డెన్ చందానగర్ లో , అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ జాతీయ నాయకురాలు డీకే అరుణ, సినీ నటి, బీజేపీ నాయకురాలు కవిత, గీత, మూర్తి, చెన్నమనేని స్రవంతిలు పాల్గొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళకు జరుగుతున్న అన్యాయాలు, ఏ విధంగా వివక్షకు గురవుతున్నారు, వారిపై జరుగుతున్న దాడులు, అఘాయిత్యాలపై మాట్లాడుతూ ఎన్ని చట్టాలు వచ్చినా మహిళలకు రక్షణ కరువైందని, పలు అంశాలపై మాట్లాడటం జరిగింది. అనంతరం గజ్జల యోగానంద్ డి కే అరుణ, గీత, మూర్తి, చెన్నమనేని స్రవంతిలను శాలువా కప్పి సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వీణారెడ్డి, శ్యామల, కృష్ణవేణి, శిల్ప రెడ్డి, కాంచన, సుధా భవాని మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

అలీప్, టీఎస్ఐఐసీ ఐలా ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం



నవతెలంగాణ-దుండిగల్

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని అలీప్ ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఈనెల 11న శనివారం అలీప్, టీఎస్ఐఐసీ ఐలా ఆధ్వర్యంలో హోలిస్టిక్ హాస్పిటల్స్ భాగస్వామ్యంతో సీఈడీ బిల్డింగ్ నందు ఉచిత వైద్య శిబిరం (హెల్త్ క్యాంప్) ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తున్నామని, అలీప్ సర్వీస్ సొసైటీ సెక్రెటరీ బి.కవిత రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ వైద్య శిబిరంలో కంటి పరీక్షలు, గుండె సంబంధిత పరీక్షలు, రక్త పరీక్షలు నిర్వహించి మొదటగా వచ్చే 500 మందికి ఉచితంగా మందుల పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలు కుటుంబ భారం మోస్తూ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవట్లేదు అన్నారు. మహిళలు కుటుంబ భారంతో తలమునుకలై ఆరోగ్యంపై తగిన శ్రద్ధ కనబరచకపోవడం వల్ల అనేక రుగ్మతల బారిన పడుతున్నారని, అలాంటి వారి కోసం అలీఫ్‌లో ప్రతి సంవత్సరం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు ఈ అవకాశాన్ని అలీఫ్ ఎంప్లాయిస్‌తోపాటు పరిసర ప్రాంత ప్రజలు తప్పక ఉపయోగించు కోవాలన్నారు.

కుమార్తె వివాహానికి మంత్రి కేటీఆర్‌ను ఆహ్వానించిన జూపల్లి సత్యనారాయణ

నవతెలంగాణ - కూకట్‌పల్లి

కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ కుమార్తె వివాహానికి శుభలేఖ అందించి మంత్రి కేటీఆర్‌ను వివాహానికి ఆహ్వానించిన జూపల్లి



ప్రతి ఒక్కరూ ఆనందంగా ఉండాలి

బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు కోలన్ శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ-దుండిగల్

కామ దహనం తరువాత రోజు కాముని పౌర్ణమిగా పిలవబడే రోజు హోలీ పండుగగా నిర్వహిస్తామని, ప్రతి ఒక్కరు రాగ ద్వేషాలు మరిచిపోయి, అసూయలన్ని మరిచిపోయి, పేద, ధనిక తేడా లేకుండా తమ ఆనందాన్ని రంగుల రూపంలో ఒకరిపై ఒకరు చల్లుకుంటూ అందరూ ఆనందంగా ఉండాలని రాష్ట్ర బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కోలన్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కొలను శ్రీనివాసరెడ్డి రెడ్డి నివాసంలో హోలీ పండుగ సందర్భంగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కేఎస్ఆర్ టీం సభ్యులు సురేష్ , జంగయ్య నేతృత్వంలో కొలను శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి రంగులు చల్లి , సత్కరించి హోలీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజు, శ్రీను, గోపాల్, సురేష్, నరేష్, రాజేందర్, మహేష్, కుమార్ తో పాటు ఇందిరమ్మ కాలనీ బి.శ్రీనివాస్, నరసింహ యాదవ్, ఎన్ఎంసి పరిధిలోని పలువురు మహిళలు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలువురు బంజారా సోదరి మహిళలు కెఎస్ఆర్‌కు హోలీ శుభాకాంక్షలు తెలిపారు.





కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, మహిళలు మంగళవారం ఎమ్మెల్యే కేపి వివేకానంద్ ని ఆయన నివాసం వద్ద మర్యాదపూర్వకంగా కలిసి హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.










- కుటుంబ సభ్యులు, చిన్నారులతో నివాసం వద్ద హోలీ వేడుకలు జరుపుకుంటున్న కార్పొరేటర్ కే.జగన్
- గాజుల రామారం డివిజన్, చిత్తారమ్మ దేవి నగర్‌లో కాలనీ వాసులతో కలిసి హోలీ వేడుకల్లో పాల్గొన్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి.
- హోలీ వేడుకల్లో సంబరాలు చేస్తున్న ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ సభ్యులు
- గాంధీ నగర్‌లో జరిగిన హోలీ పండుగ వేడుకల్లో పాల్గొన్న స్వామి వివేకానంద యువజన సంఘం అధ్యక్షుడు జల్దా లక్ష్మీనాథ్, సాయి గౌడ్, జగన్, వెంకట సాయి, తిమ్మయ్య, నవీన్, విజయ్, శ్రీను,దత్తు గౌడ్

ఉల్లాసంగా, ఉత్సాహంగా హోలీ సంబరాలు

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం హెూలీ పర్వదినాన్ని పురస్కరించుకొని యువతీ, యువకులు, మహిళలు, పురుషులు, చిన్నారులు ఉల్లాసంగా, ఉత్సాహంగా జరుపుకున్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి రింగు బస్తీలోని కార్పొరేటర్ కొలుకుల జగన్ ఆయన నివాసం వద్ద కుటుంబ సభ్యులు, చిన్నారులతో కలిసి సందడి చేశారు. గాజులరామారం డివిజన్ పరిధి చిత్తారమ్మ దేవినగర్‌లో టీపీసీసీ రాష్ట్ర నాయకులు సొంటిరెడ్డి పున్నారెడ్డి కుటుంబ సభ్యులు స్థానిక స్థానికు కాలనీవాసులు మహిళలతో హోలీ వేడుకలు జరుపుకున్నారు. జగద్గిరిగుట్ట ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు హోలీ వేడుకలు సంబరంగా జరుపుకున్నారు.



పూరి: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా, 'జాయ్ ఆఫ్ కలర్' సందేశంతో కళాకారుడు సుదర్శన్ పట్నాయక్ గీసిన సైకత శిల్పం



డబ్ల్యుటిసి ఫైనల్ ఛాన్స్ భారత్‌కే..

న్యూజిలాండ్‌పై శ్రీలంక టెస్ట్ సిరీస్‌ను నెగ్గడం కష్టమే!

అహ్మదాబాద్: ఐసిసి ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్(డబ్ల్యుటిసి) ఫైనల్‌కు చేరే ఛాన్స్ ఎక్కువశాతం భారత్‌వైపే ఉన్నాయి. ఆస్ట్రేలియాజట్టు ఇండోర్ టెస్ట్‌లో భారత్‌ను ఓడించి డబ్ల్యుటిసి ఫైనల్ బెర్త్‌ను ఖాయం చేసుకోగా.. మరో స్థానం కోసం భారత్, శ్రీలంక జట్ల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. తొలి రెండు టెస్టుల్లో గెలిచిన టీమిండియా.. మూడో టెస్ట్‌లో అనూహ్యంగా ఓటమిపాలై డబ్ల్యుటిసి ఫైనల్ బెర్త్ అవకాశాలను సంక్లిష్టం చేసుకుంది. ఈ క్రమంలో గురువారం(9నుంచి) ఆస్ట్రేలియాతో జరిగే నాల్గో టెస్ట్‌లో భారతజట్టు గెలిస్తే సమీకరణాలతో నిమిత్తం లేకుండా నేరుగా ఫైనల్‌కు చేరనుంది. ఒకవేళ ఆ టెస్ట్‌లో భారత్ ఓడినా, కనీసం డ్రా చేసుకున్నా.. శ్రీలంక-న్యూజిలాండ్ జట్ల మధ్య జరిగే టెస్ట్ సిరీస్ ఫలితం కోసం వేచిచూడాల్సి ఉంటుంది. న్యూజిలాండ్‌తో శ్రీలంక రెండు టెస్టు మ్యాచ్‌ల సిరీస్ ఆడేందుకు వెళ్లనుంది. ఆ పర్యటనలో శ్రీలంక జట్టు న్యూజిలాండ్‌తో జరిగే రెండు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌ను 2-0తో క్లీన్‌స్వీప్ చేయాల్సి ఉంటుంది. ఇరుజట్ల మధ్య ఈనెల 9నుంచే క్రైస్ట్‌చర్చ్ వేదికగా తొలి టెస్ట్, 17నుంచి వెల్లింగ్టన్ వేదికగా రెండో టెస్ట్ జరగనుంది. న్యూజిలాండ్ గడ్డపై ఆ జట్టును శ్రీలంక ఓడించడం కత్తిమీద సాము వంటిదే. ఒకవేళ ఆస్ట్రేలియాతో జరిగే నాలుగో టెస్టులోనూ భారత్ ఓటమిపాలై, న్యూజిలాండ్‌పై సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేస్తే శ్రీలంక ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్ తుదిపోరుకు అర్హత సాధిస్తుంది. ఇదిలా ఉండగా.. అహ్మదాబాద్ వేదికగా మార్చి 9 నుంచి భారత్, ఆసీస్ మధ్య నాలుగో టెస్టు ప్రారంభంకానుండగా.. అదేరోజు క్రైస్ట్‌చర్చ్ వేదికగా న్యూజిలాండ్, శ్రీలంక తొలి టెస్టూ జరగనుంది. ఇక జూన్ 7-11 మధ్య లండన్‌లోని ఓవెల్ మైదానంలో డబ్ల్యుటిసి ఫైనల్ జరగనుండగా.. జూన్ 12ను రిజర్వ్ డేగా ఐసిసి ప్రకటించింది.

సమీకరణలు..

1. నాల్గో టెస్ట్‌లో భారత్ గెలిస్తే నేరుగా డబ్ల్యుటిసి ఫైనల్‌కు చేరుతుంది. దీంతో భారత్(60.29%) విజయ శాతాలతో రెండో స్థానంలో నిలుస్తుంది.

మరోవైపు శ్రీలంక(53.33%)తో న్యూజిలాండ్‌పై టెస్ట్ సిరీస్ నెగ్గినా.. మూడోస్థానానికే పరిమితమౌతుంది.

2. నాల్గో టెస్ట్‌ను భారత్ ఓడినా.. డ్రా చేసుకున్నా.. శ్రీలంక జట్టు న్యూజిలాండ్‌పై టెస్ట్ సిరీస్‌ను 2-0తో గెలిస్తే.. భారత్ మూడో స్థానానికి పడిపోయి, శ్రీలంక జట్టు రెండోస్థానానికి ఎగబాకి డబ్ల్యుటిసి ఫైనల్స్‌కు అర్హత సాధిస్తుంది.

3. భారత్ నాల్గో టెస్ట్‌లో ఓడి.. న్యూజిలాండ్ చేతిలో శ్రీలంక సిరీస్‌ను చేజార్చుకున్నా.. టీమిండియాకే ఫైనల్స్ బెర్త్ దక్కనుంది.

4. శ్రీలంక జట్టు న్యూజిలాండ్‌తో టెస్ట్ సిరీస్‌ను 2-0తో క్లీన్‌స్వీప్ చేసుకుంటేను డబ్ల్యుటిసి బెర్త్ దక్కనుంది. రెండు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్ 1-1, 0-0తో డ్రా చేసుకున్నా. 0-2తో పరాజయాన్ని చవిచూసినా భారత్ ఫైనల్లోకి దూసుకెళ్లనుంది.

మైనారిటీలపై చిన్న చూపు

- బడ్జెట్‌లో 38 శాతం తగ్గిన కేటాయింపులు
- 2023-24లో రూ. 3097 కోట్లకు పడిపోయిన వైనం
- కేంద్రంపై మైనారిటీల అసంతృప్తి

న్యూఢిల్లీ : భారత్‌లో మోడీ సర్కారు దేశంలోని మైనారిటీలకు కావాల్సిన భరోసానివ్వడం లేదు. కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వారిని ప్రతి విషయంలోనూ చిన్న చూపు చూస్తున్నది. ఇటీవలి బడ్జెట్‌లోనూ మైనారిటీలకు మొండి చేయే చూపెట్టింది. మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు తక్కువ కేటాయింపులు జరిపింది. వారికి సంబంధించిన పథకాల్లో కోతలు పెట్టింది. దీంతో మోడీ సర్కారుపై దేశంలోని మైనారిటీలు అసంతృప్తిని వ్యక్తం చేశారు.

2022-23బడ్జెట్‌లో కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు మోడీ సర్కారు రూ. 5020.50 కోట్లను కేటాయించింది. అది 2023-24 బడ్జెట్‌లో ఈ ఏడాది 3097 కోట్లుగా ఉన్నది. ఈ తగ్గుదల దాదాపు 38 శాతం కావడం గమనార్హం. 2022-23 సవరణ అంచనా బడ్జెట్ రూ. 2612.66 కోట్లుగా ఉన్నది. అంటే ఈ ఆర్థిక సంవత్సరంలో జరిపిన వాస్తవ కేటాయింపుల కంటే తగ్గుదల 47.9 శాతం కావడం గమనార్హం.

మైనారిటీలకు విద్య, నైపుణ్యాభివృద్ధికి బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గడం ఆందోళనకరం.



మైనారిటీలకు ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్‌లో దాదాపు రూ. 900 కోట్ల కోత (69.6 శాతం తగ్గుదల) నమోదు కాగా, మెరిట్-కమ్-మీన్స్ స్కాలర్‌షిప్ దాదాపు 88 శాతం తగ్గింది. యూపీఎస్సీ, ఎస్-ఎస్సీ, రాష్ట్ర పీఎస్సీల ప్రిలిమినరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన మైనారిటీ విద్యార్థులకు బడ్జెట్‌లో ఒరిగింది ఏమీ లేదు. గతేడాది ఈ కేటాయింపులు రూ. 8 కోట్లుగా ఉన్నాయి.

మైనారిటీలకు ఉచిత కోచింగ్, అనుబంధ పథకాలు మరియు మైనారిటీల విద్యా సాధికారత కోసం కేటాయింపులు వరుసగా 62 శాతం, 32.8 శాతం తగ్గాయి. నైపుణ్యాభివృద్ధి మరియు జీవనోపాధి 2022-23లో రూ. 491 కోట్ల నుంచి 2023-24లో రూ.64.4 కోట్లకు భారీగా (86.8శాతం తగ్గుదల) పడిపోయింది. మైనారిటీ వర్గాలకు చెందిన రీసెర్చ్ స్కాలర్‌లకు ఆర్థిక సాయం అందించే మౌలానా ఆజాద్ నేషనల్ ఫెలోషిప్ (ఎంఏఎన్ఎఫ్) 2022లో నిలిపివేయబడింది.

	2022-23	2023-24	వ్యత్యాసం	(రూ.కోట్లలో) (రూ.కోట్లలో)
మొత్తం కేటాయింపులు	5020.5	3097		38శాతం తగ్గుదల
ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్	1425	433		69.60శాతం తగ్గుదల
పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్	515	1065		106.79శాతం పెరుగుదల
మెట్రిక్ కమ్ మీన్స్ స్కాలర్‌షిప్	365	44		87.94శాతం తగ్గుదల
ఉచిత శిక్షణ మరియు అనుబంధ పథకాలు	79	30		62 శాతం తగ్గుదల
నైపుణ్యాభివృద్ధి, జీవనం	491	64.4		86 శాతం తగ్గుదల
పరిశోధనా పథకాలు	41	20		51 శాతం తగ్గుదల
మదర్సా మరియు మైనారిటీ విద్యా పథకం	160	10		93.75శాతం తగ్గుదల
పీఎంజేవీకే	1650	600		63.63శాతం తగ్గుదల

లానింగ్ మెరుపులు

వర్షంతో మ్యాచ్‌కు అంతరాయం

ముంబయి: మహిళల ప్రీమియర్ లీగ్(డబ్ల్యుపిఎల్)లో భాగంగా యుపి వారియర్స్‌తో మంగళవారం జరిగిన పోటీలో ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ మెగ్ లానింగ్ ఆకాశమే హద్దుగా చెలరేగి ఆడింది. చివర్లో జొన్నాసెన్, రోడ్రిగ్స్ మెరుపులు మెరిపించడంతో ఢిల్లీ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 211పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. లానింగ్ కేవలం 42బంతుల్లోనే 10ఫోర్లు, 3 సిక్సర్ల సాయంతో 70 పరుగులు చేసిన లానింగ్.. చివర్లో జొన్నాసెన్(42నాటౌట్), రోడ్రిగ్స్(34) బ్యాటింగ్‌లో రాణించారు. ఈ మ్యాచ్‌కు వరుణుడు అడ్డు తగిలాడు. 9 ఓవర్లు పూర్తయ్యాక వర్షం ప్రారంభం కావడంతో మ్యాచ్ కొంతసేపు నిలిచిపోయింది. ఆ సమయానికి ఢిల్లీ వికెట్ నష్టానికి 87 పరుగులు చేసింది. లానింగ్ 53, మరిజన్ కాప్ 9 పరుగులతో క్రీజులో ఉన్నారు. టాస్ గెలిచిన వారియర్స్.. ఢిల్లీని బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. ఓపెనర్లు మెగ్ లానింగ్, షెఫాలీ వర్మ ఇన్నింగ్స్‌ను ధాటిగానే ప్రారంభించారు. కెప్టెన్ లానింగ్ బ్యాట్‌తో రెచ్చిపోతే, షెఫాలీ ఆమెకు అండగా నిలుస్తూ పరుగులు రాబట్టింది. ఇద్దరూ కలిసి తొలి వికెట్‌కు 67 పరుగులు జోడించాక తహ్లియా బౌలింగులో కిరణ్‌కు క్యాచ్ ఇచ్చి షెఫాలీ అవుటైంది. 14 బంతులు ఆడిన షెఫాలీ ఫోర్, సిక్సర్‌తో 17 పరుగులు చేసింది. మరోవైపు లానింగ్ 34 బంతుల్లో 7ఫోర్లు, 3సిక్సర్లతో అర్ధ సెంచరీని పూర్తి చేసుకుంది. చివర్లో జొన్నాసెన్(42నాటౌట్; 20బంతుల్లో 3ఫోర్లు, 3 సిక్సర్లు), రోడ్రిగ్స్(34నాటౌట్; 4ఫోర్లు) ధాటిగా బ్యాటింగ్ ఆడడంతో స్కోర్‌బోర్డు పరుగెత్తింది. ఇస్మాయిల్, రాజేశ్వరి గైక్వాడ్, తహ్లియా, సోఫీకి ఒక్కో వికెట్ దక్కాయి.



ఉమెన్స్ డే సందర్భంగా..

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం (ఈ నెల 8న) జరిగే డబ్ల్యూపీఎల్ మ్యాచ్ టికెట్లను ఉచితంగా అందించనున్నట్లు బీసీసీఐ ప్రకటించింది. డబ్ల్యూపీఎల్‌లో మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్లు తెలిపింది. ఈ సందర్భంగా ముంబయి వేదికగా జరిగే రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు వర్సెస్ గుజరాత్ జెయింట్స్ మ్యాచ్ టిక్కెట్లు ఉచితంగా అందించనున్నట్లు తెలిపింది. ఉమెన్ ప్రీమియర్ లీగ్ మ్యాచ్‌లకు మహిళా ప్రేక్షకులను ఇప్పటికే ఉచితంగా అనుమతిస్తోంది.

షకీబ్ అరుదైన రికార్డు..

- వన్డేల్లో 300 వికెట్లు తీసిన తొలి బంగ్లా బౌలర్

ఢాకా: బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ షకీబ్ అల్ హసన్ ఓ అరుదైన రికార్డు సాధించాడు. వన్డేల్లో 300 వికెట్ల మైలురాయిను అందుకున్న తొలి బంగ్లా బౌలర్‌గా షకీబ్ ఈ ఫీట్‌ను అందుకున్నాడు. చిట్టగాంగ్ వేదికగా ఇంగ్లండ్‌తో జరిగిన మూడో వన్డేలో రెహాన్ అహ్మద్ వికెట్‌ని పడగొట్టడం ద్వారా.. షకీబ్ ఈ 300 వికెట్ల మార్క్‌ని సాధించాడు. ఫలితంగా.. ఈ ఘనత సాధించిన తొలి బంగ్లాదేశ్ బౌలర్‌గా షకీబ్ రికార్డు సాధించాడు. ఇంతకుముందు బంగ్లాదేశ్ క్రికెట్ చరిత్రలో కేవలం ఇద్దరు ఆటగాళ్లు మాత్రమే 200కు పైగా వన్డే వికెట్లు సాధించారు.



మీ ప్రేమ, ఆదరణే కారణం : ఎం.ఎం.శ్రీలేఖ



హై కోర్టు న్యాయమూర్తి నంద, ఎం.ఎం.శ్రీలేఖ

ఎం.ఎం శ్రీలేఖ.. తన 9వ ఏటనే నేపథ్యగానం చేసి, ఆ తరువాత 12 సంవత్సరాల వయసులో దాసరి దర్శకత్వంలో వచ్చిన 'నాన్నగారు' సినిమాతో సంగీత దర్శకులుగా పరిచయం అయ్యారు.

5 భాషల్లో 80 సినిమాలకు పైగా సంగీతం అందించిన ఏకైక మహిళా మ్యూజిక్ డైరెక్టర్‌గానే కాకుండా ఆమె సినిమా రంగంలోకి వచ్చి 25 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం విశేషం.

ఈ సందర్భంగా భారతదేశంతోపాటు ఖతార్, యు.ఏ.ఈ, బహ్రెయిన్, కువైట్, ఒమన్, నార్వే, యుకె, ఐర్లాండ్, ఫ్రాన్స్, జర్మనీ, నెదర్లాండ్స్, స్వీడెన్, ఫిన్ ల్యాండ్, సౌత్ ఆఫ్రికా, టాంజానియా, నైజీరియా, యు యస్ ఏ, కెనడా, సింగపూర్, మలేసియా, హాంగ్ కాంగ్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ ఇలా 25 దేశాల్లో 25 సింగర్స్‌తో ఈ నెల 17 నుండి వరల్డ్ మ్యూజిక్ టూర్ ప్రోగ్రాం స్టార్ట్ చేయనున్నారు. ఈ సందర్భంగా ఎఫ్ఎన్‌సిసి కల్చరల్ సెంటర్‌లో గ్రాండ్‌గా సెలెబ్రేషన్స్ జరుపుకున్నారు. 'తన అన్నయ్య కీరవాణి మ్యూజిక్‌లో ఆస్కార్ అందుకోబోతుండగా ఆయన లాగే శ్రీ లేఖ కూడా ఆస్కార్ అంతటి అవార్డు అందుకోవాలని కోరుకుంటున్నాను' అని రచయిత, దర్శకుడు విజయేంద్ర ప్రసాద్ చెప్పారు. సంగీత దర్శకుడు కోటి మాట్లాడుతూ, 'ఎం.ఎం. శ్రీ లేఖ మంచి మ్యూజిక్ కంపోజర్, మంచి సింగర్. తను చేస్తున్న 25 వరల్డ్ మ్యూజిక్ టూర్ బిగ్ సక్సెస్ అవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అని అన్నారు.

ఎం.ఎం.శ్రీ లేఖ మాట్లాడుతూ, 'సంగీత రంగంలోని స్ట్రగుల్స్ గురించి నేను మ్యూజిక్ డైరెక్టర్ అయ్యాక బాగా తెలిసింది. నేను సక్సెస్ ఫుల్ మ్యూజిక్ డైరెక్టర్‌గా ఉన్నానంటే నా తండ్రులు, మా చిన్నాన్న విజయేంద్రప్రసాద్, డాక్టర్ రామకృష్ణ ముఖ్య కారణం. నా 25 సంవత్సరాల ప్రయాణంలో నన్ను ఆదరించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. ఇన్నేండ్ల నా జర్నీలో సహకరించిన సింగర్స్, కంపోజర్స్, లిరిసిస్ట్‌ అందరికీ థ్యాంక్స్. నన్ను నమ్మి 25 దేశాలలో పాటలు పాడే అవకాశం ఇచ్చిన రవి కుమార్ మండకి, శ్యామ్ బాబు గంధంకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు' అని తెలిపారు.

కన్యాకుమారి.. ఓ గ్రామీణ ప్రేమకథ

ఆనంద్ దేవరకొండ హీరోగా 'పుష్పక విమానం' సినిమాని రూపొందించి అందర్నీ ఆకట్టుకున్నారు దర్శకుడు దామోదర. తాజాగా ఆయన విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్ మూవీని తెరకెక్కిస్తున్నారు. ఆయన స్వీయదర్శకత్వంలో ర్యాడికల్ పిక్చర్స్ బ్యానర్ పై రూపొందుతున్న ఈ చిత్రానికి 'కన్యాకుమారి' అనే టైటిల్‌ను ఫిక్స్ చేసి, ఫస్ట్ లుక్ పోస్టర్‌ని విడుదల చేశారు. 'పుష్పక విమానం'లో ఓ హీరోయిన్‌గా నటించిన గీతా సైనీ, శ్రీ చరణ్ రాచకొండ జంటగా ఇందులో నటిస్తున్నారు. ఈ కథను శ్రీకాకుళం నేపథ్యంలో సాగే గ్రామీణ ప్రేమకథా చిత్రంగా దామోదర రూపొందిస్తున్న ఈ సినిమా ప్రస్తుతం చివరి షెడ్యూల్ చిత్రీకరణ జరుపుకుంటోంది. త్వరలోనే దీన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ఈ చిత్రానికి ఎడిటర్: నరేష్ అడుపా, సంగీతం: సాహిత్య సాగర్, సినిమాటోగ్రఫీ : శివ గాజుల, సహ నిర్మాతలు : సతీష్ రెడ్డి, వరీనియా మామిడి, సిద్దార్థ్ ఏ, నిర్మాత, మాటలు, దర్శకత్వం : దామోదర.



గీతా సైనీ

క్లీన్ కామెడీ



అభిషేక్ రెడ్డి పచ్చిపాలా

అభిషేక్ రెడ్డి పచ్చిపాలా, నాజియా, జబర్దస్త్ ఫణి ముఖ్య పాత్రలు పోషిస్తున్న చిత్రం 'జస్ట్ ఏ మినిట్'. రెడ్ స్వాన్ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై కార్తీక్ ధర్మపురి సహకారంతో పూర్ణస్ యస్వంత్ దర్శకత్వం వహిస్తున్నారు. అర్షద్ తస్వీర్ స్టోరీ, స్క్రీన్ ప్లే అందిస్తున్నారు.

'ఏడు చేపల కథ' సినిమాతో టెంప్ట్ రవిగా పరిచయం అయిన అభిషేక్‌రెడ్డి 'ఆవు పులి మధ్యలో ప్రభాస్ పెళ్లి', 'వైఫ్‌ఐ' చిత్రాల తర్వాత క్లీన్ కామెడీ కంటెంట్‌తో ఉన్న ఈ సినిమాతో రానున్నారు. ప్రేక్షకులు బాగా ఆదరించిన 'బులెట్ బండి సాంగ్' మ్యూజిక్ డైరెక్టర్ ఎస్ కే బాజీ ఈ చిత్రానికి మ్యూజిక్ డైరెక్షన్ వహించారు. ఈ సినిమా చిత్రీకరణ పూర్తయ్యింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ జరుగుతోంది. ఈ మూవీ టైటిల్‌కి 17 ఏళ్ల రేయాన్ మ్యూజిక్ ఇవ్వటం విశేషం. ఇప్పటికే విడుదలైన మోషన్ పోస్టర్, యూట్యూబ్ షార్ట్స్ వైరల్ అవుతున్నాయి. ఈ చిత్రానికి ప్రొడ్యూసర్ : డా॥ ప్రకాష్ ధర్మపురి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ : సూరి శ్రీ ఇనగంటి, సినిమాటోగ్రాఫర్ : అమీర్, ఎడిటర్ : దుర్గా నరసింహా.

నవచిత్రం

లాల్ సలాంలో కీలక పాత్ర



రజనీకాంత్

లైకా ప్రొడక్షన్స్ నిర్మాణ సంస్థలో ఐశ్వర్య రజనీకాంత్ దర్శకత్వంలో 'లాల్ సలాం' సినిమా రూపొందుతోంది. ఇటీవల పూజా కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ హోలీ సందర్భంగా సోమవారం రోజు ప్రారంభమైంది. విష్ణు విశాల్, విక్రాంత్ హీరోలుగా నటిస్తున్న ఈ చిత్రంలో రజనీకాంత్ కీలక పాత్రలో కనిపించబోతున్నారు.

ఈ సందర్భంగా లైకా ప్రతినిధులు మాట్లాడుతూ, 'ఇందులో ఓ పవర్‌ఫుల్ పాత్ర ఉంది. దాన్ని నెక్స్ట్ లెవల్‌కు తీసుకెళ్లే గొప్ప నటుడు కావాలని రజనీకాంత్‌ని రిక్వెస్ట్ చేశాం. మాతో ఉన్న అనుబంధంతో ఆయన ఈ రోల్‌లో నటించటానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఎనిమిదేళ్ల తర్వాత ఐశ్వర్య రజనీకాంత్ మళ్లీ మెగా ఫోన్ పట్టారు. ఈ చిత్రానికి ఆస్కార్ విన్నర్ ఎ.ఆర్.రెహమాన్ సంగీతాన్ని సమకూరుస్తుండగా, విష్ణు రామస్వామి సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు' అని చెప్పారు. ఈ చిత్రానికి స్క్రీన్ ప్లే, దర్శకత్వం: ఐశ్వర్య రజనీకాంత్, నిర్మాత: సుభాస్కరన్, ఎడిటింగ్: బి.ప్రవీణ్ భాస్కర్, ఆర్ట్: రాము తంగరాజ్. ఇదిలా ఉంటే, రజనీ కాంత్ ప్రస్తుతం 'జైలర్' చిత్రంలో నటిస్తున్నారు. అలాగే 'జై భీమ్' దర్శకుడు జ్ఞానవేల్ దర్శకత్వంలో ఓ సినిమా చేసేందుకు ఇటీవల గ్రీన్‌సిగ్నల్ కూడా ఇచ్చారు. అలాగే మరో పవర్‌ఫుల్ ప్రాజెక్ట్‌కి కూడా ఆయన పచ్చజెండా ఊపేందుకు సిద్ధంగా ఉన్నారని సమాచారం.

నిర్మాత మధు మంతెనకు పితృవియోగం



మధు మంతెన

బాలీవుడ్‌లో భారీ చిత్రాలను నిర్మించిన తెలుగు నిర్మాత మధు మంతెన తండ్రి, డైరెక్టర్ రామ్ గోపాల్ వర్మ మేనమామ నిర్మాత మురళీ రాజు (70) కన్ను మూశారు.

గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్ మధురానగర్‌లోని స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. భీమవరానికి చెందిన మురళీ రాజు నిర్మాతగా పలు చిత్రాలను నిర్మించారు. అలాగే సినీ నిర్మాణమే కాకుండా పలు వ్యాపారాలను కూడా ఆయన కొనసాగించారు. మురళీ రాజుకు ఇద్దరు సంతానం. అందులో ఒకరు నిర్మాత మధు మంతెన కాగా, కూతురు అంబిక.

నిర్మాత మధు మంతెన తెలుగులో 'గజని', 'రక్త చరిత్ర 1, 2' చిత్రాలతోపాటు బాలీవుడ్, ఇతర భాషలలో సుమారు 34కు పైగా చిత్రాలను నిర్మించారు. నిర్మాత అల్లు అరవింద్, హీరో అల్లు అర్జున్, డైరెక్టర్ క్రిష్, నిర్మాత బన్నీ వాసు తదితరులతోపాటు బాలీవుడ్ స్టార్ హీరో ఆమిర్ ఖాన్ తదితరులు మురళీ రాజు భౌతిక కాయాన్ని సందర్శించి, నివాళి అర్పించారు. బుధవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

ప్రయోగాత్మక ప్రయత్నం




రానా, వెంకటేష్

బాబాయ్, అబ్బాయ్ వెంకటేష్, రానా తండ్రీకొడుకులుగా తొలిసారి కలిసి నటిస్తున్న ప్రాజెక్ట్ 'రానా నాయుడు'. తండ్రి కొడుకుల వార్ బ్యాగ్ డ్రాప్‌లో సాగే ఈ ప్రాజెక్ట్‌ని సుందర్ ఆరోన్, లోకోమోటివ్ గ్లోబల్ నిర్మించగా, కరణ్ అన్షుమాన్, సుపర్ణ్ ఎస్.వర్మ దర్శకత్వం వహించారు.

ఈనెల 10న 'రానా నాయుడు' నెట్‌ఫ్లిక్స్‌లో ప్రీమియర్ కానున్న నేపథ్యంలో హైదరాబాద్‌లో జరిగిన ప్రెస్‌మీట్‌లో రానా మాట్లాడుతూ, 'ఇలాంటి ప్రాజెక్ట్ నాకు, బాబాయ్‌కి కొత్త. దీని కోసం బాబాయ్‌తో మొదటి రోజు పని చేయడం నాకు ఇప్పటికీ గుర్తుంది. మర్చిపోలేని అనుభూతి ఇది. నేను ఇప్పటి వరకూ పాజిటివ్, నెగిటివ్ రోల్స్ చేశాను. కానీ ఇందులో ఆ రెండూ ఉన్నాయి' అని చెప్పారు. 'ట్రైలర్‌కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఇందులో కొత్తగా చేయడానికి చాలా స్కోప్ దొరికింది. ఇలాంటి పాత్రని గతంలో ఎన్నడూ చేయలేదు. రానాతో తొలిసారి స్క్రీన్‌ను పంచుకోవడం హైలెట్. హైదరాబాద్‌ల్ ఉన్న ఓ కుటుంబం ముంబై వెళ్లి అక్కడ గ్యాంగ్‌స్టర్ పనులు చేస్తే ఎలా ఉంటుందో అనే ఆసక్తికరమైన అంశాలు ఇందులో ఉంటాయి. నిజంగా ఇదొక ప్రయోగాత్మకమైన ప్రయత్నం. దర్శకులు కరణ్, సుపర్ణ్ వర్మతో గ్రేట్ జర్నీ. పది ఎపిసోడ్‌లు ఉన్నాయి. ఎమోషనల్ సీన్స్ చాలా కొత్తగా, పవర్ ఫుల్‌గా ఉంటాయి' అని వెంకటేష్ అన్నారు.

మంచి కథతో పరారీ



యోగేశ్వర్, అతిథి

'పరారీ' మూవీ పోస్టర్‌ను ఫిలిం ఛాంబర్ అధ్యక్షులు బసిరెడ్డి ఆవిష్కరించారు. చిత్ర టీజర్‌ను ప్రొడ్యూసర్ కౌన్సిల్ అధ్యక్షులు దామోదర్ ప్రసాద్ రిలీజ్ చేశారు. శ్రీ శంకర ఆర్ట్స్ బ్యానర్ పై గాలి ప్రత్యూష సమర్పణలో యోగేశ్వర్, అతిథి జంటగా ఈ సినిమా రూపొందుతోంది. సాయి శివాజీ దర్శకత్వంలో జివివి గిరి నిర్మిస్తున్న ఈ చిత్రం ఈనెల 30న ప్రపంచ వ్యాప్తంగా రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో ఫిలిం ఛాంబర్‌లో ఈ చిత్ర పోస్టర్, సెకెండ్ టీజర్‌ను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా నిర్మాత జి వి వి గిరి మాట్లాడుతూ,'చక్రి తమ్ముడు మహిత్ అద్భుతమైన సంగీతాన్ని అందించారు. ఇందులో సుమన్ మంచి క్యారెక్టర్ చేశారు. అలీ, షయాజీ షిండే, మకరంద్ దేశ ముఖ్ కీలక పాత్రల్లో నటించారు. మంచి కథ, కథనాలతో తెరకెక్కిన ఈ చిత్రం అందరినీ మెప్పిస్తుంది' అని అన్నారు 'హీరో యోగేశ్వర్ అనుభవం ఉన్న ఆర్టిస్టులా నటించాడు. సినిమాలో పాటలు అన్ని బాగా వచ్చాయి. ఈ సినిమాతో నాకు మంచి పేరు వస్తుంది. సినిమా పెద్ద హిట్ అవ్వాలి' అని సంగీత దర్శకుడు మహిత్ నారాయణ్ చెప్పారు.

గీత సాక్షిగా.. ఏం జరిగింది?

నిజ ఘటనలు ఆధారంగా రూపొందిన ఇన్‌టెన్స్ ఎమోషనల్ డ్రామా 'గీత సాక్షిగా'. ఆదర్శ్, చిత్రా శుక్లా జంటగా నటించారు. హోలీ సందర్భంగా సోమవారం రోజు మేకర్స్ ప్రేక్షకులందరికీ హోలీ శుభాకాంక్షలను తెలియజేస్తూ ఈ సినిమాను ఈనెల 22న తెలుగు, హిందీ భాషల్లో విడుదల చేయబోతున్నట్లు ప్రకటిస్తూ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. పోస్టర్‌లో 'గీత సాక్షిగా జడ్జ్‌మెంట్ డే మార్చి 22న' అని తెలియజేశారు. 'మా చిత్రం తెలుగుతో పాటు హిందీలోనూ రిలీజ్ అవుతుంది. మంచి సినిమాలను ప్రేక్షకులు ఎప్పటికీ ఆదరిస్తారని 'గీత సాక్షిగా' మరోసారి ప్రూవ్ చేస్తుందనే నమ్మకం ఉంది. నిజ జీవిత సంఘటనల ఆధారంగా ప్రేక్షకులకు మంచి కంటెంట్ ఓరియెంటెడ్ సబ్జెక్ట్‌ను అందించబోతున్నాం. సినిమాలో చరిష్మా కీ రోల్ పోషించింది. ఆమె చుట్టూనే సినిమా కథాంశం తిరుగుతుంటుంది' అని మేకర్స్ తెలిపారు. శ్రీకాంత్ అయ్యంగార్, రూపేష్ శెట్టి, చరిష్మా, భరణి శంకర్, జయలలిత, అనితా చౌదరి, రాజా రవీంద్ర తదితరులు ఇతర కీలక పాత్రల్లో నటించారు. 'గీత సాక్షిగా' చిత్రాన్ని ఆంథోని మట్టిపల్లి స్క్రీన్‌ప్లే రాసుకుని, చక్కగా తెరకెక్కించారు. చేతన్ రాజ్ ఫిలింస్ బ్యానర్‌పై చేతన్ రాజ్ ఈ సినిమాను నిర్మించటమే కాకుండా స్టోరీ కూడా రాశారు.



చిత్రా శుక్లా

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

నవతెలంగాణ

బిజినెస్

మెటాలో మళ్లీ వేలాది సిబ్బందికి ఉద్వాసన..!



వాషింగ్టన్ : ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటా మరో మారు వేలాది మంది ఉద్యోగులను ఇంటికి పంపించనుంది. వచ్చే వారం లోనే ఈ తొలగింపులు ఉండొచ్చని బ్లూమ్‌బర్గ్ రిపోర్ట్ చేసింది. ఆర్థిక వ్యవస్థల్లో మందగింపు, ఆదాయాలు తగ్గడంతో టెక్ కంపెనీలు పొదుపు చర్యలకు దిగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే గతేడాది నవంబర్‌లోనూ మెటాలో 13 శాతానికి సమానమైన 11,000 మంది ఉద్యోగులను తొలగించింది. తాజాగా మరో సారి వేటు వేయనుందని తెలుస్తోంది. ఎవర్ని తొలగించాలో చెప్పాలంటూ డైరెక్టర్లు, వైస్ ప్రెసిడెంట్లు, ఉన్నతాధికారుల నుంచి సమాచారాన్ని సేకరిస్తుంది. వచ్చే వారంలోనే ఈ ఉద్వాసనలు ఉండొచ్చని రిపోర్టులు వస్తున్నాయి. మేనేజర్లకు ప్యాకేజీ ఇచ్చి పంపించడానికి ఇప్పటికే ప్రక్రియను ప్రారంభించింది. ఉద్యోగులకు పింక్ స్లిప్‌లు జారీ చేసేందుకు సిద్ధమయ్యిందని సమాచారం. మెటా చీఫ్ జూకర్‌బర్గ్ ఆర్థిక లక్ష్యాలను చేరుకోవడానికి తొలగింపులు తప్పడం లేదని ఓ ఉద్యోగి పేర్కొన్నారు.

వ్యయాలను తగ్గించుకోవడానికి వేలాది మంది ఉద్యోగులను ఇంటికి పంపిస్తున్న మెటా తమ సిఇఒకు మాత్రం ఇటీవల భారీ మొత్తంలో చెల్లింపులు పెంచాలని నిర్ణయించింది. మెటా సిఇఒ మార్క్ జూకర్‌బర్గ్ సెక్యూరిటీ అలవెన్స్‌ను ఏకంగా 14 మిలియన్ డాలర్లకు (దాదాపు రూ.115 కోట్లు) పెంచింది. ఇంతక్రితం ఈ అలవెన్స్ 4 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.33 కోట్లు)గా ఉంది. ఓ వైపున ఉద్యోగులను తొలగిస్తూ.. మరోవైపు కంపెనీ బాస్ ఇంత ప్యాకేజీని పెంచుకోవడం గమనార్హం. 2021లో జూకర్‌బర్గ్ అన్ని రకాల పరిహారాలను కలుపుకొని 27 మిలియన్ డాలర్ల (రూ.223 కోట్లు) వేతనాన్ని అందుకున్నారు.

స్టార్టప్‌లకు తగ్గిన నిధులు

- ఫండింగ్ ఒప్పందాల్లో 65 శాతం పతనం



బెంగళూరు: దేశంలోని స్టార్టప్‌లకు నిధుల సమీకరణ తగ్గింది. ప్రస్తుత ఏడాది ఫిబ్రవరిలో స్టార్టప్ ఫండింగ్ ఒప్పందాలు ఏకంగా 65 శాతం పడిపోయాయని ప్రయివేటు మార్కెట్ ఇంటిలిజెన్స్ కంపెనీ అయినా వెంచర్ ఇంటిలిజెన్స్ ఓ రిపోర్టులో తెలిపింది. 2023 జనవరిలో 62 డీల్‌లు, 2022 ఫిబ్రవరిలో 123 ఒప్పందాలతో పోలిస్తే గడిచిన ఫిబ్రవరిలో ఏకంగా 42 ఒప్పందాలు మాత్రమే జరిగాయి. మరోవైపు 2022 ఫిబ్రవరిలో స్టార్టప్‌లు ఏకంగా 4 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.3.2 లక్షల కోట్లు) సమీకరించగా.. గడిచిన ఫిబ్రవరిలో 536 మిలియన్ డాలర్లు (రూ.43వేల కోట్లు) మాత్రమే పొందగలిగాయి. క్రితం నెలలో టెక్నలాజీ రంగంలో అత్యధికంగా 16 స్టార్టప్ ఫండింగ్ ఒప్పందాలు జరిగాయి. వచ్చే కొన్ని నెలల పాటు పరిస్థితి ఇలాగే ఉండొచ్చని వెంచర్ ఇంటిలిజెన్సీ ఫౌండర్ అరుణ్ నట్రాజన్ పేర్కొన్నారు. నిధుల కొరత తీవ్రమవుతున్న క్రమంలోనూ స్టార్టప్ వ్యవస్థలో విలీనం, కొనుగోలు కార్యకలాపాలు కూడా బలంగా కొనసాగాయన్నారు. 2023 మొదటి రెండు నెలల్లో, భారతీయ స్టార్టప్ పర్యావరణ వ్యవస్థలో 10 విలీన, సంలీన ఒప్పందాలు జరిగాయన్నారు. రంగాల వారీగా ప్రభావం పరంగా ఫిన్‌టెక్, డి2సి ఇ-కామర్స్ సంస్థలు కొన్ని వ్యూహాత్మక సముపార్జనలను చూడగలవని నట్రాజన్ పేర్కొన్నారు. ఐటిసి వంటి పెద్ద కంపెనీలు సహా, ఇ కామర్స్ కంపెనీలు కూడా మంచి బ్రాండ్‌లను కొనుగోలు చేయడానికి వెతుకుతున్నాయన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ, టెక్ రంగంలో కీలకంగా మారుతోన్న స్టార్టప్ సంస్థలు గడ్డుకాలాన్ని ఎదుర్కొంటున్నాయని ఇటీవల పలు రిపోర్టులు వచ్చాయి. నిధులు లభ్యత తగ్గిపోయి.. నిరాశను చవి చూస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు ఇస్తున్న ప్రాధాన్యత ఈ చిన్న సంస్థలకు ఇవ్వడం లేదనే విమర్శలు నెలకొన్నాయి.

కర్నూల్‌లో పవర్ గ్రిడ్ పెట్టుబడులు

- రూ.4,071 కోట్లకు ఆమోదం



న్యూఢిల్లీ: దేశంలో రెండు ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టుల కోసం ప్రభుత్వ రంగంలోని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ రూ.4,071 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు తెలిపింది. దీనికి సోమవారం పవర్ గ్రిడ్ బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ ఆమోదం తెలిపారని ఆ కంపెనీ బిఎస్ఇ ఫైలింగ్‌లో తెలిపారు. కర్నూల్ విండ్ ఎనర్జీ జోన్ / సోలార్ ఎనర్జీ జోన్ (ఎపి) పార్ట్ ఎ, పార్ట్ బి కోసం రూ.3,546.94 కోట్లు వ్యయం చేయనున్నట్లు తెలిపింది. 2024 నవంబర్ ఈ ప్రాజెక్టులు పూర్తి కానున్నాయని వెల్లడించింది. అదే విధంగా ఈస్టర్న్ రీజియన్ విస్తరణ స్కీమ్‌కు రూ.524.04 కోట్ల వ్యయం చేయనున్నాట్లు తెలిపింది. ఈ ప్రాజెక్టు నవంబర్ 2025 నాటికి అందుబాటులోకి రానుందని పేర్కొంది.

ఉమెన్‌నోవెటర్‌తో అమెజాన్ జట్టు

- 200 విక్రేతలకు గ్లోబల్ గుర్తింపు

న్యూఢిల్లీ: దేశంలో 200 మంది మహిళా పారిశ్రామికవేత్తల ఉత్పత్తులకు ప్రపంచస్థాయి గుర్తింపు ఇవ్వడానికి గ్లోబల్ ఇంక్యుబేటర్ అయిన 'ఉమెన్‌నోవేటర్'తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు అమెజాన్ ఇండియా తెలిపింది. అమెజాన్ రానున్న 24 నెలల పాటు నిర్వహించనున్న తన ఇ-కామర్స్ ఎగుమతుల కార్యక్రమం గ్లోబల్ సెల్లింగ్‌లో విక్రేతలుగా 'ఉమెన్నో వేటర్'లో 200 మంది మహిళా వ్యాపారవేత్తలను ఆన్‌బోర్డ్ చేయనున్నట్లు పేర్కొంది. దేశం నుంచి గ్లోబల్ బ్రాండ్‌లను రూపొందించేందుకు మహిళా పారిశ్రామికవేత్తలకు ఈ భాగస్వామ్యం ఈ సహాయం చేస్తుందని పేర్కొంది. ఇందు కోసం మహిళ ఔత్సాహికవేత్తలతో కలిసి పని చేయనున్నట్లు తెలిపింది.

200 స్టోర్లకు విస్తరించిన అసుస్

న్యూఢిల్లీ : ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ అసుస్ ఇండియా 200 స్టోర్లకు విస్తరించినట్లు ప్రకటించింది. న్యూఢిల్లీలోని నెహ్రూ ప్యాలెస్ వద్ద కొత్త స్టోర్‌ను తెరవడం ద్వారా ఈ మైలురాయికి చేరినట్లు తెలిపింది. వినియోగదారులకు కావాల్సిన పిసిలు, గేమింగ్ ల్యాప్‌టాప్‌లు, ఆల్ ఇన్ ఒన్ డెస్క్‌టాప్‌లు, ఇతర యాక్ససరీలను ఇక్కడ ప్రదర్శన, అమ్మకానికి ఉంచినట్లు అసుస్ ఇండియా బిజినెస్ హెడ్ అర్నాల్డ్ సు పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా తమ రిటైల్ కార్యక్రమాలను వృద్ధి చేయడంతో పాటుగా భారతీయ మార్కెట్ పట్ల బ్రాండ్ నిబద్ధతను సైతం వెల్లడిస్తుందన్నారు. దేశంలో అసుస్ 2020లో 50 స్టోర్లను మాత్రమే కలిగి ఉండగా.. 2023 నాటికి ఆ సంఖ్య 200కు చేరిందన్నారు.

ప్రధానితో బిల్‌గేట్స్ భేటీ

న్యూఢిల్లీ : ప్రధాని మోడితో మైక్రోసాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్ శనివారం భేటీ అయ్యారు. ఆరోగ్య రంగం, పర్యావరణ మార్పులు వంటి కీలక అంశాలపై ఇరువురూ చర్చించారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ప్రధానితో భేటీ వివరాల గురించి గేట్స్ తన అధికారిక బ్లాగ్‌లో రాశారు. భారత్ అన్ని రంగాల్లో రాణిస్తోందని పేర్కొన్నారు. భారత్ ఎంతో సమర్థమైన, భద్రమైన, అందుబాటు ధరల్లో ఉండే అనేక వ్యాక్సిన్లను పెద్ద మొత్తంలో ఉత్పత్తి చేసిందన్నారు.

జూమ్ ప్రెసిడెంట్‌కు ఉద్వాసన



వాషింగ్టన్ : టెక్ కంపెనీల్లో ఇటీవల క్రింది నుంచి పై స్థాయి వరకు వేలాది ఉద్యోగుల తొలగింపులను చూస్తున్నాము. కానీ.. ఈ సారి ఏకంగా ఓ టెక్ దిగ్గజం ప్రెసిడెంట్ పదవికే ఎసరు రావడం విశేషం. ప్రముఖ వీడియో కాన్ఫరెన్సింగ్ సంస్థ 'జూమ్' ఎలాంటి కారణం లేకుండానే ఆ కంపెనీ ప్రెసిడెంట్ గ్రెగ్ టొంబ్‌కు ఉద్వాసన పలికింది. సేల్స్ ఆపరేషన్స్, ఎర్నింగ్స్ కాల్స్‌లో కీలక పాత్ర పోశించిన గ్రెగ్‌ను శుక్రవారం ఆ కంపెనీ తొలగించినట్లు రెగ్యూలేటరీ సంస్థలకు సమాచారం ఇచ్చింది. సంస్థ తరుపు నుంచి అన్నీ ప్రయోజనాలకు కల్పిస్తూ.. ఎలాంటి కారణం లేకుండానే తొలగించామని ఆ సంస్థ పేర్కొనడం విశేషం. ఫిబ్రవరిలో ఈ కంపెనీ తన 15 శాతానికి సమానమయ్యే 1300 మంది ఉద్యోగులను ఇంటికి పంపించింది. వైదొలగనున్న టొంబ్‌కు 45 మిలియన్ల విలువైన కంపెనీ స్టాక్స్‌తో పాటు 4లక్షల బిలియన్ డాలర్ల వేతనాన్ని చెల్లించనుంది. టొంబ్ స్థానంలో కొత్త వారిని నియమించనున్నట్లు ఆ కంపెనీ తెలిపింది.

కార్పొరేట్లకు నజరానాలు ఆపండి

ఎంఎస్ఎంఈ సంఘాల సదస్సు డిమాండ్



చెన్నై: దేశంలోని బడా కార్పొరేట్‌లకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని ఆపాలని, జీఎస్టీని సవరించాలని ఎంఎస్ఎంఈ సంఘాల సదస్సు డిమాండ్ చేసింది. తమిళనాడులోని కోయంబత్తూరులో ఇటీవల జరిగిన ఎంఎస్ఎంఈ సంఘాల సదస్సులో చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఎదుర్కొంటున్న నష్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీర్చేలా చర్యలు చేపట్టాలని సదస్సు డిమాండ్ చేసింది. చిన్న తరహా పరిశ్రమలపై వేస్తున్న జీఎస్టీ భారాన్ని తగ్గించి ఎంఎస్ఎంఈని రక్షించాలని ఈ సదస్సు కోరింది. బడా కార్పొరేట్లకు, చిన్న పరిశ్రమలకు ఒకేవిధమైన పన్ను విధించడాన్ని ఖండించింది. పరిశ్రమలకు సంబంధించి యుకె సిన్హా కమిటీ ఇచ్చిన సిఫారసులను కేంద్రం తక్షణమే అమలు చేయాలి. దేశీయ చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ప్రత్యేక నిధి ప్యాకేజీని కేటాయించాలని 2006లో ఎంఎస్ఎంఈ చట్ట సవరణలు కోరినట్టుగా కేంద్రం అమలు చేయాలని సదస్సు డిమాండ్ చేసింది. చిన్న పరిశ్రమలకిచ్చే బ్యాంకు రుణాలను సులభతరం చేయాలని డిమాండ్ చేసింది. కొనుగోలు సామర్థ్యం పెరిగేలా, దేశీయ మార్కెట్‌ను విస్తరించాలని డిమాండ్ చేసింది.కాగా, ఈ సదస్సులో దాదాపు వెయ్యిమంది ప్రజలు, ఎంఎస్ఎంఈ పారిశ్రామిక వేత్తలు, కార్మికులు సదస్సులో పాల్గొన్నారు. ఈ సదస్సులో స్పిన్నింగ్ మిల్లులు, పవర్‌లూమ్, కంప్రెసర్, కాయిర్, ప్లాంటేషన్, ప్లంబర్ తదితర 15 సంఘాల ఆఫీస్ బేరర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ఎత్తి చూపారు. ఈ సదస్సులో తమిళనాడు ఎంఎస్ఎంఈ మంత్రి టిఎం అన్బరసన్, కేరళ పరిశ్రమల శాఖ మంత్రి పి.రాజీవ్ ప్రసంగించారు.

తమిళనాడు సీఐటీయూ అధ్యక్షులు ఎ సౌందరరాజన్ ముగింపు వ్యాఖ్యలు చేశారు. కేంద్ర ప్రభుత్వం బడా కార్పొరేట్ల సంస్థల పట్ల స్నేహపూర్వకంగా వ్యవహరిస్తోందని, ఎంఎస్ఎంఈల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సదస్సు విమర్శించింది. ఈ సందర్భంగా సీఐటీయూ నేత కె. కనగరాజ్ తిక్కతీర్ వార్తాపత్రికతో మాట్లాడుతూ.. 'ఎంఎస్ ఎంఈలు ఎంతోమందికి ఉపాధిని అందిస్తున్నాయి. అయితే బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నోట్ల రద్దు, జీఎస్టీ, కోవిడ్ వల్ల విధించిన లాక్‌డౌన్‌ల ద్వారా చిన్న పరిశ్రమలు సంక్షోభంలోకి నెట్టబడ్డాయి. గత ఎనిమిదేండ్లలో బడా కార్పొరేట్లకు రూ. 8 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేశారు. కానీ భారతీయ బ్యాంకులు ఎంఎస్ఎంఈలకు ఇచ్చే రుణాలు కేవలం 4 శాతం మాత్రమే.' అని ఆయన అన్నారు.

చైనా ముట్టడికి అమెరికా పన్నాగం

ప్రాంతీయ భద్రత పేరుతో ఘర్షణలను రెచ్చగొట్టాలన్నదే వారి లక్ష్యం

- చైనాను అణగదొక్కాలని చూస్తున్నారు
- అమెరికా వైఖరిపై మండిపడ్డ చైనా

బీజింగ్ : ఇండో-పసిఫిక్ వ్యూహం ద్వారా 'చైనాను ముట్టించడానికి' అమెరికా ప్రయత్నిస్తోందని చైనా విదేశాంగ మంత్రి కిన్ గాంగ్ విమర్శించారు. "ప్రత్యేకమైన బ్లాక్‌లను ఏర్పాటు చేసి, ఘర్షణలను రెచ్చగొట్టి, ప్రాంతీయ సమగ్రతకు విఘాతం కలిగించాలన్నదే అమెరికా అనుసరించే ఇండో-పసిఫిక్ వ్యూహం లక్ష్యం." అని అన్నారు. బీజింగ్‌లో నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ (ఎన్‌పీసీ) లేదా పార్లమెంట్ సమావేశం సందర్భంగా విదేశాంగ మంత్రిత్వ శాఖ నిర్వహించే వార్షిక పత్రికా సమావేశంలో కిన్ గాంగ్ మాట్లాడారు. "ప్రాంతీయ భద్రతను పరిరక్షించేందుకే ఇండో-పసిఫిక్ వ్యూహం అని చెబుతున్నారు, కానీ, వాస్తవానికి, ఆ వ్యూహం ఘర్షణలను రెచ్చగొడుతోంది. నాటోకు ఆసియా-పసిఫిక్ వర్షన్‌ను సృష్టించాలని భావిస్తోంది." అని అన్నారు. క్వాడ్,అకస్ (ఆస్ట్రేలియా, బ్రిటన్, అమెరికా) గ్రూపులను ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. ఎన్‌పిసి సమావేశాల సందర్భంగా ప్రతినిధి బృందాన్ని ఉద్దేశించి సోమవారం అధ్యక్షుడు జిన్‌పింగ్ మాట్లాడుతూ, అమెరికాను ప్రత్యక్షంగా విమర్శించారు. ఆ తర్వాతే కిన్ వ్యాఖ్యలు వెలువడ్డాయి. చైనాను అన్ని విధాలుగా అదుపు చేయాలని, అణగదొక్కాలని అమెరికా నేతృత్వంలోని పశ్చిమ దేశాలు ప్రయత్నిస్తున్నాయని జిన్‌పింగ్ విమర్శించారు. కీలకమైన పరిశ్రమల్లో స్వావలంబన సాధించాలన్నది ఎన్‌పిసి సమావేశాల ప్రధాన ఉద్దేశ్యంగా వుందని జిన్‌పింగ్ పేర్కొన్నారు. ఈనెల 13వరకు ఈ సమావేశాలు కొనసాగుతాయి. ప్రభుత్వ విభాగాలపై మరింతగా పార్టీ నియంత్రణను తీసుకువచ్చేందుకు, పర్యవేక్షణకు పార్టీ-ప్రభుత్వ యంత్రాంగం ప్రక్షాళనకు పలు చట్టాలను ఈ సమావేశంలో ఆమోదిస్తారని భావిస్తున్నారు. జిన్‌పింగ్ ఆధ్వర్యంలో కేంద్రీకరణ విధానాన్ని కొనసాగించేలా ఈ చర్యలు వుండనున్నాయి. చైనాకు గల 60లక్షల కోట్ల డాలర్ల బ్యాంకింగ్ ఆస్తులను నిర్వహించడానికి అత్యున్నత నియంత్రణా సంస్థ నేషనల్ ఫైనాన్షియల్ రెగ్యులేటరీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు.

చైనా-అమెరికా సంబంధాలు మరింతగా దిగజారుతుండడంపైన ఈ పత్రికా సమావేశంలో కిన్ గాంగ్ సవివరంగా మాట్లాడారు. తైవాన్‌పై చైనా రెడ్‌లైన్‌ను మరోసారి గుర్తు చేశారు. శాంతియుత పునరేకీకరణను అనుసరించడానికి అన్ని రకాలుగా కృషి చేస్తున్నామని చెప్పారు. దాదాపు రెండు గంటల పాటు ఆయన పత్రికా సమావేశంలో మాట్లాడారు. అయతే భారత్‌తో సంబంధాలపై కిన్ ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. బైడెన్ ప్రభుత్వం అనుసరిస్తున్న చైనా విధానంపై ఆయన తీవ్రంగా ధ్వజమెత్తారు. చైనాతో పోటీ పడడం కాదని, చైనాను అన్ని రంగాల్లో అణగదొక్కాలన్నదే వారి లక్ష్యమని విమర్శించారు. తైవాన్ విషయంలో ఆసియా, ఉక్రెయిన్ తరహా సంక్షోభాన్ని చూడరాదని ఆయన వ్యాఖ్యానించారు. ఒకపక్క చైనా సార్వభౌమాధికారాన్ని, ప్రాదేశిక సమగ్రతను కించపరుస్తూ, మరోపక్క ఉక్రెయిన్ సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రత గురించి అమెరికా ఎలా మాట్లాడుతుందని ఆయన ప్రశ్నించారు. దీనిపై ప్రశ్నించే హక్కు ప్రతి ఒక్క జాతీయుడికి వుందన్నారు.

ఆధునీకరణ అంటే పాశ్చాత్యీకరణ కాదు

ఆధునీకరణ అంటే పాశ్చాత్యీకరణ అనే భ్రమను తొలగిస్తామని చెప్పారు. ఈనాడు మానవ వికాస రంగం ఎదుర్కొంటున్న అనేక సవాళ్ళకు చైనా అనుసరించే ఆధునీకరణ విధానం అనేక పరిష్కారాలను చూపుతుందని చెప్పారు. 140కోట్ల మంది జనాభా కలిగిన దేశం ఆధునీకరణ సాధించడమంటే మానవ చరిత్రలోనే అదొక అద్భుతమైన కసరత్తు అని వ్యాఖ్యానించారు. చైనా విదేశాంగ విధానం, విదేశీ సంబంధాల గురించి ఆయన సవివరంగా మాట్లాడారు. చైనా ఆధునీకరణలో ఐదు అంశాలు వుంటాయని,అవి స్వేచ్ఛ, ప్రజలకు ప్రాధాన్యతనివ్వడం, శాంతియుత అభివృద్ధి, పారదర్శకత, అందరినీ కలుపుకుని పోవడం, సమైక్యతతో కష్టించి పనిచేయడమని చెప్పారు.

వలస కార్మికులను కలుసుకున్న స్టాలిన్

చెన్నై : తమిళనాడులోని తిరునెల్వేలి జిల్లాలో వలస కార్మికులను రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ మంగళవారం కలుసుకున్నారు. కార్మికులకు కల్పిస్తున్న సౌకర్యాలు, పని పరిస్థితులు గురించి ఆరా తీశారు. 'మిమ్మల్ని రక్షించడానికే మేం ఇక్కడ ఉన్నాం. మీరు భయపడాల్సిన అవసరం లేదు' అని కార్మికులకు ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. తమిళనాడులో వలసకార్మికులపై దాడులు జరుగుతున్నాయని ఇటీవల బిజెపి విష ప్రచారం చేస్తున్న నేపథ్యంలో జిల్లాలోని కావల్కినరు వద్ద సర్జికల్ గ్లవ్స్ తయారీ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులతో స్టాలిన్ సంభాషించారు. కూలీలకు ఆహారం, వసతి, పని పరిస్థితులు, పని గంటలు, యాజమాన్యాం కల్పిస్తున్న ఇతర సౌకర్యాలను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. తాము సురక్షితంగా ఉన్నామని కార్మికులు తెలిపారు. ఈ పరిశ్రమలో దాదాపు 450 మంది కార్మికులు పనిచేస్తున్నారని, వీరిలో సుమారు 200 మంది బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్ నుంచి వలస కార్మికులని యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. వీరిలో అనేక మంది కార్మికులు కుటుంబాలతో సహా కొన్ని ఏళ్ల నుంచి పనిచేస్తున్నారని చెప్పింది. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ కార్మికులను భయాందోళనలను గురి చేయడానికి కొంత మంది ఉద్దేశ్యపూర్వకంగానే ఇలాంటి పుకార్లను వ్యాప్తి చేస్తున్నారని విమర్శించారు. ఇలాంటి పుకార్లు బిజెపికి వ్యతిరేకంగా ఉన్న కూటమిలో చీలకలు సృష్టించలేవని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో ముఖ్యమంత్రి వెంట మంత్రులు కె. నెహ్రూ, కె. రామచంద్రన్; టి.తుంగరాజ్, కలెక్టర్ పిఎస్ శ్రీధర్ తదితరులు ఉన్నారు.

ఢాకాలో ఏడంతస్తుల భవనంలో పేలుడు

14 మంది మృతి

100 మందికి పైగా గాయాలు

ఢాకా: బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో మంగళవారం భారీ ప్రమాదం సంభవించింది. రద్దీగా ఉండే ప్రాంతంలోని ఏడు అంతస్తుల భవనంలో జరిగిన పేలుడు ఘటనలో 14 మంది మరణించగా, మరో 100 మందికి పైగా గాయపడ్డారు. సాయంత్రం 4.50గంటల సమయంలో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. పాత ఢాకాలోని గొలిస్తాన్ ప్రాంతంలో ఈ ప్రమాదం గురించి తెలిసినవెంటనే అగ్నిమాపక సిబ్బంది, సహాయక సిబ్బంది అక్కడకు చేరు కున్నారు. మంటలను అదుపు చేయ డానికి తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నారు. క్షతగాత్రులను ఢాకా వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్టు పోలీసులు తెలి పారు. ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని చెప్పారు. పేలుడుకు గల కారణాలు ఇంకా వెల్లడి కాలేదు. ఈ పేలుడు ధాటికి భవనంలోని తొలి రెండు అంతస్తులు తీవ్రంగా ధ్వంసమయ్యాయని అధికారులు చెప్పారు. ఈ భవనంలోని కింది అంతస్తులో శానిటరీ ఉత్పత్తులు, గృహోపకరణాలకు సంబంధించిన దుకాణాలు ఉండగా భవనం పక్కనే ఓ బ్యాంకు శాఖ ఉంది. బ్యాంక్ భవనం కూడా దెబ్బతింది. బ్యాంకులో అద్దాలు పగలడంతో ఆ గాజు పెంకులు తగిలి పలువురు ఉద్యోగులకు గాయాలైనట్టు అధికారులు తెలిపారు. మరోవైపు, బంగ్లాదేశ్‌లో వారం రోజుల వ్యవధిలోనే ఇది మూడో పేలుడు ఘటన కావడం ఆందోళన కలిగిస్తుంది.

అమెరికా, దక్షిణ కొరియాలపై చర్యకు సిద్ధం

ఉత్తర కొరియా నేత కిమ్ సోదరి హెచ్చరిక

సియోల్ : అమెరికా, దక్షిణ కొరియాలపై శీఘ్రగతిన చర్య తీసుకోవడానికి తమ దేశం సిద్ధంగా వుందని ఉత్తరకొరియా నేత కిమ్ జోంగ్ ఉన్ సోదరి హెచ్చరించారు. తమ బలాన్ని ప్రదర్శిస్తూ అణు సామర్ధ్యం కలిగిన బి-52 బాంబర్‌ని అమెరికా ప్రదర్శించిన మరుసటి రోజే ఈ హెచ్చరిక వెలువడింది. ఇటీవలి మాసాల్లో అమెరికా, దక్షిణ కొరియాల మధ్య వరుసగా జరుగుతున్న విన్యాసాల్లో భాగంగా కొరియాద్వీపకల్పంపై సోమవారం బి-52 బాంబర్లు చక్కర్లు కొట్టాయి. ఈ నెలాఖరులో ఈ రెండు దేశాల మిలటరీలు కూడా అతిపెద్ద విన్యాసాలను పునరుద్ధరించడానికి సమాయత్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో కిమ్ సోదరి హెచ్చరిక వెలువడింది. అయితే అమెరికా, దక్షిణకొరియాలపై ఎలాంటి చర్య తీసుకుంటారనేది ఆమె వెల్లడించలేదు. కానీ అమెరికా మిలటరీ డ్రిల్స్‌కు ప్రతిస్పందనగా ఉత్తర కొరియా తరచుగా క్షిపణి పరీక్షలను నిర్వహిస్తూనే వుంది. ఒకవేళ ఉత్తర కొరియాపై దాడి జరిగితే ఇది రిహార్సల్స్ అని భావిస్తోంది. "అమెరికా, దక్షిణ కొరియా సైన్యాలు అవిశ్రాంతంగా చేస్తున్న విన్యాసాలను మేం గమనిస్తూనే వున్నాం. ఏ సమయంలోనైనా వాటిపై శీఘ్రగతిన చర్యలు తీసుకోవడానికి కూడా సిద్ధంగానే వున్నాం" అని ఆమె స్పష్టం చేశారు.

ఇస్రో ఆపరేషన్ సక్సెస్..



నెల్లూరు: భారత గగనతల చరిత్రలో ఉత్కంఠ దృశ్యం ఆవిష్కృత మైంది. ఇస్రో ఆపరేషన్ సక్సెస్ అయింది. ఓ ఉపగ్రహాన్ని భారత్ పూర్తి నియంత్రిత విధానంలో సేఫ్ గా మహా సముద్రంపై కూల్చి వేసింది. మేఘ-ట్రోపికస్-1(ఎంటీఐ) ఉపగ్రహాన్ని పసిఫిక్ మహా సముద్రంపై విజయవంతంగా కూల్చివేసినట్టు భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) మంగళవారం రాత్రి ప్రకటించింది. ఈ ఉపగ్రహం భూ వాతా వరణంలోకి తిరిగి ప్రవేశించిందని.. ఆ తర్వాత పసిఫిక్ మహా సముద్రంలో విచ్ఛిన్నమవుతుందని ఓ ప్రకటనలో తెలిపింది. ఈ ప్రయోగాన్ని విజయం తం చేసిన ఇస్రో శాస్త్రవేత్తలను అభినందిస్తూ నెటిజన్లు సామాజిక మాధ్యమా ల్లో పోస్టులు పెడుతున్నారు.చైనా ఉపగ్రహాలు తరచూ కక్ష్య నుంచి అదుపుతప్పి భూవాతవరణంలోకి దూసుకొచ్చిన శకలాలు ప్రపంచ దేశాలను వణికించిన ఘటనలు మనకు తెలిసిందే. దీంతో

మేఘ-ట్రోపికస్-1 ఉపగ్రహం కూల్చివేత..

అప్రమత్తమైన భారత్ కాలం చెల్లిన ఉపగ్రహాలను నియంత్రిత విధానంలో కూల్చి వేయడంపై కసరత్తు చేసి విజయం సాధించింది. వాస్తవానికి అంతరిక్షంలోనే ఇలాంటి ఉపగ్రహాలను పేల్చే సత్తా భారత్‌కు ఉన్నప్పటికీ.. అలా చేస్తే వీటి శకలాలు భవిష్యత్తులో సమస్యాత్మకంగా మారే ప్రమాదం ఉన్నందున నియంత్రిత విధానంలో వాటిని నిర్వీర్యం చేయడంపై కసరత్తు చేసింది. ఇందుకు గాను తక్కువ భూకక్ష్యలో పరిభ్రమించే 'మేఘ-ట్రోపికస్-1(ఎంటీఐ) ఉపగ్రహాన్ని ఎంచుకున్న ఇస్రో.. ఈ ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించింది. మేఘ-ట్రోపికస్-1ను 2011 అక్టోబర్ 12న ఫ్రాన్స్ స్పేస్ ఏజెన్సీ సీఎన్ఈసీతో కలిసి సంయుక్తంగా ప్రయోగించింది. ఉష్ణమండల వాతా వరణ, పర్యావరణంపై అధ్యయనానికి దీన్ని ఉపయోగించాయి. వాస్తవానికి మూడేళ్ల మాత్రమే ఈ ఉపగ్రహం పనిచేస్తుందని తొలుత అంచనా వేశారు. కానీ, ఇది 2021 వరకు నిరంతరాయంగా సేవలు అందించింది.

బీజేపీ భ్రమలు తొలగుతాయి: రాహుల్ గాంధీ



లండన్: శాశ్వతంగా అధికారంలో ఉంటామనే భ్రమలో బీజేపీ ఉందని, అయితే అలా జరగదని కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ పేర్కొన్నారు. భారత్‌లో ప్రజాస్వామ్యానికి జరిగిన నష్టాన్ని చక్కదిద్దటానికి ప్రతిపక్షాలు కలిసికట్టుగా ఉన్నాయని రాహుల్ చెప్పారు. ప్రస్తుతం ఇంగ్లండ్ పర్యటనలో ఉన్న రాహుల్ గాంధీ లండన్‌లోని చతం హౌస్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రసంగిం చారు. 'బీజేపీ పదేండ్లు అధికారంలో ఉండక ముందు మేం పదేండ్లు అధికారంలో ఉన్నాం. అయితే తాము దేశంలో అధికారంలోకి వచ్చామని, ఇక శాశ్వతంగా అధికారంలో ఉంటామని బీజేపీ భ్రమ పడుతుంది. కానీ అలా జరగదు' అని రాహుల్ చెప్పారు. భారత్‌లో ప్రజాస్వామ్యం కుప్పకూలితే అది ప్రపంచంలో ప్రజాస్వామ్య వ్యవస్థకే పెద్ద ముప్పుగా వర్ణించారు. కాబట్టి భారత్‌లో ప్రజాస్వామ్యాన్ని రక్షించడం అందరి బాధ్యతగా తెలిపారు.

అంబేద్కర్ విగ్రహం, అమర జ్యోతి, సచివాలయంపై కవితలకు ఆహ్వానం

- తెలంగాణ సాహిత్య అకాడమి చైర్మెన్ జూలూరు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అద్భుత చారిత్రక కట్టడాలుగా ఆవిష్కరింపబడనున్న అంబేద్కర్ విగ్రహం, అమర జ్యోతి, సచివాలయం నిర్మాణాలపై కవితలను ఆహ్వానిస్తున్నామని తెలంగాణ సాహిత్య అకాడమి చైర్మెన్ జూలూరు గౌరీ శంకర్ తెలిపారు. మూడు అంశాలపైనా విడివిడిగా కవితలను పంపాలని సూచించారు. మంగళవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. చారిత్రక కట్టడాల వైభవాన్ని అక్షరాల్లో ప్రపంచానికి దాటి చెప్పడానికి సృజన కారులంతా కలాలు కదిలించాలని పిలుపునిచ్చారు. అద్భుత కట్టడాల నిర్మాణాలు చూసినప్పుడు ఒళ్ళు పులకరించడం, భావావేశం తన్నుకు రావడం ఖాయమని పేర్కొన్నారు. అంబేద్కర్ విగ్రహం, రాష్ట్ర సచివాలయం, అమర జ్యోతిపై కవులు, విద్యార్థులు, భావుకత ఉన్న రచయితలు 25 లైన్లకు మించకుండా కవితలు రాసి పంపాలని కోరారు. సంగ్రహించిన కవితలతో సంకలనం తేవాలని సాహిత్య అకాడమి సంకల్పించిందని తెలిపారు. మార్చి 31లోగా రాసిన కవితలను tsakademi. 2017@ gmail. comకుగానీ ,9440233261 నెంబర్‌కు వాట్సాప్ ద్వారాగానీ పంపాలని సూచించారు.

కేసీఆర్ రాజీనామా చేయాలి : బండి

బర్త్ సర్టిఫికెట్ల జారీ వైఫల్యానికి బాధ్యత వహిస్తూ సీఎం కేసీఆర్ తన పదవికి రాజీనామా చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, ఎంపీ బండి సంజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నిబంధనలకు విరుద్ధంగా, ఆధారాల్లేకుండా 27వేల బర్త్ సర్టిఫికెట్లు, 4వేల డెత్ సర్టిఫికెట్లు జారీ చేయడం ఆందోళన కలిగిస్తోందని తెలిపారు. దొంగ బర్త్ సర్టిఫికెట్లతో పాస్‌పోర్టులు పొంది పాతబస్తీలో ఉగ్రవాదులు పాగా వేస్తున్నారని ఆరోపించారు. దేశంలో ఎక్కడ అల్లర్లు జరిగినా మూలాలు హైదరాబాద్‌లోనే బయటపడుతున్నాయని పేర్కొన్నారు. కేసీఆర్‌కు చిత్తశుద్ధి ఉంటే బర్త్ సర్టిఫికెట్ల జారీపై సీబీఐ విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. పాతబస్తీలో జారీ చేసిన బర్త్, డెత్ సర్టిఫికెట్లతో పాటు రేషన్, ఓటర్ కార్డులపైనా సమగ్ర దర్యాప్తు చేయించాలని కోరారు. తూతూ మంత్రంగా విచారణ జరిపి కిందిస్థాయి ఉద్యోగులను సస్పెండ్ చేసి చేతులు దులుపుకుంటే ఊరుకోబోమని హెచ్చరించారు.

విద్యుత్ ఉద్యోగుల ఆందోళనలు వాయిదా

- 10న విద్యుత్‌శాఖ మంత్రితో చర్చలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

విద్యుత్ ఉద్యోగుల వేతన సవరణపై ఈనెల 10వ తేదీ విద్యుత్‌శాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డితో చర్చలు జరగనున్న నేపథ్యంలో తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ ప్రకటించిన ఆందోళనలను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్టు ప్రకటించింది. వేతన సవరణతో పాటు ఇతర సమస్యల్ని కూడా పరిష్కరించాలని కోరుతూ ఫిబ్రవరి 24వ తేదీ నుంచి ఆందోళనలు నిర్వహిస్తున్నట్టు జేఏసీ చైర్మెన్ జీ సాయిబాబు, కన్వీనర్ పి రత్నాకరరావు తెలిపారు. విద్యుత్ సౌధలో సీఎమ్‌డీలతో జరిగిన చర్చలు విఫలమయ్యాక, ఆందోళనలు కొనసాగిస్తామని పిలుపునిచ్చామని చెప్పారు. కానీ ఈనెల 10వ తేదీ మంత్రితో చర్చలకు రావాలని యాజమాన్యం ఆహ్వానించిన నేపథ్యంలో బుధవారం నుంచి ప్రారంభం కావల్సి ఉన్నరిలే నిరాహార దీక్షలను తాత్కాలికంగా వాయిదాలి వేయాలని నిర్ణయించామన్నారు. 10వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు చర్చలకు రావాలని విద్యుత్‌శాఖ మంత్రి కార్యాలయం సమాచారం ఇచ్చినట్టు తెలిపారు. ఆ చర్చలు అనంతరం టీఎస్‌పీఈజేఏసీ నాయకత్వం తదుపరి కార్యాచరణను ప్రకటిస్తుందని పేర్కొన్నారు.

ప్యూర్ ఇవి ఎకోడ్రిఫ్ట్ డెలివరీలు ప్రారంభం

హైదరాబాద్ : ప్యూర్ ఇవి ఆవిష్కరించిన చౌక విద్యుత్ మోటర్‌సైకిల్ ఎకోడ్రిఫ్ట్ డెలివరీలను ప్రారంభించినట్లు ప్రకటించింది. తొలి విడత డెలివరీలను హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని తమ డీలర్‌షిప్ ఔట్‌లెట్ల వద్ద అందజేస్తున్నట్లు తెలిపింది. దేశ వ్యాప్తంగా ఉగాది, గుడిపడ్వా రోజు మార్చి 22 నుంచి డెలివరీలను ప్రారంభించనున్నామని పేర్కొంది. ఈ బైకు ప్రారంభ ధరను రూ.99,000గా నిర్ణయించింది. గరిష్ట వేగం గంటకు 75 కిలో మీటర్లతో ప్రయాణిస్తే మూడు డ్రైవింగ్ మోడ్స్‌లో 130 కిలోమీటర్లు ప్రయాణించడానికి ఈ వాహనం మద్దతు చేస్తుందని తెలిపింది. దేశంలో తమకు ప్రస్తుతం 130కి పైగా ఎక్స్‌క్లూజివ్ అవుట్‌లెట్లు ఉన్నాయని.. 2023 ముగింపు నాటికి 300 నగరాలకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపింది.

టిబిజిసి ప్రచారకర్తగా సూర్య కుమార్ యాదవ్



బెంగళూరు : ఫ్యాషన్ మెన్స్‌వేర్ బ్రాండ్ టిబిజిసి తన బ్రాండ్ అంబాసీడర్‌గా క్రికెటర్ సూర్య కుమార్ యాదవ్‌ను నియమించుకున్నట్లు ప్రకటించింది. సూర్య కుమార్ ప్రజాదరణ తమ పూర్తి సరికొత్త శ్రేణీ క్యాజువల్ అప్పెరల్ శ్రేణికి ప్రచారం చేయనున్నారని పేర్కొంది. దేశంలో డిజిటల్ ఫస్ట్ ఫ్యాషన్ మార్కెట్‌ను చేజిక్కుంచుకునేందుకు ఇది మా తొలి అడుగు అని టిబిజిసి ఫౌండర్, సిఇఒ అనంత్ టాంటెడ్ తెలిపారు. సూర్య కుమార్‌తో బలమైన బంధం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నామన్నారు.

స్వీట్ లస్సీని ఆవిష్కరించిన సిడ్స్ ఫార్మ్

హైదరాబాద్ : తెలంగాణా కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న ప్రీమియం డి2సి డెయిరీ బ్రాండ్ సిడ్స్ ఫార్మ్ కొత్తగా తమ నూతన ఉత్పత్తి, స్వీట్ లస్సీని విడుదల చేసినట్లు వెల్లడించింది. ఈ స్వీట్ లస్సీను 200 మిల్లీ లీటర్ల ప్యాకేజ్డ్ డిస్పోజబల్ కప్‌ల్లో అందిస్తోన్నట్లు తెలిపింది. దీని ధరను రూ.30గా నిర్ణయించినట్లు పేర్కొంది. త్వరలోనే బెంగళూరులో దీన్ని అందుబాటులోకి తేనున్నట్లు వెల్లడించింది.

త్రిపురలో జర్నలిస్టులపై బీజేపీ దాడులకు సంఘాల ఖండన

నవతెలంగాణ-హైదరాబాద్

త్రిపురలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు జర్నలిస్టులపై దాడిచేయడాన్ని ఐఎఫ్‌డబ్ల్యూజే, టీడబ్ల్యూజేఎఫ్, ఎన్ఏజే, ఏపీడబ్ల్యూజేఎఫ్ జర్నలిస్టు సంఘాలు ఖండించాయి. ఎన్నికల అనంతరం అకారణంగా స్థానిక జర్నలిస్టులు, ప్రజలపై దాడిచేయడం దారుణమని వ్యాఖ్యానించాయి. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉందనే అహంకారంతోనే జర్నలిస్టులపై దాడులు చేయడం అన్యాయమనీ, మూక దాడులపై విచారణ చేయాలని డిమాండ్ చేశాయి. త్రిపుర రాజధాని అగర్తలలోని శ్రీపల్లిలో ప్రముఖ జర్నలిస్ట్ సమీర్‌ధర్‌పై బీజేపీ మూక భౌతికదాడి చేసి భయపెట్టాలని చూడడటం నీతి మాలిన చర్యగా అభివర్ణించాయి. అలాగే 'ప్రొతిబడి కోలోం' అనే స్థానిక దినపత్రికలో పనిచేస్తున్న మరో జర్నలిస్టు ఇంటిపైనా దాడిచేయడం అమానుషమని విమర్శించాయి. బీజేపీ నాయకులు, కార్యకర్తలు గుండాల్లా వ్యవహరిస్తూ మూక దాడులకు పాల్పడటం ప్రజాస్వామ్య పద్ధతులకు విరుద్ధమని ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈమేరకు ఐఎఫ్‌డబ్ల్యూజే జాతీయ కార్యదర్శి పి.ఆనందం, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.సోమయ్య, ప్రధానకార్యదర్శి బి.బసవపున్నయ్య ఎన్ఏజే నేషనల్ సెక్రెటరీ జనరల్ ఎస్.కొండయ్య, ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి జి. ఆంజనేయులు మంగళవారం వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు.